

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 130

సోమవారం 31-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బౌలింగ్‌లోనూ తడబాటే!

రెండో వన్డేలో వెస్టిండీస్‌ చేతిలో ఓడిపోయిన భారత్‌. -12లో



ఫారెక్స్‌ కార్డ్‌ బెటర్‌!

ఒకేసారి ఎన్నో దేశాల కరెన్సీ లోడింగ్‌.. క్రెడిట్‌ కార్డ్‌ కంటే తక్కువ చార్జీలు -13లో



'మేరీ మాటీ.. మేరీ దేశ్‌'

అమర జవాన్లు, ప్రాణత్యాగం చేసిన పౌరుల గౌరవార్థం ఆగస్టు 15 వరకు ప్రత్యేక కార్యక్రమం చేపడతామని మోదీ ప్రకటించారు.

- వివరాలు 6లో



కరిగిపోతున్న మంచు

ఉత్తరార్ధ గోళంలో ఉష్ణోగ్రతల పెరుగుదలతో అంటార్కిటికాలో రికార్డు స్థాయిలో మంచు కరిగినట్లు సైంటిస్టులు తేల్చారు.

- వివరాలు 6లో



మణిపూర్‌లో బయోమెట్రిక్‌ సర్వే

మయన్మార్‌ అక్రమ వలసదారుల గుర్తింపునకు ఈశాన్య రాష్ట్రాల్లో బయోమెట్రిక్‌ సర్వే కొనసాగుతోంది.

- వివరాలు 6లో



మాస్కోపై మళ్లీ డ్రోన్‌ దాడి

రష్యా రాజధాని మాస్కోలో ఆదివారం డ్రోన్‌ దాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు గాయపడ్డారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్‌

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



వచ్చే నెల 2న నిర్వహించనున్న స్టాఫ్‌నర్స్‌ పోస్టుల పరీక్షకు ప్రభుత్వం కఠిన నిబంధనలు విధించింది. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించేది లేదని మెడికల్‌ అండ్‌ హెల్త్‌ సర్వీసెస్‌ రిక్రూట్‌మెంట్‌ బోర్డ్‌ సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

- వివరాలు 14లో▶

నేడు రెండో విడత ఇంజనీరింగ్‌ సీట్ల భర్తీ



ఇంజనీరింగ్‌ కాలేజీల్లో కన్వీనర్‌ కోటా రెండో విడత సీట్ల కేటాయింపు సోమవారం చేపట్టనున్నారు. మొత్తం 173 కాలేజీల్లో 82,666 సీట్లు అందుబాటులో ఉన్నాయి. తొలిదశలో 70,665 సీట్లు ఎంసెట్‌ అర్హులకు కేటాయించగా...ఇంకా 12,001 సీట్లు మిగిలిపోయాయి.

- వివరాలు 14లో▶

రేపటి నుంచే గురుకుల పరీక్షలు



గురుకులాల్లో ఉద్యోగాల భర్తీ అర్హత పరీక్షలకు సర్వం సిద్ధమైంది. తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు 6.55 లక్షల మంది హాజరుకానున్నారు. రేపటి నుంచి 23 వరకు రోజుకు మూడు సెషన్లలో జరగనున్న ఈ పరీక్షలకు తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు ఏర్పాట్లు చేసింది.

- వివరాలు 14లో▶

ఔటర్‌ చుట్టూ మెట్రో!



5 కొత్త మెట్రో కారిడార్లు కూడా..

రాష్ట్ర ప్రభుత్వ యోచన

నేటి కేబినెట్‌ భేటీలో చర్చించి ఆమోదించే అవకాశం

- మంత్రివర్గ భేటీకి మొత్తం 22 అంశాలతో కూడిన ఎజెండా ఖరారు!
- బీహెచ్‌ఈఎల్‌–లక్డీకాపూల్, నాగోల్‌–ఎల్‌బీనగర్‌ రెండో దశ విస్తరణ
- గవర్నర్‌ తిప్పిపంపిన 4 బిల్లులకు మార్పులు.. అసెంబ్లీలో ఆమోదం
- ప్రైవేటు ఆసుపత్రుల నియంత్రణ చట్టం రద్దు.. టిమ్స్‌ ఆసుపత్రుల కోసం కొత్త బిల్లు.. బుద్వేల్‌ భూములు హెచ్‌ఎండీఏ ద్వారా వేలం తదితర అంశాలు కేబినెట్‌ ముందుకు..
- నేడు సీఎం కేసీఆర్‌ అధ్యక్షతన సమావేశం కానున్న మంత్రివర్గం

సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్‌ ఔటర్‌ రింగురోడ్డు (ఓఆర్‌ఆర్‌) చుట్టూ మెట్రో రైలు మార్గాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీనితో పాటు మరో ఐదు కొత్త మెట్రో కారిడార్లు నెలకొల్పే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ భేటీలో 'మెట్రో' ప్రతిపాదనలపై చర్చించి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపే అవకాశముంది. మెట్రో ప్రాజెక్టు విస్తరణ రెండో దశలో భాగంగా బీహెచ్‌ఈఎల్‌ నుంచి లక్డీకాపూల్‌ వరకు, నాగోల్‌ నుంచి ఎల్బీనగర్‌ వరకు కొత్త లైన్ల నిర్మాణానికి కూడా కేబినెట్‌ గ్రీన్‌సిగ్నల్‌ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నగరంలో ట్రాఫిక్‌ ఎక్కడికక్కడ స్తంభించిపోవడం ప్రభుత్వంపై విమర్శలకు దారితీసింది. దీనికి పరిష్కారంగానే మెట్రో ప్రాజెక్టుల విస్తరణ, కొత్త కారిడార్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. వీటితో పాటు మొత్తం 22 అంశాలతో కూడిన ఎజెండాపై రాష్ట్ర మంత్రివర్గం చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనుంది.

కేంద్ర చట్టం అమలుకు వీలుగా..

మానవ ఆరోగ్యానికి సంబంధించిన ఎలాంటి చికిత్సల (ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో అందుబాటులో ఉండే వాటితో పాటు లేజర్‌ ట్రీట్‌మెంట్, కట్లు లాంటి అన్నిరకాల చికిత్సలకు) కోసమైనా ఏర్పాటు చేసే వైద్య కేంద్రాలపై రాష్ట్ర ప్రభుత్వానికి నియంత్రణ కల్పించే విధంగా

మిగతా 3వ పేజీలో ▶

గవర్నర్‌ తిప్పి పంపిన బిల్లులపై చర్చ



రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించి పంపిన నాలుగు బిల్లులపై పలు వివరణలను కోరుతూ గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌ వాటిని ప్రభుత్వానికి తిప్పి పంపారు. తెలంగాణ పబ్లిక్‌ ఎంప్లాయిమెంట్‌ బిల్లు, తెలంగాణ స్టేట్‌ ప్రైవేట్‌ యూనివర్సిటీల బిల్లు, తెలంగాణ పంచాయతీ రాజ్‌ చట్ట సవరణ బిల్లు, తెలంగాణ మున్సిపల్‌ చట్ట సవరణ బిల్లులను గవర్నర్‌ గతంలో వెనక్కు పంపారు. గవర్నర్‌ అడిగిన వివరణలకు సమాధానమిచ్చే విధంగా ఈ బిల్లుల్లో మార్పులు చేస్తూ రూపొందించిన ముసాయిదాలపై చర్చించే ప్రతిపాదనను కేబినెట్‌ ఎజెండాలో చేర్చారు. మంత్రివర్గ భేటీలో చర్చించిన తర్వాత వచ్చే నెల 3వ తేదీ నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో వాటిని ప్రవేశపెట్టి ఆమోదించి మళ్లీ గవర్నర్‌కు పంపే అవకాశముందనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది.



వరంగల్‌ ఎయిర్‌పోర్టుకు ఓకే?

3లో

- నేడు జరగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చ
- వెయ్యి ఎకరాల్లో నిర్మాణం.. ప్రస్తుతానికి డొమెస్టిక్‌ సేవలే

నేడు, రేపు మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్‌ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్‌ జిల్లాల్లోని కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. రాష్ట్రానికి పశ్చిమ దిశ నుంచి బలంగా గాలులు వీస్తున్నాయని వివరించింది. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటివరకు రాష్ట్రంలో 35.31 సెంటీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా... 55.91 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో మల్లన్న వాగు ఉధృతికి రోడ్డు కోతకు గురవడంతో బ్రిడ్జి దాటేందుకు నిచ్చెన ఎక్కుతున్న గిరిజనులు 2లో

భద్రాచలం వద్ద తగ్గిన వరద ఉధృతి

50.9 అడుగులకు చేరిన నీటిమట్టం

- మూడో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- ఈ సంవత్సరం 831.357 టీఎంసీల గోదావరి జలాలు కదలిపాలు

సాక్షి, హైదరాబాద్‌/భద్రాచలం/ధరూరు: పరీవాహక ప్రాంతంలో వర్షాలు తెరిపినివ్వడంతో ఎగువ గోదావరిలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. భద్రాచలం వద్ద వరద ఉధృతి క్రమంగా తగ్గుతుండటంతో మూడో ప్రమాద హెచ్చరికను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఆదివారం రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్దకు ప్రవాహం 12,79,307 క్యూసెక్కులకు తగ్గింది. నీటిమట్టం 56 అడుగుల నుంచి 50.4 అడుగులకు తగ్గింది. ప్రస్తుతం అక్కడ రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లలో వర్షాలు ఆగిపోవడంతో గోదావరిలో వరద తగ్గుతోంది. మరోవైపు, శ్రీరాంసాగర్‌లోకి ప్రవాహం 8,100 క్యూసెక్కులకు పడిపోవడంతో ప్రాజెక్టు గేట్లను మూసేశారు. ఎల్లంపల్లి వద్ద 44,354, పార్వతి బ్యారేజ్‌ వద్ద 30,150, సరస్వతి బ్యారేజ్‌ వద్ద 43,615 క్యూసెక్కులకు వరద తగ్గిపోయింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజ్‌ నుంచి 5.71 లక్షలు, తుపాకుల గూడెం బ్యారేజ్‌ నుంచి 9.15 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. శ్రీరామ్‌ సాగర్, కడెం ప్రాజెక్టుల నుంచి ప్రవాహం తక్కువగా ఉండటంతో భద్రాచలం వద్ద గోదావరి వరద సోమవారం మరింతగా తగ్గొచ్చని అంచనా వేస్తున్నారు.

జూరాలలో..: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఉదయం 7 గంటలకు 1,58,655 క్యూసెక్కుల

మిగతా 2వ పేజీలో ▶

పాక్‌లో ఆత్మాహుతి దాడి



44 మంది మృతి

మరో 200 మందికి గాయాలు.. చాలా మంది పరిస్థితి విషమం

- అఫ్గాన్‌ సరిహద్దులో ఓ రాజకీయ పార్టీ సభ జరుగుతుండగా ఘటన
- ఐసిస్‌ దుశ్చర్యగా పోలీసుల అనుమానం

6లో

◀ పేలుడు జరిగిన ప్రదేశంలో సహాయక చర్యలు చేపడుతున్న స్థానికులు



బోధన.. వేదన

- అన్ని వర్సిటీల్లోనూ ఆచార్యుల కొరత
- కుంటుపడుతున్న విద్యాప్రమాణాలు
- జాతీయస్థాయి ర్యాంకుల్లో వెనుకబడుతున్న విశ్వవిద్యాలయాలు
- మంజూరు చేసిన పోస్టులు 2,837.. ఇప్పటికీ ఉన్న ఖాళీలు 1,869
- రెగ్యులర్‌ అధ్యాపకులు 968 మందే..

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరత విద్యాప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జాతీయ ర్యాంకింగ్‌లో యూనివర్సిటీలు వెనకబడుతున్నాయి. నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ర్యాంకింగ్‌ ఫ్రేమ్‌వర్క్‌ (ఎన్‌ఐఆర్‌ఎఫ్‌–2023)లో దశాబ్దాల చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ ఓవరాల్‌ ర్యాంకులో 64కు పడిపోయింది. గతేడాది ఓయూ 46వ ర్యాంకులో నిలిచింది. జేఎన్‌టీయూహెచ్‌ గతేడాది 76వ ర్యాంకుతో ఉంటే ఈ ఏడాది 98వ ర్యాంకుతో సరిపెట్టుకుంది. అధ్యాపకుల కొరతే ఈ పరిస్థితికి కారణమని అన్ని వర్గాలూ భావిస్తున్నా ప్రభుత్వం మాత్రం దీన్ని పట్టించుకోవడం లేదు. గతేడాది తెలంగాణ యూనివర్సిటీల కామన్‌

మిగతా 3వ పేజీలో ▶

అత్యవసర వైద్యసేవలకు 466 వాహనాలు

→ వైద్యారోగ్యశాఖ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర సేవలకు కొత్తగా 466 వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. వీటిని వచ్చే నెల ఒకటో తేదీన ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు కొత్త వాహనాలను కొనుగోలు చేశారు. 108, 102 అనే హెల్ప్‌లైన్‌ సేవల నంబర్లు స్పష్టంగా కనిపించేలా బ్రాండింగ్‌ చేశారు. సీఎం కేసీఆర్‌ ఫొటో, తెలంగాణ ప్రభుత్వ లోగో స్పష్టంగా కనిపిస్తున్నాయి. పార్థివ వాహనాల సేవలు ఉచితంగా అందిస్తామనే విషయాన్ని తెలిపేవిధంగా ఉచిత సేవ అని ముద్రించారు.

- వివరాలు 5లో

గుడ్‌బై ఇండియా..!

→ పుష్కర కాలంలో ఏకంగా సుమారు 18 లక్షల మంది మన దేశ పౌరుని హోదాను వదులుకున్నారు. కొన్ని పాశ్చాత్య దేశాల్లో ఉన్న విధంగా భారత్‌లో ఉమ్మడి పౌరసత్వానికి ఆమోదం లేకపోవడంతో భారతదేశ పౌరసత్వాన్ని కాదనుకుని విదేశాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఒకటీ రెండు కాదు.. ఏకంగా 135 దేశాల్లో అక్కడి సిటిజెన్‌షిప్‌ తీసుకున్న భారతీయులు ఉన్నారు. విదేశాంగ శాఖ గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. - 14లో





రూ.914 కోట్లతో ఆదుకోండి

- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సూచన
- వరదలతో నష్టపోయిన వారికి తక్షణమే సహాయం చేయాలని డిమాండ్‌

2లో

◀ వరంగల్‌ బీఆర్‌ నగర్‌లో వరద ముంపునకు గురైన ఓ ఇంటిని పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి

నేడు రాష్ట్రానికి కేంద్ర బృందం

వరద నష్టంపై అంచనాకు జిల్లాల్లో పర్యటన 2లో





ఇదండీ సంగతి




మరోసారి ఇక ఎవ్వరూ దరఖాస్తు చేయరు సార్‌!

మెడికల్‌ సీట్లు మిగులుతున్నాయ్‌!

దేశంలో మూడేళ్లలో భర్తీకాని సీట్లు

ఎంబీబీఎస్‌	పీజీ మెడికల్‌
860	12,758



- నాన్‌ క్లినికల్‌ పీజీ మెడికల్‌ సీట్లపై నీలినీడలు
- ఆ కోర్సులతో బయట బతికే పరిస్థితి లేని వైనం
- ఎనిమిదేళ్లలో 36,585 బీడీఎస్‌ సీట్ల మిగులు
- నాన్‌ క్లినికల్‌ సీట్లను తగ్గించి క్లినికల్‌ సీట్లను పెంచాలని డిమాండ్‌

వైద్య విద్య చదవాలని కోరుకునే వారి సంఖ్య పెరుగుతోంది. దీంతో నీట్‌ పరీక్ష రాసేవారూ పెరుగుతున్నారు. మరోవైపు కాలేజీలు, సీట్లు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. తద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్‌ సహా ఎండీ, ఎంఎస్, ఎండీఎస్‌ వంటి పీజీ కోర్సుల్లో చేరాలని ఉవ్విళ్లూరుతుంటారు. ఆయా సీట్లకు భారీ డిమాండ్‌ ఉంటుంది. కానీ మెడికల్‌ సీట్లు మిగులుతుండటం విస్మయం కలిగిస్తోంది.

సాక్షి, హైదరాబాద్‌

దేశంలో గత మూడేళ్లలో మొత్తం 860 ఎంబీబీఎస్, 12,758 పీజీ మెడికల్‌ సీట్లు మిగిలినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తాజాగా వెల్లడించింది. అలాగే గత ఎనిమిదేళ్లలో 36,585 బీడీఎస్‌ సీట్లు కూడా మిగిలినట్లు తెలిపింది. 2016–23 మధ్యకాలంలో మొత్తం 1,89,420 బీడీఎస్‌ సీట్లు అందుబాటులో ఉండగా, అందులో 36,585 మిగలడమంటే ఆశ్చర్యం కలుగుతుంది. 2017–23 మధ్య 38,487 ఎండీఎస్‌ సీట్లు ఉంటే వాటిల్లో 5 వేలకుపైగా ఖాళీగా ఉండిపోయాయి. తెలంగాణలోనూ గతేడాది 200కుపైగా పీజీ మెడికల్‌ సీట్లు మిగిలిపోగా, దాదాపు 30 వరకు ఎండీఎస్‌ సీట్లు మిగిలినట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ వర్గాలు చెప్పాయి. ఎంబీబీఎస్‌ పూర్తి చేసిన విద్యార్థులు మెడికల్‌ పీజీ చేయాలని కోరుకుంటారు. తద్వారా స్పెషలిస్టు వైద్యులుగా తమ కెరీర్‌ను మలుచుకుంటారు. అందువల్ల క్లినికల్‌ విభాగంలోని సీట్లకు ప్రైవేటు మెడికల్‌ కాలేజీల్లో లక్షలు కుమ్మరించి చేరుతుంటారు. ఒక్క సీటు కూడా మిగలదు. కానీ నాన్‌ క్లినికల్‌ పీజీ సీట్లను పట్టించుకునే నాథుడే లేడు. అంతేకాదు సాధారణ ఫీజు చెల్లిస్తే చాలని, డొనేషన్‌ వద్దని, తమ కాలేజీల్లో చేరాలని ప్రైవేట్‌ మెడికల్‌ కాలేజీలు కోరుతున్నా పట్టించుకునే దిక్కులేదు.

ఉపాధి లేని కోర్సులతో సీట్ల మిగులు

2020–21 విద్యా సంవత్సరంలో 83,275 యూజీ, 55,495 పీజీ మెడికల్‌ సీట్లు అందుబాటులో ఉండగా, 2021–22లో 91,927 యూజీ, 60,202 పీజీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంబీబీఎస్‌ సీట్లలో కొన్ని మిగలడానికి ప్రధాన కారణం ఎన్‌ఆర్‌ఐ కోటా ఫీజులు భారీగా ఉండటమేనని చెబుతున్నారు. కొన్ని బీ కేటగిరీ సీట్లకూ భారీగానే ఫీజులు వసూలు చేస్తున్నారు. మధ్యతరగతి తల్లిదండ్రులకు

మిగతా 2వ పేజీలో ▶



ఇస్రో మరో వాణిజ్య విజయం

→ ఇస్రో, న్యూస్పేస్‌ ఇండియా లిమిటెడ్‌ సంయుక్తంగా చేపట్టిన పీఎస్‌ఎల్‌వీ సీ–56 ఉపగ్రహ వాహకనౌక ప్రయోగం విజయవంతమైంది. ఏపీలోని షార్‌ కేంద్రం నుంచి ఆదివారం ఉదయం 6:31 గంటలకు రాకెట్‌ అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. సింగపూర్‌కు చెందిన ఏడు ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. దీంతో ఈ ఏడాదిలో ఇస్రో మూడో వాణిజ్య విజయాన్ని సొంతం చేసుకున్నట్లయింది. పీఎస్‌ఎల్‌వీ రాకెట్‌ సిరీస్‌లో చేపట్టిన 58 ప్రయోగాల్లో ఇది 56వ విజయం కావడం విశేషం. - 6లో

క్లుప్తంగా...

కొనసాగుతున్న గాలింపు చర్యలు

ఆదివారం రాత్రి దొరికిన మరో మహిళ మృతదేహం



డ్రోన్ ద్వారా గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు

భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లిలో నాలుగు రోజుల క్రితం వరద ఉధృతిలో కొట్టుకుపోయిన వారిలో ఇప్పటివరకు ముగ్గురి ఆచూకీ లభించింది. కాగా, మరొకరి ఆచూకీ లభించాల్సి ఉంది. మొత్తం నలుగురికి గాను రెండు మృతదేహాలు శనివారం లభించగా...మరో మహిళ మృతదేహం ఆదివారం రాత్రి భూపాలపల్లి మండలం నేరేడుపల్లి సమీప చిర్రవంట చెరువువద్ద కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాంనర్సింహారెడ్డి అక్కడికి చేరుకుని ఆయా కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా ఆమెను గొర్రె వజ్రమ్మగా గుర్తించారు. కాగా, వజ్రమ్మతోపాటు కొట్టుకుపోయిన గడ్డం మహాలక్ష్మి ఆచూకీ ఇంకా లభించలేదు. ఆమె కోసం జిల్లాలోని మోరంచవాగు, మానేరువాగు పరీవాహక ప్రాంతాలతోపాటు భూపాలపల్లి, చిట్యాల, మల్హర్ మండలాల పోలీసులు డ్రోన్‌ల ద్వారా సమీప గ్రామాల్లోని ప్రజలతో గాలింపు చర్యలు చేపడుతున్నారు.

తండ్రీకొడుకులను రక్షించిన పర్యాటకుడు

సంగారెడ్డి జిల్లా జాడిమల్కాపూర్ వాటర్‌ఫాల్ వద్ద ఘటన



నీటిలో కొట్టుకుపోతున్న వారిని రక్షిస్తున్న పర్యాటకుడు

జహీరాబాద్ టౌన్: వాటర్ ఫాల్‌ను చూసేందుకు వచ్చిన తండ్రీకొడుకులు ప్రమాదవశాత్తూ నీటి ప్రవాహానికి కొట్టుకుపోతుండగా ఓ పర్యాటకుడు రక్షించాడు. వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని జాడిమల్కాపూర్ వాటర్ ఫాల్(ఎత్తిపోతల)కు జలకళ సంతరించుకుంది. ఆదివారం కావడంతో వాటర్‌ఫాల్ చూసేందుకు పర్యాటకులు జహీరాబాద్, కర్ణాటకలోకి బీదర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో తరలి వచ్చారు. ఈక్రమంలో మద్యంతాగిన ఓ వ్యక్తి తన కుమారుడితో కలిసొచ్చాడు. అక్కడ ప్రమాదవశాత్తూ తండ్రీకొడుకులు నీటి ప్రవాహానికి కొట్టుకుపోతుండటం చూసిన తోటి పర్యాటకుడు వెంటనే వారిని పట్టుకుని రక్షించి ఒడ్డుకు చేర్చాడు.

అర్హులందరికీ బీసీ బంధు

మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట జిల్లా కేంద్రంలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీసీబంధు..అర్హులైన లబ్ధిదారులందరికీ అందుతుందని, విడతలవారీగా దరఖాస్తు చేసుకున్నవారికి అందించే నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లాకేంద్రంలో ఇంటింటికీ చెట్ల పంపిణీ, భవన నిర్మాణరంగ కార్మికసంఘ బహిరంగసభ, బీసీ బంధు ద్వారా 300 మంది లబ్దిదారులకు చెక్కుల పంపిణీ తదితర కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బీసీలకు లోన్లు ఇవ్వడంలో అనేక సమస్యలు సృష్టించేవని, సగం సబ్సిడీ, సగం అప్పుగా రుణాలు ఇచ్చేవని, ఇప్పుడు పూర్తిగా ఉచితంగా రూ.లక్ష ఏ కొర్రీ లేకుండా అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో బీసీబంధు పథకం సిద్దిపేటలో ప్రారంభం కావడం సంతోషంగా ఉందని తెలిపారు. తండ్రివలే కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి తోడ్పడుతున్నారని, రైతుబీమా తరహాలో కార్మిక బీమాను రూ. 3లక్షల వరకు పెంచుతున్నామన్నారు. గతంలో తెలంగాణకు వ్యతిరేకంగా నినదించిన మాజీ ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, కిరణ్‌కుమార్‌రెడ్డి సపోర్టు చేస్తున్న పార్టీలు కావాలా, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. అనంతరం మంత్రి మల్లారెడ్డితో ఫోన్‌లో హరీశ్‌రావు మాట్లాడిన మాటలు కార్మికులను నవ్వించాయి. మిషన్‌కాకతీయ, కాళేశ్వరం జలాలు, రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీ కారణంగా చేపల ఉత్పత్తి పుష్కలంగా పెరిగిందని, పశ్చిమబెంగాల్, విజయవాడ, కాకినాడ, హైదరాబాద్‌కు సిద్దిపేట చేపల ఉత్పత్తులు వెళ్లడం సంతోషంగా ఉందన్నారు.

ఆ రూ.914 కోట్లతో ఆదుకోండి

- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచన
- వరదలతో నష్టపోయిన వారిని తక్షణమే ఆదుకోవాలని డిమాండ్
- ముంపు ప్రాంతాల్లో నేడు కేంద్ర బృందాల పర్యటన



వరద ముంపు ప్రాంతాల్లో బాధితులను పరామర్శిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, వరంగల్: ప్రకృతి వైపరీత్యాలు, వరదలతో నష్టపోయిన బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సర్కారు వద్ద ఉన్న రూ.914 కోట్ల జాతీయ విపత్తు నిధులతో బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 2021–22 వరకు రూ.736 కోట్లు, 2022–23లో రూ.178 కోట్లు రాష్ట్ర ఖజానాకు జమయ్యాయని, ఆ నిధులతో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి వరంగల్‌లో వరద ముంపు ప్రాంతాలను కలెక్టర్లు, బీజేపీ నాయకులతో కలిసి కిషన్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. బాధితులకు పార్టీ పరంగా నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేఎస్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి, గ్రేటర్ వరంగల్‌లో మీడియాతో మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపలేదు..

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమైన రూ.914 కోట్లతో పాటు ప్రస్తుత 2023–24 సంవత్సరానికి సంబంధించిన రూ.197 కోట్లు కూడా ఉన్నాయని, నిధుల వినియోగ సర్టిఫికెట్లు (యూసీలు) సమర్పిస్తే ఆ నిధులు కూడా జమవుతాయని కిషన్‌రెడ్డి తెలిపారు. గతంలో ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి పదివేలు ఇస్తామన్న కేసీఆర్ ఇప్పటివరకు ఇవ్వలేదని ఆరోపించారు. తాజా వర్షాలు, వరద నష్టంపై రాష్ట్ర ప్రభుత్వం ఇంకా నివేదిక పంపలేదని చెప్పారు. మానవతా దృక్పథంతో కేంద్ర ప్రభుత్వమే బృందాలను పంపించిందని, సోమవారం నుంచి ఆ బృందాలు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తాయని తెలిపారు. ఆ బృందాల నివేదిక ప్రకారం కేంద్రం ఆదుకునే చర్యలు చేపడుతుందన్నారు. వరదల్లో మృతి చెందినవారి కుటుంబాలకు ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధుల కింద రూ.4 లక్షల నష్టపరిహారం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 2020 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫసల్ బీమాను అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క 2023 సంవత్సరంలోనే ఐదు లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోయారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా బీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు.

బాధితులను కలుస్తూ భరోసా

కిషన్‌రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి బాధితులను కలిసి, వారి బాధలు వింటూ భరోసా కల్పించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లికి చేరుకున్న ఆయన ర్యాకం విజయ, నర్సారెడ్డిలతో పాటు పలువురు బాధిత కుటుంబాలను కలిశారు. నీట మునిగి, బురదమయమైన ఇండ్లు, పంటలను చూసి చలించిపోయారు. వరద నష్టం, సహాయక చర్యలను కలెక్టర్ భవేశ్‌మిశ్రాను అడిగి తెలుసుకున్నారు. మోరంచపల్లిలో వరదలకు గల్లంతైన గడ్డం మహాలక్ష్మి, గంగిడి సరోజనల కుటుంబాలను పరామర్శించారు. రూ.4 లక్షల పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రేటర్ వరంగల్ పోతననగర్‌లో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ఆ వ్యాఖ్యలు..సోయం వ్యక్తిగతం

జనగామ పార్టీ కార్యాలయంలో గిరిజన కులసంఘాల నాయకులు కిషన్‌రెడ్డిని కలిసి ఎంపీ సోయం బాపూరావును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేయగా.. 'బాపూరావు చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం.. పార్టీకి ఎలాంటి సంబంధం లేదు' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలోని లంబాడీలపై ఆదిలాబాద్ ఎంపీ బాపూరావు ఇటీవల చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించిన తెలిసిందే.

వంతెన ఎక్కాలంటే నిచ్చెన వేసుకోవాల్సిందే..!

ఇటీవలి వర్షాలతో కోతకు గురైన రోడ్లు

గుండాల: ఇటీవల నాలుగు రోజులపాటు కురిసిన భారీవర్షాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు ప్రాంతాల రోడ్లు కోతకు గురయ్యాయి. ముఖ్యంగా గుండాల, ఆళ్లపల్లి వంటి మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి అధ్వానంగా మారింది. గుండాల- సాయనపల్లి మధ్యనున్న మల్లన్నవాగు బ్రిడ్జికి రెండువైపులా రోడ్డు కోతకు గురైంది. మోదుగులగూడెం- నడిమిగూడెం మధ్య కిన్నెరసానిపై ఉన్న బ్రిడ్జి పరిస్థితి కూడా అంతంతే. మల్లన్నవాగు బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగించేవారు నిచ్చెన వేసుకుని దాటాల్సి వస్తోంది. నిత్యావసర సరుకులు, ఎరువుల బస్తాలు మోసుకుని వెళ్లేవారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు రాష్ట్రానికి కేంద్ర బృందం

వరద నష్టంపై అంచనాకు జిల్లాల్లో పర్యటన

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రంలో జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందం సోమవారం నుంచి రాష్ట్రంలో పర్యటించనుంది. జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ) సలహాదారుడు కునాల్ సత్యార్థి నేతృత్వం వహించనున్న ఈ బృందంలో వ్యవసాయం, ఆర్థిక, జలశక్తి, విద్యుత్, రహదారులు, రవాణ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ వంటి మంత్రిత్వ శాఖల అధికారులు ఉండనున్నారు. ఈ బృందం జిల్లాల్లో పర్యటించి జరిగిన నష్టంపై అంచనా వేయడంతో పాటు స్థానికంగా చేపట్టిన సహాయ, పునరావాస కార్యక్రమాలను పరిశీలిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం వరద నష్టంపై కేంద్రానికి నివేదిక సమర్పించిన అనంతరం ఈ బృందం మరోసారి రాష్ట్ర పర్యటనకు వచ్చి నష్టంపై సమగ్ర మదింపు చేస్తుంది. అనంతరం తమ సిఫారసులతో కేంద్రానికి తుది నివేదికను సమర్పిస్తుంది. తీవ్ర విపత్తుగా పరిగణించాలా? వద్దా? అనే అంశాన్ని సైతం సిఫారసు చేయనుంది. వీటి ఆధారంగా రాష్ట్రానికి చేసే సాయంపై కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది. వరదలతో జరిగిన ప్రాణ, ఆస్తి నష్టం, దెబ్బతిన్న పంటలు, ధ్వంసమైన రోడ్లు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని నిధులు కేటాయించే అవకాశం ఉంది. వరద నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాన్ని పంపాలన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వినతి మేరకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే.

మెడికల్ సీట్లు మిగులుతున్నాయ్!

▶ మొదటి పేజీ తరువాయి

వైద్యరంగంలో ప్రైవేట్ కాలేజీ ఫీజులే ప్రధాన అడ్డంకిగా చెబుతున్నారు. తెలంగాణలో మాత్రం గతేడాది ఒక్క ఎంబీబీఎస్, బీడీఎస్ సీటు కూడా మిగలలేదు. కానీ దేశంలోని ఇతర రాష్ట్రాల్లో మిగులుతున్నాయి. ఇక పీజీ మెడికల్ సీట్ల విషయానికి వస్తే, నాన్ క్లినికల్ కోర్సుల్లో అనాటమీ, ఫిజియాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, ప్యాథాలజీ, మైక్రోబయోలజీ, ఎస్పీఎం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ వంటివి ఉన్నాయి. ఈ కోర్సులు చేసినవారికి ప్రధానంగా మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీగా చేయడానికి వీలుంటుంది. ఫోరెన్సిక్ మెడిసిన్ వంటి వాటికి ఇతరత్రా అవకాశాలుంటాయి. కానీ క్లినికల్ కోర్సుల మాదిరి నాన్ క్లినికల్ సబ్జెక్టులకు డిమాండ్ ఉండదు. అయితే కొన్నేళ్లుగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఖాళీలను భర్తీ చేయకపోవడంతో ఈ కోర్సులు చేసినవాళ్లు ఖాళీగా ఉంటున్నారు.

రూ.40–50 వేలకే...

ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు నాన్ క్లినికల్ విభాగాల్లో చేరడానికి ఆసక్తి చూపడంలేదు. ఒకప్పుడు ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో రూ.లక్షకు పైగా జీతాలు తీసుకున్నవారు, ఇప్పుడు రూ.40–50 వేలకే పనిచేయాల్సిన దుస్థితి. కొన్నిసార్లు ఆ మేరకైనా అవకాశాలు దొరికే పరిస్థితి లేకుండా పోయింది. క్లినికల్ విభాగాలైన జనరల్ మెడిసిన్, రేడియాలజీ, నెఫ్రాలజీ, న్యూరో, ఆర్థో, గైనిక్ తదితర కీలకమైన వాటిపైనే దృష్టిసారిస్తున్నారు. బయట ప్రాక్టీస్ చేయడానికి, కార్పొరేట్ ఆసుపత్రుల్లో భారీ జీతాలు పొందడానికి క్లినికల్ మెడికల్ కోర్సులే ఉపయోగపడతాయి. దీంతో నాన్ క్లినికల్ సీట్లను తగ్గించి క్లినికల్ సీట్లనైనా పెంచితే బాగుంటుందని ఎంబీబీఎస్ విద్యార్థులు కోరుతున్నారు. ఇక డెంటల్ కోర్సుల్లో చేరకపోవడానికి ప్రధాన కారణం.. వృత్తిపరమైన వృద్ధి లేకపోవడం, జీతాలు తక్కువగా ఉండటమేనని అంటున్నారు.

దేశంలో నీట్ యూజీ రాస్తున్న విద్యార్థులు

సంవత్సరం	రాసినవారు
2020	13,66,945
2021	15,44,273
2022	17,64,571
2023	20,38,596

దేశంలో ఎంబీబీఎస్, పీజీ మెడికల్ సీట్లు

సంవత్సరం	ఎంబీబీఎస్	పీజీ
2020-21	83,275	55,495
2021-22	91,927	60,202
2022-23	96,077	64,059
2023-24	1,07,948	67,802

దేశంలో గత మూడేళ్లలో మిగిలిన మెడికల్ సీట్లు

సంవత్సరం	యూజీ	పీజీ
2020-21	273	4,614
2021-22	326	3,744
2022-23	261	4,400

స్కూళ్లలో సంఘాలకు నోఎంట్రీ

- డీఈఓలకు పాఠశాల విద్య డైరెక్టర్ సర్క్యులర్
- ప్రభుత్వ చర్యలపై మండిపడుతున్న విద్యార్థి నేతలు



సాక్షి, హైదరాబాద్: ఇకపై ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలోకి కూడా విద్యార్థి సంఘాలు అడుగు పెట్టడం కష్టమే. ఏ విద్యార్థి సంఘాన్ని అనుమతించవద్దంటూ డీఈఓలకు పాఠశాల విద్య డైరెక్టర్ సర్క్యులర్ జారీ చేశారు. ఏదైనా పాఠశాలలోకి ఏ విద్యార్థి సంఘం నాయకుడైనా వచ్చినట్టు రుజువైతే దానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆ సర్క్యులర్‌లో పేర్కొంది. ఒకవేళ విద్యార్థిసంఘం నేతలు స్కూలుకు వస్తే హెచ్ఎంపై కఠినచర్యలూ తప్పవని హెచ్చరించింది. ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులతో పాఠశాలవిద్య డైరెక్టర్ దేవసేన ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యార్థి సంఘాలను కట్టడి చేయడమే లక్ష్యంగా ఈ కాన్ఫరెన్స్ జరిగినట్టు సమాచారం. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో విద్యాసంస్థలు కేంద్రంగా ఎలాంటి వ్యతిరేకత రాకుండా చూడాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకే పాఠశాలవిద్య డైరెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు విద్యాశాఖవర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు, మోడల్ స్కూల్స్, కేజీబీవీలకు ఈ నిబంధన వర్తిస్తుందని ఆమె తెలిపినట్టు డీఈఓలు చెబుతున్నారు. స్వచ్ఛంద సంస్థలు, పార్టీలు, సంఘాలు, వ్యక్తులు, విద్యా సంఘాలు ఎవరైనా సరే ముందుగా డీఈఓ అనుమతి తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. దీనిపై విద్యార్థి సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఇది అప్రజాస్వామికమని, విద్యార్థి సమస్యలపై నినదించే హక్కు తీసివేయడం తగదంటున్నాయి.

హెచ్‌ఎంలలో ఆందోళన

విద్యార్థి సంఘాలను అడ్డుకోవడం ఎలా సాధ్యమని హెచ్ఎంలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికిప్పుడు నిర్బంధం విధిస్తే వారినుంచి ప్రతిఘటన వస్తుందని, ఈ నేపథ్యంలో పోలీసులు జోక్యం చేసుకుంటే ప్రశాంతమైన పాఠశాల ప్రాంగణంలో అశాంతి నెలకొంటుందంటున్నారు.

ముందస్తు అనుమతితో వెళ్లాలి



ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల లోకి ఎవరు వెళ్లాలన్నా తప్పకుండా ప్రిన్సిపాల్ తోపాటు సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలి. ఈ ఆదేశాలు గతం నుంచే ఉన్నాయి. ప్రస్తుతం పై నుంచి కూడా మౌఖికంగా ఆదేశాలు వచ్చాయి.

– రవీందర్, మహబూబ్‌నగర్ డీఈఓ

అప్రజాస్వామికం



టి.నాగరాజు

విద్యార్థి సంఘాలను స్కూళ్లకు రాకుండా నిషేధించడం అప్రజాస్వామికం. స్కూళ్లల్లో ఉండే సమస్యలు వెలుగులోకి వస్తాయని ప్రభుత్వం భయపడుతోంది. అందుకే నిర్బంధం అమలు చేస్తోంది. ప్రజాస్వామ్యంలో విద్యార్థి ఉద్యమాలు ఓ భాగం. కనీస నైతికహక్కును కాలరాయడం ఫాసిస్ట్ విధానాలకు సంకేతం. ప్రభుత్వం మన ఊరు–మనబడి వంటి కార్యక్రమాల్లో జరిగే అవినీతి బయట కొస్తుందని భయపడుతుంది. ఈ ఆదేశాలు వెనక్కి తీసుకోవాలి.

– ఆర్‌ఎల్.మూర్తి, టి.నాగరాజు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

ఇదెక్కడి రాచరికం



విద్యార్థి ఉద్యమాల ద్వారా ఏర్పడిన తెలంగాణలో విద్యార్థి సంఘాలపై నిర్బంధం ఇదెక్కడి రాచరిక ప్రభుత్వమో అర్థం కావడం లేదు. విద్యార్థుల సమస్యలు వినే హక్కు సంఘాలకు లేదా? అసలు సంఘాలే వద్దని నియంతృత్వ పాలన చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తుందా? విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాలు వెనక్కి తీసుకోవాలి. విద్యార్థి సంఘాలు పాఠశాలలకు స్వేచ్ఛగా వెళ్లేందుకు అనుమతించాల్సిందే.

– చింతకాయల ఝాన్సీ, ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి

వాన.. మానవాళి మనుగడకు ఎంతో ముఖ్యం.
అయితే, అది ఎక్కువైనా నష్టమే.. తక్కువైనా కష్టమే..
ఎక్కువగా కురిస్తే కష్టాలు, నష్టాలు, ప్రమాదాలు.. తక్కువగా పడితే కరువు, కాటకాలు.

గతవారం రాష్ట్రంలో వానలు దంచి కొట్టాయి. ఫలితంగా చాలా ప్రాంతాలు నీట మునిగి, జనం ఇబ్బందులు పడ్డారు. ఈ ఏడాది రుతుపవనాల రాక కాస్త ఆలస్యం కావడంతో మొన్నటి వరకు లోటు వర్షపాతం నమోదు కాగా, పది రోజుల్లోనే పరిస్థితి మారిపోయింది. పది రోజుల క్రితం 54శాతం లోటు వర్షపాతం ఉండగా.. ఇప్పుడు ఏకంగా 65 శాతం అధిక వర్షపాతానికి చేరింది.

ఈ సంగతి అలా ఉంచితే.. మన నిత్య జీవితంతో ముడిపడి ఉన్న వాన గురించి కొన్ని ఆసక్తికర సంగతులు చూద్దామా?

రెయిన్ డ్రాప్ కాదు.. బన్!



31.2 మిల్లీమీటర్ల వర్షం.. నిమిషంలో

ఒక్క నిమిషంలో అత్యధికంగా కురిసిన వర్షం ఎంతో తెలుసా? 31.2 మిల్లీమీటర్లు. 1956 జూలై 4న అమెరికా మేరీల్యాండ్‌లోని యూనియన్‌విల్లేలో ఇది నమోదైంది. ఇక 1966 జనవరి 7 నుంచి మరుసటి రోజు వరకు 24 గంటల్లో కురిసిన 1825 మిల్లీమీటర్ల వర్షమే ఇప్పటివరకు నమోదైన అత్యధిక వర్షపాతం. అదే మనదేశంలో అయితే.. మేఘాలయలోని మౌసిన్రామ్‌లో 2022 జూన్ 17న 1003.6 మిల్లీమీటర్ల వర్షం కురిసి రికార్డు సృష్టించింది. మేఘాలయలోని చిరపుంజిలో 1860 నుంచి 1861 వరకు 365 రోజుల వ్యవధిలో కురిసిన 1,042 అంగుళాల (26,470 మిల్లీమీటర్లు) వర్షమే ఇప్పటివరకు ఉన్న మరో రికార్డు. మన రాష్ట్రం విషయానికి వస్తే.. మొన్న ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేటలో 24 గంటల్లో నమోదైన 649.8 మిల్లీమీటర్ల వర్షపాతమే అత్యధికం.

చినుకు ఎలా ఉంటుందంటే..

సాధారణంగా వర్షపు చినుకులు బిందువుల మాదిరిగా ఉంటాయనుకుంటాం. కానీ అవి బన్ ఆకారంలో ఉంటాయి. ఒక మిల్లీమీటర్ కంటే తక్కువ వ్యాసార్థం కలిగిన చినుకులు గోళాకారంలో ఉంటాయి. కాస్త పెద్ద చినుకులు హాంబర్గ్ బన్‌లా ఉంటాయి. అదే 4.5 మిల్లీమీటర్ల వ్యాసార్థం కంటే పెద్ద చినుకులు పారాచూట్ తరహాలో మారి చిన్నచిన్న చినుకులుగా కింద పడతాయి.



ఒక్క చినుకూ చూడని ప్రదేశం..

భూమిపై అస్సలు వర్షమే పడని ప్రాంతం అంటార్కిటికాలోని మెక్ ముర్డో డ్రై వ్యాలీస్. ఇక్కడ కొన్ని ప్రాంతాలు ఇప్పటి వరకు ఒక్క వర్షపు చినుకు కూడా చూడలేదు. ఇక చిలీలోని అటకామా ఎడారిలోని కొన్ని ప్రాంతాల్లో ఏడాదికి సగటున 0.5 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదవుతుంది. అంటే దాదాపు లేనట్టేనన్నమాట.



ప్రతి చుక్కా కిందకు పడదు..

వర్షపు చినుకు అన్ని సార్లూ భూమిని చేరదు. కొన్ని సందర్భాల్లో అవి భూమిపై పడకుండానే మాయమైపోతాయి. గాలి వేడిగా ఉన్నచోట్ల అక్కడే ఆవిరైపోతాయి. ఇలా భూమిని చేరకుండానే ఆవిరైపోయిన వర్షపు చినుకును విర్గా అంటారు.



వర్షానికి వాసన ఉంటుందా?

వర్షం వాసన భిన్నంగా ఉంటుంది. వాస్తవానికి స్వచ్ఛమైన నీటికి రంగు, వాసన ఉండవు. అయితే, వర్షం పడటం ప్రారంభమైనప్పుడు మట్టి వాసన వస్తుంది. ఇది నేల తేమ నుంచి వెలువడుతుంది. వర్షం నుంచి వచ్చే సువాసనను పెట్రిచోర్ అంటారు.



14 మైళ్ల వేగం.. 2 నిమిషాలు..

ఒక్క వర్షపు చుక్క భూమిని చేరుకోవడానికి సగటున దాదాపు 2 నిమిషాలు పడుతుంది. మేఘాల నుంచి వర్షపు చినుకులు పడే ఎత్తును బట్టి ఇది మారుతూ ఉంటుంది. వర్షపు చినుకులు గంటకు 14 మైళ్ల వేగంతో భూమి మీదకు పడతాయి. పెద్ద చినుకులైతే 20 మైళ్ల వేగంతో వస్తాయి.



వర్షపు నీటిలోనూ విటమిన్..

వర్షపు నీటిలో విటమిన్ బీ12 ఉంటుంది. ప్రకృతిలో సహజంగా ఉండే అనేక సూక్ష్మజీవులు విటమిన్ బీ12ను ఉత్పత్తి చేస్తాయి. వర్షపు నీరు గాలిలోకి రాగానే ఈ సూక్ష్మజీవులు అందులో చిక్కుకుని విటమిన్ బీ12ను ఉత్పత్తి చేస్తాయి.




కనురెప్ప కంటే తక్కువ బరువు..

సగటు వర్షపు చినుకు బరువు కేవలం 0.001 ఔన్సులు (0.034 గ్రాములు). అంటే మన కనురెప్ప కంటే తక్కువ బరువు అన్నమాట.

-సాక్షి, సెంట్రల్‌డెస్క్

భద్రాచలం వద్ద తగ్గిన ఉధృతి



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఇలా..

▶ మొదటి పేజీ తరువాయి

ప్రవాహం ఉండగా.. 9 గంటల వరకు 37 వేలకు తగ్గడంతో 25 క్రస్టు గేట్లనూ మూసివేశారు. మళ్లీ రాత్రి 8 గంటలకు 68,500 క్యూసెక్కులకు వరద పెరగడంతో 6 గేట్లను తెరిచి 23,184 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. జూరాల నుంచి విద్యుదుత్పత్తి, గేట్ల ద్వారా కలిపి 64,474 క్యూసెక్కుల వరద శ్రీశైలానికి వస్తోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 846.90 అడుగుల వద్ద 73.6744 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ధవళేశ్వరం వద్ద గోదావరి దూకుడు

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గోదావరి వరద ఉధృతి దూకుడు ప్రదర్శిస్తోంది. ఆదివారం సాయంత్రం బ్యారేజ్‌లోకి 16,43,480 క్యూసెక్కులు (142.02 టీఎంసీలు) చేరుతుండటంతో నీటిమట్టం 16 అడుగులకు చేరుకుంది. దీంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు కొనసాగిస్తున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి వచ్చిన గరిష్ట ప్రవాహం ఇదే కావడం గమనార్హం. గోదావరి డెల్టాకు 10,700 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగిలిన 16,32,780 క్యూసెక్కులను (141.09 టీఎంసీలను) సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఈ నీటి సంవత్సరంలో అంటే జూన్ 1 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు 831.357 టీఎంసీల గోదావరి మిగులు జలాలు కడలిపాలవడం గమనార్హం. ఎగువన వరద ప్రవాహం తగ్గిన నేపథ్యంలో సోమవారం నుంచి పోలవరం ప్రాజెక్టు, ధవళేశ్వరం బ్యారేజ్‌లలోకి చేరే ప్రవాహం కూడా తగ్గుముఖం పట్టనుంది.

72.41 లక్షల మందికి విద్యుత్ సబ్సిడీ!

విద్యుత్ ప్రగతిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపు వల్లనే రాష్ట్రం విద్యుత్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. 'విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థల బలోపేతానికి గత 9 ఏళ్లలో ప్రభుత్వం రూ.97,321 కోట్ల వ్యయం చేసింది. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి భారీ విద్యుత్ సబ్సిడీలను అందిస్తోంది. గృహ, ఉపాధి, వ్యవసాయ రంగాలకు చెందిన 72.41 లక్షల మంది వినియోగదారులకు రూ.50 వేల కోట్లకు పైగా విద్యుత్ సబ్సిడీలు అందించింది' అని ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇందుకు సంబంధించిన గణాంకాలు ఇలా ఉన్నాయి.

- 2014లో 7,778 మెగావాట్లుగా ఉన్న రాష్ట్ర విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 2023 నాటికి 18,567 మెగావాట్లకు పెంచింది.
- 27.48 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు ఉచిత విద్యుత్ అందిస్తోంది.
- నెలకు 0–50 యూనిట్ల విద్యుత్ వినియోగించే 35,61,809 గృహ వినియోగదారులు, నెలకు 101 యూనిట్లలోపు విద్యుత్ వాడుతున్న 5,25,433 ఎస్సీ గృహ వినియోగదారులు, 2,95,114 మంది ఎస్టీ గృహ వినియోగదారులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోంది.

క్లుప్తంగా...

సీఆర్ఆర్ కుటుంబానికి అండగా ఉంటాం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే



సీఆర్ఆర్‌కు నివాళులర్పిస్తున్న మాణిక్‌రావు ఠాక్రే

ఆదిలాబాద్ రూరల్: మాజీ మంత్రి, దివంగత నేత చిల్కూరి రామచంద్రారెడ్డి (సీఆర్ఆర్) కుటుంబానికి పార్టీ పూర్తిగా అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సీఆర్ఆర్ సంతాప సభకు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఠాక్రే మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాయకులతో పాటు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీతో సీఆర్ఆర్ దగ్గరి సంబంధాలు కలిగి ఉండేవారన్నారు. సీఆర్ఆర్ అల్లుడు అల్లూరి సంజీవ్‌రెడ్డి, సోదరుడు లక్ష్మారెడ్డి ఆయన చూపించిన మార్గంలో నడిచి ఆయన ఆలోచనలను ముందుకు తీసుకెళ్తారని ఆశిస్తున్నామని వ్యాఖ్యానించారు. అనంతరం 'సాక్షి'టీవీతో మాట్లాడుతూ, ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తమ పార్టీ నాయకులంతా ఐక్యంగానే ఉన్నారని, అయితే సీఎం కేసీఆర్ కుట్ర పూరితంగా పార్టీలో విభేదాలు ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంట ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గండ్రత్ సుజాత, వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, తదితరులున్నారు.

కమ్యూనిస్టుల వైఫల్యం వల్లే దేశంలో మతోన్మాదం

ఎంసీపీఐ (యూ) ప్రధాన కార్యదర్శి అశోక్ ఓంకార్



సాక్షి, హైదరాబాద్: కమ్యూనిస్టులు, వామపక్షాల వైఫల్యం వల్లే దేశంలో మతోన్మాదం పెరుగుతోందని ఎంసీపీఐ (యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ ఆరోపించారు. ఆ పార్టీ కేంద్ర కమిటీ సమావేశాలు మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్ ఓంకార్ భవన్‌లో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, బిహార్ రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్ ప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ ఓంకార్ మాట్లాడుతూ సీపీఐ, సీపీఎం, సహా కొన్ని వామపక్ష పార్టీలు తమ విధానాలను విస్మరించిన కారణంగా బూర్జువా పార్టీలతో ఫ్రంట్‌లు కట్టడం వల్ల కమ్యూనిస్టు పునాదులను దోపిడీ పాలకవర్గాల పరం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో కొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో కలిసి, మరికొన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని కమ్యూనిస్టు మూల విధానాల నుంచి వైదొలగడం వల్ల మతోన్మాద పార్టీలు బలపడుతున్నాయని పేర్కొన్నారు. తాము దేశంలో వామపక్ష కమ్యూనిస్టు ప్రజా శక్తులను ఐక్యం చేసేందుకు ఒకే పార్టీగా ఏర్పడేందుకు దేశంలో రెవల్యూషనరీ మార్క్సిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్ఎంపీఐ), ఎంసీపీఐ (యూ) ఐక్యం కావడానికి కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ (సీసీసీ)ని ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. సోమవారం నుంచి సీసీసీ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో మరిన్ని పార్టీలను ఐక్యం చేసేందుకు కృషి చేస్తామని ఓంకార్ వెల్లడించారు. మణిపూర్ ప్రభుత్వాన్ని రద్దు చేసి, ఆ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరారు.

బహుజన ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కేసీఆర్ కుట్ర

ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్



దేవరకొండ: తెలంగాణలో బహుజన ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కుట్ర పన్నుతున్నారని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం నల్లగొండ జిల్లా దేవరకొండలో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా రాజకీయ చైతన్య సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. 99 శాతం జనాభా ఉన్న బహుజనులకు రాజకీయాల్లో 99 శాతం వాటా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ధ్వజమెత్తారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజల సంక్షేమాన్ని విస్మరించి ప్రతిపక్ష పార్టీల్లో చీలికలు తీసుకొచ్చేందుకు మాత్రమే కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. స్పెషల్ పోలీస్ బెటాలియన్ కానిస్టేబుల్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేసే జీఓ నంబర్ 46ను ప్రభుత్వం తక్షణమే సవరించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే భూమిలేని నిరుపేద కుటుంబాలకు ఎకరం చొప్పున భూమి పంచుతామని ఆయన హామీనిచ్చారు. అంతకుముందు పట్టణంలోని బస్టాండు వద్ద బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు బోనాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు.

వరంగల్ ఎయిర్‌పోర్టుకు ఓకే?

నేటి మంత్రివర్గ సమావేశంలో చర్చ ● వెయ్యి ఎకరాల్లో నిర్మాణం.. తొలిదశలో డొమెస్టిక్ సేవలే..

సాక్షి, హైదరాబాద్: వరంగల్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మార్గం సుగమం కానుంది. మామునూరులో ఉన్న పురాతన ఎయిర్ స్ట్రిప్ స్థానంలో దీనిని నిర్మించనున్నారు. రాష్ట్రంలో ఆరు ప్రాంతాల్లో విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని నాలుగేళ్ల క్రితమే ప్రతిపాదించినా, పౌర విమానయాన శాఖ-రాష్ట్రప్రభుత్వం మధ్య సమన్వయం కుదరలేదు. దీంతో జాప్యం జరుగుతూ వస్తోంది. ఈ కారణంగానే వీటి ఏర్పాటు సందిగ్ధంలో పడింది.రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ముందుకొచ్చి దశలవారీగా ఎయిర్‌పోర్టుల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. తొలుత వరంగల్‌లో విమానాశ్రయాన్ని సిద్ధం చేసే కసరత్తులో భాగంగా, ఎయిర్ పోర్ట్స్ అథారిటీ కోరిన మేరకు భూమిని సేకరించి అప్పగించనుంది. సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించి పచ్చజెండా ఊపే అవకాశం కనిపిస్తోంది. ఈమేరకు సమావేశ ఎజెండాలో కూడా దీనిని చేర్చారు.

250 ఎకరాల భూసేకరణ

మామునూరులో నిజాంకాలంలో నిర్మించిన ఎయిర్‌స్ట్రిప్ ఉంది. కొన్ని దశాబ్దాలుగా ఇది వాడుకలో లేదు. అక్కడ చిన్నషెడ్డు తప్ప ఎలాంటి భవనం లేదు. ఒక పెద్ద రన్‌వే, మరో చిన్న రన్‌వే ఉంది. గోతులు పడి అది కూడా వినియోగించడానికి వీలు లేదు. ప్రస్తుతం ఆ ఎయిర్‌స్ట్రిప్‌కు సంబంధించిన 696 ఎకరాల భూమి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ అధీనంలో ఉంది. అదనంగా 253 ఎకరాలు కావాలని అథారిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పుడు అంతమేర భూసేకరణ జరగాల్సి ఉంది. సమీపంలోనే పశుసంవర్ధక శాఖ కు చెందిన స్థలం అందుబాటులో ఉంది. కొంత సమీప గ్రామం నుంచి సేకరించాల్సి ఉంది. గ్రామస్తులకు ఎయిర్‌పోర్టుకు మరోవైపు ప్రత్యామ్నాయ భూములు ఇచ్చే పద్ధతిలో సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఆ జిల్లా కలెక్టర్‌కు ఈమేర కు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది.



మామునూరు ఎయిర్‌స్ట్రిప్‌లోని రన్‌వే (ఫైల్)

ఏడాదిన్నరలో సిద్ధం చేసేలా..

వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయాన్ని రూ.350 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించాలని అనుకుంటున్నారు. ప్రస్తుతం ఎయిర్‌స్ట్రిప్‌లో 1400 మీటర్ల పొడవైన రన్‌వే ఉంది. దాని పక్కనే గ్లైడర్స్ దిగేందుకు అప్పట్లో మరో చిన్న రన్‌వే నిర్మించారు. ఇప్పుడు 2300 మీటర్ల పొడవుతో ఒకటే రన్‌వే కొత్త విమానాశ్రయం కోసం సిద్ధం చేస్తారు. రన్‌వే విస్తరణ, టెర్మినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సర్వీసెస్‌కు ఈ అదనపు భూమి అవసరమవుతోంది. ఎయిర్‌పోర్టు సిబ్బంది క్వార్టర్లను మరో చోట నిర్మించాలని నిర్ణయించారు. భూమిని సేకరించి అథారిటీకి అప్పగించిన ఏడాదిన్నరలోగా విమానాశ్రయాన్ని సిద్ధం చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ప్రస్తు తం దేశీయ విమానాశ్రయం (డొమెస్టిక్ ఎయిర్‌పోర్టు)గానే ఏర్పాటు చేయనున్నారు. 500 మంది ప్రయాణికుల సామర్థ్యంతో ఇది రూపొందనుంది. భవిష్యత్ అవసరాల ఆధారంగా విస్తరిస్తారు.

దశలవారీగా ఇతర చోట్ల కూడా..

వరంగల్ మామునూరుతోపాటు ఆదిలాబాద్, పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, కొత్తగూడెంలోని పాల్వంచ, మహబూబ్‌నగర్‌లోని దేవరకద్రలో విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలన్నది ప్రతిపాదన. వీటిని దశలవారీగా చేపట్టాలని ఇప్పుడు నిర్ణయించారు. హైదరాబాద్ తర్వాత అంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం వరంగల్ కావటం, అక్కడ టెక్స్‌టైల్‌పార్కు, ఐటీ పార్కులు అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో అక్కడ తొలుత విమానాశ్రయాన్ని సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఔటర్ చుట్టూ మెట్రో!

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే చట్టం అమల్లో ఉంది. అయితే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూపొందించిన చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు గాను ఇప్పటికే అమల్లో ఉన్న తెలంగాణ అలోపతిక్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్ -2002 (యాక్ట్ 13 ఆఫ్ 2002) బిల్లును రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనిపై కేబినెట్ సోమవారం నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు హైదరాబాద్ చుట్టూ ఏర్పాటు చేసిన నాలుగు టిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులకు స్వయం ప్రతిపత్తి కల్పించే తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్-2022 బిల్లును కూడా మంత్రివర్గం చర్చించి ఆమోదించనుంది. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నట్టు సమాచారం. కాగా నిమ్స్ ఆసుపత్రి విస్తరణ అంచనా వ్యయాన్ని రూ.1,571 కోట్ల నుంచి రూ.1,698 కోట్లకు పెంచే ప్రతిపాదనలపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

ఉద్యోగుల కోసం పీఆర్సీ, ఇతర అంశాలు..

నగర శివార్లలోని బుద్వేల్‌లో ఉన్న దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూములను హెచ్ఎండీఏ ద్వారా వేలం వేసే ప్రతిపాదనలపై కేబినెట్ చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. మహబూబాబాద్ జిల్లా మల్యాలలో కొత్త ఉద్యాన కళాశాల ఏర్పాటు, వరంగల్ నగర శివారులోని మామునూరు ఎయిర్‌పోర్టులో టెర్మినల్ భవనం, ప్రస్తుత రన్‌వే విస్తరణకుగాను అవసరమైన భూసేకరణ, కొత్త మండలాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల ఏర్పాటు, అనాథల సంక్షేమం కోసం రూపొందించిన కొత్త విధానంపై చర్చించి ఆమోదం తెలుపనున్నారు. అలాగే సింగరేణి కాలరీస్ సంస్థకు బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీ నగర్‌లో వెయ్యి చదరపు గజాల ప్రభుత్వ భూమిని మార్కెట్ ధరకు విక్రయించే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఎజెండాలో చేర్చారు. ఇక్కడ సింగరేణి క్వార్టర్లు, గెస్ట్‌హౌస్, ఫెసిలిటేషన్ సెంటర్ నిర్మాణం కోసం భూమి కావాలని సింగరేణి సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. ఇక విద్యుత్ కొనుగోళ్ల బకాయిల చెల్లింపు, ట్రాన్స్‌మిషన్ చార్జీల చెల్లింపునకుగాను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ), బ్యాంకుల నుంచి ట్రాన్స్‌కో సేకరించనున్న రూ.5 వేల కోట్ల రుణాలకు పూచీకత్తుపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటు, ఆర్టీసీ ఉద్యోగులకు వేతన సవరణ, వర్షాలు, వరదలతో జరిగిన నష్టం, సహాయ..పునరుద్ధరణ చర్యలు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, ఆసరా పింఛన్ల పెంపు తదితర అంశాలపై కూడా సోమవారం జరగనున్న మంత్రివర్గ భేటీలో చర్చించే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్ తోక పార్టీలా బీఆర్ఎస్

- బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ విమర్శ
- వర్షాలకు నగరాలు మునిగిపోయినా సీఎంకు ఏమీ పట్టలేదు
- తెలంగాణకు సముద్రంలేని లోటు కేసీఆర్ తీర్చారని ఎద్దేవా



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ తోక పార్టీలా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌తో కలిసి బీఆర్ఎస్ కూడా అవిశ్వాసానికి మద్దతు ఇవ్వడం చూస్తుంటే గల్లీలో కుస్తీ ఢిల్లీలో దోస్తీలా వారి బంధం ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌కు ఆప్‌తో కూడా అవినాభావం సంబంధం మరింతగా బలపడుతోందని ఆరోపించారు. తెలంగాణలో భారీ వర్షాలకు నగరాలు మునిగిపోయినా, జనజీవనం స్తంభించిపోయినా సీఎం కేసీఆర్‌కు ఏమీ పట్టలేదనీ, రోమ్ చక్రవర్తిలా వ్యవహరిస్తూ మహారాష్ట్రలో రాజకీయాలు చేస్తున్నారని నిందించారు. మును పెన్నడూ లేని విధంగా వరంగల్, ఖమ్మం, భద్రాచలం, హైదరాబాద్‌లు ఒకేసారి జలమయం అయ్యాయని, తెలంగాణకు సముద్రం లేని లోటు తీర్చడం బీఆర్ఎస్‌కే దక్కిందని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ నదులకు నడక నేర్పడం సంగతి ఏమోగానీ ఢిల్లీ వరకూ మద్యం ప్రవహించేలా ఘనత మాత్రం ఆయన కుటుంబానికే చెల్లిందని ఆరోపించారు. మద్యం ద్వారా పెరిగిన బంధంతోనే సంజయ్ సింగ్‌కు వత్తాసు పలుకుతున్నారని నిందించారు.

కేంద్రబృందాల అంచనా రాగానే సాయం

వర్షాల వల్ల తెలంగాణలో నెలకొన్న పరిస్థితిపై రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నేతృత్వంలోని బృందం హోంమంత్రి అమిత్‌షాను కలిసి వివరించిందని లక్ష్మణ్ తెలిపారు. కేంద్ర బృందాల నష్ట అంచనా రాగానే కేంద్రం నుంచి సహాయం ఉంటుందన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో భాగంగానే తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్ష మార్పు, బండి సంజయ్‌కు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రమోషన్ వచ్చాయని ఆయన వ్యాఖ్యానించారు.

కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల్లో ఫామ్‌హౌస్

- కేటీఆర్‌కు వంద ఎకరాల్లో
- కానీ దత్తత తీసుకున్న పాలమూరు జిల్లా మాత్రం పడావు
- టీపీసీసీ చీఫ్ రేవంత్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: పాలమూరు జిల్లా ముఖ్యమంత్రి కేసీఆర్ చేతిలో మోసపోయిందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాలలో, కేటీఆర్‌కు వంద ఎకరాలలో ఫామ్ హౌస్‌లు, రూ.వేల కోట్ల ఆస్తులు, వందల ఎకరాల భూములు, టీవీలు, పేపర్లు వచ్చాయి కానీ దత్తత తీసుకున్న పాలమూరు మాత్రం పడావు పడిందన్నారు. ఉద్యమ సమయంలో ఎంపీగా గెలిపించిన మహబూబ్‌నగర్ జిల్లాకు, జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో కాంగ్రెస్‌లో చేరిన మహబూబ్ నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాధ అమర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అమరెందర్ రాజు, కౌన్సిలర్ రమాదేవితో పాటు ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన పలువురు బీఆర్ఎస్ నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఎంపీగా గెలిపిస్తే తన ఇల్లును అమ్మి పాలమూరును అభివృద్ధి చేస్తానని చెప్పిన కేసీఆర్ సీఎం అయి తొమ్మిదేళ్లయినా అతీగతీ లేకుండా పోయిందన్నారు. పాలమూరు జిల్లాను అద్దంలా మారుస్తానన్న హామీ ఏమైందన్నారు.

వక్ఫ్ భూములనూ వదలని మంత్రి శ్రీనివాస్ గౌడ్

జిల్లాలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ భూకబ్జాలకు పాల్పడుతున్నారని, వక్ఫ్ భూములను సైతం వదలకుండా ఆక్రమణలకు పాల్పడుతున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ల్యాండ్, శాండ్, మైన్స్, వైన్.. ఏ దందాలో చూసినా బీఆరెస్ నేతలే ఉన్నారని, వాళ్ల అరాచకాలను ఎదిరించేందుకు కాంగ్రెస్‌లో చేరడం అభినందనీయమన్నారు. పోలీసులు, అధికారులు బీఆర్ఎస్ కార్యకర్తల్లా వ్యవహరించవద్దని, అక్రమ కేసులు పెడితే మిత్తితో సహా చెల్లిస్తామని రేవంత్ హెచ్చరించారు.

బీఆర్ఎస్‌ను విస్మరించి కేంద్రాన్ని విమర్శిస్తావా?

రేవంత్‌పై బీజేపీ అధికార ప్రతినిధి రచనారెడ్డి ధ్వజం

సాక్షి, హైదరాబాద్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీజేపీని విమర్శించే ముందు తన నియోజకవర్గాన్ని, పార్టీని సరిచేసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రచనారెడ్డి అన్నారు. ఆదివారం ఇక్కడ బీజేపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో భారీవర్షాలు, వరదలు వస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టాల్సి ఉన్నా కేంద్రం చొరవ తీసుకుని సహాయం చేస్తోందని, దీనిపై రాష్ట్రప్రభుత్వాన్ని కాకుండా కేంద్రాన్ని రేవంత్ విమర్శించడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం కేంద్ర బృందాన్ని పంపుతున్నారని చెప్పారు. మైక్ దొరికింది కదా అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం సరికాదని, రేవంత్ సొంత నియోజకవర్గమైన మల్కాజిగిరిలో ఆయన కనపడటంలేదని పోస్టర్లు వెలుస్తున్నాయని, తన ఎంపీ ల్యాడ్స్ నిధులను ఖర్చు పెట్టారో లేదో చూసుకోవాలని అన్నారు.

బోధన.. వేదన

▶ మొదటి పేజీ తరువాయి

రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు బిల్లును అసెంబ్లీ ఆమోదించినా అది ఇంకా గవర్నర్ వద్దే పెండింగ్‌లో ఉంది. ఈ ఫైల్‌ను రాష్ట్రపతి పరిశీలనకు పంపామని గవర్నర్ పేర్కొన్నారు.

1,869 పోస్టులు ఖాళీ..

రాష్ట్రంలోని 11 యూనివర్సిటీల్లోనూ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. అన్నిచోట్లా కాంట్రాక్టు అధ్యాపకులతోనే నెట్టుకొస్తున్నారు. విద్యాశాఖ గణాంకాల ప్రకారం 2021 జనవరి 31 నాటికి 11 యూనివర్సిటీల్లో 2,837 మంజూరైన పోస్టులు ఉండగా వాటిలో ఏకంగా 1,869 పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. అంటే కేవలం 968 (34.12 శాతం) మందే రెగ్యులర్ అధ్యాపకులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం 157 మంది ప్రొఫెసర్లు ఉండగా మరో 238 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 129 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు ఉండగా మరో 781 పోస్టులు ఖాళీగా ఉండిపోయాయి. 682 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తుండగా 850 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే 1,869 ఖాళీల్లో 1,061 పోస్టుల భర్తీకి ప్రభుత్వం మూడేళ్ల కిందటే ఆమోదం తెలిపినా ఇంతవరకు వాటిని భర్తీ చేయలేదు.

ప్రొఫెసర్లేరీ?

- రాష్ట్రంలో ఒక్క ప్రొఫెసర్ కూడా లేని యూనివర్సిటీలు ఆరు ఉన్నాయి. అవి శాతవాహన, మహత్మాగాంధీ, పాలమూరు, ఆర్‌జీయూకేటీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ. శాతవాహన, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ (ఆర్‌జీయూకేటీ), బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లే లేరు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్ ఒకరే ఉన్నారు. మొత్తంగా చూస్తే 11 యూనివర్సిటీల్లో 61.65 శాతం ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగానే ఉండిపోయాయి. మరోవైపు 85.82 శాతం అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండగా 55.48 శాతం అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఉన్నత విద్యాశాఖ లెక్కలు వేసింది.
- వందేళ్లకుపైగా చరిత్రగల ఉస్మానియా యూనివర్సిటీలో సగానికిపైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాకతీయ యూనివర్సిటీలో ఇప్పుడు కేవలం ఒక్కరే ప్రొఫెసర్ ఉండగా అసోసియేట్ ప్రొఫెసర్లు ఇద్దరే ఉన్నారు. శాతవాహన యూనివర్సిటీ, ఆర్‌జీయూకేటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు ఒక్కరంటే ఒక్కరూ లేరు. తెలుగు యూనివర్సిటీలో ఒక్క అసోసియేట్ ప్రొఫెసర్‌తోనే నెట్టుకొస్తున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో (జేఎన్ఏఎఫ్ఏయూ) ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు బోధన సాగిస్తున్నారు.

క్రమబద్ధీకరణ చేయరా?

గత కొంతకాలంగా రెగ్యులర్ చేయాలని ఆందోళన చేస్తున్న యూనివర్సిటీల అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ ఆదివారం మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్‌రావులను కలిసింది. ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేసేందుకు కృషి చేయాలని వినతిపత్రం అందించింది. సోమవారం జరిగే కేబినేట్ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించాలని కోరింది.

ఇవీ యూనివర్సిటీల్లో మొత్తం పోస్టుల వివరాలు..

కేటగిరీ	మంజూరైనవి	ఖాళీలు	పనిచేస్తున్న వారు
ప్రొఫెసర్	395	238	157
అసోసియేట్ ప్రొఫసర్	910	781	129
అసిస్టెంట్ ప్రొఫెసర్	1,532	850	682
మొత్తం	2,837	1,869	968



బీఎస్ రావుకు ఘనంగా నివాళులు

హాజరైన మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత



బీఎస్‌రావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి కేటీఆర్



బీఎస్ రావు భార్యను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత

మణికొండ: శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బీఎస్ రావుకు పలువురు ప్రముఖులతోపాటు రాష్ట్రంలోని పాఠశాలల అధ్యాపకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం నార్సింగిలోని ఓం కన్వెన్షన్‌లో ఆయన దశదినకర్మ నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్రమంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, మాగంటి గోపినాథ్, మాధవరం కృష్ణారావు, ఈటల రాజేందర్, ఎమ్మెల్సీలు కవిత, పల్లా రాజేశ్వర్ రెడ్డి, నవీన్‌రావు, 'సాక్షి'మార్కెటింగ్ డైరెక్టర్ కేఆర్‌పీ రెడ్డి, మాజీ ఎంపీ సీఎం రమేశ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.సాంబశివరావుతోపాటు పలువురు ప్రముఖులు, శ్రీచైతన్య ఉద్యోగులు పాల్గొన్నారు.

కీచక డీఎస్పీ

- మహిళను వేధించిన సీఐడీ అధికారి కిషన్‌సింగ్

సాక్షి, సిటీబ్యూరో: పోలీసు నినాదం గతి తప్పింది. మహిళలకు రక్షణకు కల్పించాల్సిన పోలీసే వేధింపులకు గురి చేశాడు. సమస్య ఉందని ఆశ్రయించిన ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో నిందితుడు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) డీఎస్పీ కిషన్ సింగ్‌జీపై చైతన్యపురి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. మార్గదర్శి కాలనీకి చెందిన మహిళ (48) తెలంగాణ రాష్ట్ర సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎస్‌పీడీసీఎల్)లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తోంది. 2020లో సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నేషనల్ ఇంటర్ డిపార్ట్‌మెంట్ క్రీడా పోటీలకు సిద్ధమవుతున్న సమయంలో సీఐడీ డీఎస్పీ కిషన్ సింగ్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. శిక్షణ తరగతులకు హాజరుకావాలని అతను ఆమెకు సూచించాడు. సీనియర్ పోలీసు అధికారి కావటంతో అంగీకరించిన బాధితురాలు.. తన ఫోన్ నంబరును పోలీసు అధికారికి ఇచ్చింది. అప్పటి నుంచి ఆ పోలీసు ఉన్నతాధికారి ఆమె వాట్సాప్ నంబరుకు రొమాంటిక్ హిందీ పాటలు, సెన్సార్ చేయని వీడియోలను పంపించడం మొదలుపెట్టాడు. శిక్షణ తరగతులకు చీర కట్టుకోవాలని రావాలంటూ ఒత్తిడికి గురి చేసేవాడని బాధితురాలు ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.





గ్రంథాలయం కలిగివున్న ఇంటిలో ఆత్మ ఉంటుంది.
– ప్లేటో

సాక్షి
సోమవారం, 31 జూలై 2023

ట్రంకుపెట్టె పిల్లలు

‘ఒరే మోహన్‌గా! మన అమ్మలకి మనం పుట్టుండంరా! నిజంగా మనల్ని కనే ఉంటే మనల్ని రోజూ కళ్లెదురుగా సూసుకోకుండా ఉండగలుగుతారా! మనల్నిలాగా ఈ నరకంలో వదిలేసి ఎళ్లిపోగలుగుతారా?’...

ఆరు నుంచి పది వరకు హాస్టల్‌లో ఉండే ప్రతి పిల్లాడు ఇలా ఎప్పుడో ఒకప్పుడు అనుకోకుండా ఉండడు. ఎదిగీ ఎదగని వయసులో హాస్టల్‌లో ఏదెలా ఉన్నా అక్కడ పూడ్చలేని వెలితి– తల్లితండ్రులు లేకపోవడం. అమ్మ గోరుముద్దలు, నాన్న ప్రేమపూర్వక గదమాయింపులు, శుభ్రమైన పక్కబట్టలు, రేడియో పాట, సయించే భోజనం, అన్నింటికి మించి భద్రమైన ఇంట్లో ఒళ్లెరుగకపోయే నిద్ర. ఇవేవీ హాస్టల్‌లో ఉండవు!

పిల్లలు చదువుకోవడానికే పుట్టి ఉండవచ్చు. చదువుకోవడానికి మాత్రమే పుట్టలేదు. కాని చదువుకుంటే తప్ప పుట్టగతులు ఉండవు. తొమ్మిది నెలల తర్వాతే పిల్లలందరూ భూమ్మీద పడ్డా ఆ భూమిని బట్టి వారి అదృష్టం ఆధారపడి ఉంటుంది. అగ్రహారం అయితే ఒకలాగా, రెడ్ల ఇలాకా అయితే ఒకలాగా, కామందుల వీధైతే ఒకటి, శెట్టిగారి బజారైతే ఒకటి. ఇవి గాకుండా వేరే వీధులు, వెలివాడలు ఉంటాయి. ఆ భూమ్మీద పుట్టిన పిల్లలు తిండికి, చదువుకు గతి లేకపోతే ఇదిగో ఇలా ప్రభుత్వ హాస్టళ్లలో ఉండి చదువుకోవాలి. అమ్మను తిట్టుకోవాలి. ఆక్రోశించాలి.

హాస్టల్‌లో ఉన్న కన్నబిడ్డను ఆదివారం వచ్చి చూసుకునే వీలు తల్లికి ఉంటుంది. అదీ ఇదీ వండుకొని, బిడ్డ కడుపుకు ఇంత తినిపించుకుని, తల దువ్వి, పేన్లు చూసి, ఒళ్లో పరుండబెట్టుకుని కబుర్లు చెప్పి, వదల్లేక వదల్లేక ఆ తల్లి పోతూ ఉంటే అప్పటికే ఔట్‌బెల్లు టైమైపోయిందని తల్లి కళ్ల ముందే కన్నకొడుకును నాలుగు పీకుతాడు హాస్టల్ బాధ్యుడు. అప్పుడు తల్లేమైనా భద్రకాళి అవుతుందా? నా కొడుకును ఈ బందీఖానాలో ఉంచను అని తీసుకెళ్లి పోతుందా? ‘మీరు కొట్టి సంపేత్తాకి కనలేదు సారు మేము బిడ్డల్ని. మా గచ్చంతరం బాగోక ఇక్కడొదిలేసాం’ అంటా నడుసుకుంటా ఎలిపోతుంది.

‘ప్రపంచం మొత్తాన్ని తెచ్చి క్లాస్‌రూమ్‌లో కుదించలేము. క్లాస్‌రూమ్‌నే ప్రపంచంలోకి తీసుకెళ్లాలి’ అని 1912లో జర్మనీలో మొదటి హాస్టల్‌ను మొదలెట్టాడు రిచర్డ్ షిర్మన్ అనే స్కూల్ టీచరు. విహారాలకు వెళ్లే పిల్లలు తక్కువ ఖర్చులో బస చేయడానికి వీలుండటం లేదని తన స్కూల్‌లోనే తొలి హాస్టల్ కట్టాడు. అతని వల్ల ప్రపంచమంతా యూత్ హాస్టల్సు, దరిమిలా రెసిడెన్షియల్ స్కూల్స్ వచ్చాయి. విషాదమేమంటే ఏ ఉద్దేశంతో రిచర్డ్ షిర్మన్ హాస్టల్స్ మొదలెట్టాడో దానికి పూర్తి విరుద్ధంగా ఏ విహారమూ లేని బందీఖానాలుగా అవి మారాయి.

‘అందరికన్నా ముందు పరిగెత్తి కంచం పట్టుకుని లైన్లో నిలబడ్డా. అన్నం డేక్షాలొచ్చేసున్నాయ్. పొప్పుది, సాంబారుది, మజ్జిగిది గిన్నిలొత్తే వడ్డన మొదలెట్టేత్తారు. అన్నం డేక్షా మీద మూత లేదేమో ఈగలన్నీ అల్నియ్. అన్నియ్యా ఈగలోల్తనాయ్ అని పిలిత్తే ఆ ఈగల్ని తోలకుండానే దాని మీద మూత పడేసాడు వర్కరు. పారిపోయే దారిలేక ఆ ఈగలందులోనే సచ్చి అన్నంలో కలిసిపోనియ్. కంచంలో ఏత్తే హస్తానికో ఈగ పడింది నా కంచంలో’....

పాత భవనాలు, పెచ్చులూడిపోయే సీలింగులు, ఊరికి దూరంగా మనిషి అలికిడి లేని బీడు పరిసరాలు, సరిపోని నీళ్లు, కడుపులో దేవే పాయిఖానాలు, అపరిశుభ్ర ఆహారం, దుప్పట్లు ఇవ్వని చలికాలం, తప్పని తీట.. తామర, చీటికి మాటికి ఘోరంగా చావగొట్టే సిబ్బంది, ముళ్లతీగల ఫెన్సింగ్.... ఇవీ కొన్ని చోట్ల సంక్షేమ హాస్టళ్లు.

తెలుగు సాహిత్యంలో హాస్టల్ లైఫ్ చెదురు మదురుగా కనిపిస్తుంది. నవీన్ ‘అంపశయ్య’, కేశవరెడ్డి ‘సిటీ బ్యూటిఫుల్’, కొమ్మూరి వేణుగోపాలరావు ‘హౌస్ సర్జన్’, వడ్డెర చండీదాస్ ‘అనుక్షణికం’ హాస్టల్ జీవితాన్ని కొద్దో గొప్పో చూపుతాయి. అయితే అవన్నీ పోస్ట్ మెట్రిక్ విద్యార్థుల జీవితాలు. కాని రచయిత మోహన్ తలారి ‘హాస్టల్ లైఫ్’ కథలు ప్రీ మెట్రిక్ విద్యార్థుల భౌతిక మనోలోకాల్లో హాస్టల్ రేపగల కల్లోలాన్ని గట్టిగా పట్టి ఇస్తాయి. ఇరవై ఏళ్ల క్రితం తాడేపల్లిగూడెం సమీపంలోని ఆరుగొలను గురుకుల పాఠశాలలో తాను గడిపిన హాస్టల్ జీవితపు పచ్చి జ్ఞాపకాల ధార ఈ కథలు. కర్కశపు చారలు ఈ కథలు. ఇరవై ఏళ్ల తర్వాత, నేడు, ఇరు రాష్ట్రాల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, గురుకుల పాఠశాలల, హాస్టళ్ల అధికారులు ఈ పుస్తకాన్ని ఒక కొలతగా గనక తీసుకుంటే, అప్పటికీ ఇప్పటికీ ఏం మారిందో, ఎంత మారిందో చూసుకుంటే చేయవలసిన పని తెలుస్తుంది. చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే లక్షలాది నిరుపేద బాలల పెదాలపై చిర్నవ్వు మొలుస్తుంది.

నిజానికి ఇంటర్, కాలేజీ హాస్టళ్ల విద్యార్థులకు అంతో ఇంతో ఎరుక, ఎదురీదే సామర్థ్యం ఉంటాయి. కాని 15 లోపు పసివయసు విద్యార్థులు ఉండే, తల్లితండ్రులను వదలి ఉండే, పేదరికం కారణంగానో నిస్సహాయ పరిస్థితుల వల్లనో హాస్టళ్లలో ఉండి చదువుకోక తప్పని వర్గాల పిల్లలుండే హాస్టళ్లు ఎంతో ఆదరణీయంగా ఉండాలి. ఆత్మీయంగా ఉండాలి. అక్కున జేర్చుకునేలా ఉండాలి. అలా ఉన్నదా? నీ పిల్లలు ఉండే చోటు ఎలా ఉండాలనుకుంటావో... ఆ పిల్లలు ఉండే చోటు అలా ఉండాలనుకుంటున్నావా?

‘అంకుల్ టామ్స్ కేబిన్’ అనే ఒక్క పుస్తకం నల్ల బానిసల జీవితాల్లో సమూలంగా మార్పు తెచ్చింది. మన దేశంలో ఎన్ని పుస్తకాలు వస్తే సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే – దేవునితో తప్ప మరెవరితోనూ మొత్తుకునే వీలులేని– ట్రంకుపెట్టె పిల్లల జీవితాలు మారతాయి?

పరిషత్తులో అంబేడ్కరే లేకుంటే?!

కామెంట్



కరణ్ థాపర్

“స్వాతంత్ర్య పోరాటంలో అంబేడ్కర్ పోషించిన పాత్రేమీ లేకపోవడం ఆయన అద్భుతమైన జీవన ప్రగతిలో అత్యంత వివాదాస్పదమైన అంశం” అంటాడు అశోక్ లాహిరి. ఇదొక్కటే కాదు లాహిరి పుస్తకం ‘ఇండియా ఇన్ సెర్చ్ ఆఫ్ గ్లోరీ’ అంబేడ్కర్ గురించి వెల్లడించిన నమ్మశక్యం కాని నిజం. రాజ్యాంగ పరిషత్తుకు అంబేడ్కర్ ఏనాడూ నేరుగా ఎన్నికవలేదన్నదీ అలాంటి వాస్తవమే. 1945–46 ఎన్నికల్లో అంబేడ్కర్ రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నిక కాలేకపోయినప్పుడు ఆయనకు స్థానం కల్పించడం కోసం ముస్లిం లీగ్ శాసనసభ్యుడు జోగేంద్రనాథ్ మండల్ తన స్థానాన్ని త్యాగం చేశారు. అంబేడ్కర్ ఆనాడు పరిషత్తు సభ్యుడిగా లేకుంటే భారతదేశానికి ఎలాంటి రాజ్యాంగం తయారై ఉండేదో ఊహించండి. ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి అని మనం నేడు చెప్పుకుంటున్న దేశం తన రాజ్యాంగ పితను కోల్పోయి ఉండేది.

మన జాతిరత్నాల గురించి నిజంగా మనకు తెలుసునా? వాళ్లను మనం పీఠాలపై ప్రతిష్ఠించుకుని గౌరవించుకుంటాం. వారి గురించి తరచుగానూ, అనర్గళంగానూ మాట్లాడుకుంటూ ఉంటాం. వాళ్ల మాటల్ని కూడా యథాతథంగా స్వీకరించి మన జీవితాలకు బాటలు పరుచుకుంటాం. అయితే అదంతా వేరు, వాళ్ల గురించి తెలియడం వేరు.

ఇటీవల నేను చదివిన ఒక పుస్తకం బి.ఆర్.అంబేడ్కర్ గురించి నాకు తెలియని అనేకమైన విషయాలను వెల్లడించింది. అవేవీ వాస్తవ విరుద్ధమైనవి కావు. అలాగే సుప్రసిద్ధమైనవి కూడా! అయితే అవి అందరికీ తెలిసిన మనిషిగా అంబేడ్కర్‌లో భాగమై ఉన్నవి కావు.

ఎలాంటివంటే, నిజంగా ఆయనొక స్వాతంత్ర్య సమరయోధుడు కాదని మీకు తెలుసా? 1942 నుండి 1946 వరకు ఆయన వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కార్మిక శాఖ మంత్రిగా ఉన్నారు. అంతకు ముందు, 1931లో ఆయన: ‘‘బ్రిటిష్ వారి నుండి భారత ప్రజలకు తక్షణ అధికార మార్పిడి జరగాలని అణగారిన వర్గాలవారు (అప్పుడు షెడ్యూల్డ్ కులాలు అని పిలిచేవారు) నిరసించలేదు. నినదించలేదు. ఉద్యమించలేదు’’ అని వ్యాఖ్యానించి ఉన్నవారు.


ఈ విషయాన్ని నేను అశోక్ లాహిరి పుస్తకం ‘ఇండియా ఇన్ సెర్చ్ ఆఫ్ గ్లోరీ’ నుంచి గ్రహించాను. ‘‘స్వాతంత్ర్య పోరాటంలో అంబేడ్కర్ పోషించిన పాత్రేమీ లేకపోవడం అన్నది ఆయన అద్భుతమైన జీవన ప్రగతిలో అత్యంత వివాదాస్పదమైన అంశం’’ అంటాడు అశోక్ లాహిరి. అది నన్నెంతో విస్మయానికి గురి చేసిందని నేను ఒప్పుకొని తీరాలి.

అయితే ఇదొక్కటి మాత్రమే కాదు లాహిరి పుస్తకం బహిర్గతం చేసిన నమ్మలేని నిజం. అంబేడ్కర్ అసలు రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికే కాలేదని తెలుస్తోంది. 1945–46 ఎన్నికల్లో ఆయన పార్టీ ‘ఆలిండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్’ (ఎస్.సి.ఎఫ్.) 151 రిజర్వుడు సీట్లలో కేవలం రెండింటిని మాత్రమే గెలుచుకుంది. ‘బాంబే ప్రొవిన్షియల్ అసెంబ్లీ’ నుంచి ఎస్.సి.ఎఫ్. ఒకే ఒక్క సీటును గెలుచుకున్న ఫలితంగా అంబేడ్కర్ రాజ్యాంగ పరిషత్తు సభ్యుడు కాలేకపోయారు.

దాన్ని మించిన పరాజయం... అంబేడ్కర్‌కు మద్దతు ఇచ్చేందుకు ఎవరూ సిద్ధంగా లేకపోవడం! ‘‘డాక్టర్ అంబేడ్కర్‌కు రాజ్యాంగ పరి



వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో కార్మిక శాఖ మంత్రిగా బి.ఆర్. అంబేడ్కర్



షత్తు తలుపులతో పాటుగా కిటికీలు కూడా మూసి వేయబడ్డాయి’’ అని సర్దార్ పటేల్ ప్రకటించారు. ‘‘చూద్దాం... రాజ్యాంగ పరిషత్తులోకి అతడెలా ప్రవేశిస్తాడో’’ అని కూడా అన్నారు.

ఆ పరిస్థితుల్లో ముస్లిం లీగ్ శాసన సభ్యుడు జోగేంద్రనాథ్ మండల్ కాస్తా అంబేడ్కర్ వైపు నిలబడ్డారు. అంబేడ్కర్ కోసం తన సీటును త్యాగం చేశారు. అలా మండల్‌తో పాటు ఒకరిద్దరు ఎస్సీ ఎమ్మెల్యేలు, ఒకటీ లేదా రెండు ఆంగ్లో–ఇండియన్ ఓట్లతో బెంగాల్ నుంచి అంబేడ్కర్ రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికయ్యారు.

1947 జూలైలో మళ్లీ ఆయన ఇబ్బందుల్లో పడ్డారు. బ్రిటిష్ పార్లమెంటు భారత స్వాతంత్ర్య చట్టాన్ని ఆమోదించిన తర్వాత ఇండియాకు ఒకటి, పాకిస్థాన్‌కు ఒకటిగా రాజ్యాంగ పరిషత్తు విభజన జరిగింది. పర్యవసానంగా బెంగాల్ నుంచి అనేకమంది సభ్యులు తమ భారత రాజ్యాంగ పరిషత్తు సభ్యత్వాన్ని కోల్పోయారు. వారిలో అంబేడ్కర్ ఒకరు.

అయితే మళ్లొకసారి ఆయన్ని ఊహించని అదృష్టం కాపాడింది. కాంగ్రెస్ పార్టీతో విభేదాల కారణంగా ఎం.ఆర్. జయకర్ రాజీనామా చేయడంతో ఆయన స్థానం ఖాళీ అయింది. అంతేకాదు... ఈసారి భారతదేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులు అంబేడ్కర్ సభ్యత్వానికి తోడ్పాటును అందించేందుకు సిద్ధమయ్యారు.

వారిలో రాజ్యాంగ పరిషత్తు చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ ఒకరు. అప్పటి బొంబాయి ప్రధానమంత్రి బి.జి.ఖేర్‌కు ఆయన లేఖ రాశారు. ‘‘ఏ ఇతర పరిగణనలతోనూ నిమిత్తం లేకుండా తన సేవలను ఎవరూ వదులుకోలేని విధంగా ఉన్న ఆయన పనితీరును మాత్రమే గుర్తిస్తూ రాజ్యాంగ పరిషత్తులో, వివిధ కమిటీలలో ఆయన నియామకానికి ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఆయన బెంగాల్ నుంచి ఎన్నికయ్యారని మీకు తెలిసిందే! ఆ ప్రావిన్సు విభజన వల్ల 1947 జూలై 14 నుంచి ఆయన తన రాజ్యాంగ పరిషత్తు సభ్యత్వాన్ని కోల్పోవలసి వచ్చింది కనుక వెంటనే ఆయనను ఎన్నుకోవలసిన అవసరం ఉంది’’ అని అంబేడ్కర్‌కు ఆసరాగా నిలిచారు.

చివరికి పటేల్ కూడా అంబేడ్కర్ పట్ల తన వైఖరి మార్చుకున్నారు. అంబేడ్కర్‌కు సభ్యత్వం ఇప్పించేందుకు ఖేర్‌ను ఒప్పించడంతో పాటు, జయకర్ రాజీనామా వల్ల ఏర్పడిన ఖాళీని భర్తీ చేయబోయిన జి.వి. మావలంకర్‌కు నచ్చజెప్పి, ఆయన్ని పక్కకు తప్పించడంలో పటేల్ కీలకమైన పాత్ర పోషించారని లాహిరి రాశారు.

అంటే దేశానికి ఇది త్రుటిలో తప్పిన ముప్పు. అంబేడ్కర్ కనుక ఆనాడు రాజ్యాంగ పరిషత్తులో సభ్యుడిగా లేకపోయుంటే ఎలాంటి రాజ్యాంగం తయారై ఉండేదో ఊహించండి. ప్రజాస్వామ్యానికి మాతృమూర్తి అని మనం నేడు చెప్పుకుంటున్న దేశం తన రాజ్యాంగ పితను కోల్పోయి ఉండేది.

ఈ పుస్తకంలోని నమ్మశక్యం కాని వాస్తవాలు నాలా మీలోనూ జనింపజేసే అవకాశం ఉన్న ఒక ప్రశ్నను లేవనెత్తడం ద్వారా నేను ఈ వ్యాసాన్ని ముగిస్తాను. అంబేడ్కర్‌కు, బహుశా భారతదేశానికి కూడా మార్గనిర్దేశం చేసిన హస్తం ఏదైనా ఉండిందా? అంబేడ్కర్ మన రాజ్యాంగ పరిషత్తులో భాగం అని నిర్ధారించడానికి ఎవరిదైనా, లేదా ఏదైనా గట్టిగా ప్రభావం ఉన్నట్లు కనిపిస్తోంది. వాళ్లెవరు? అది ఏమిటి? అన్నదే ఆ ప్రశ్న.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్



సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

సింపుల్!



ఒకరికి వ్యతిరేకంగా బయటినుంచి ద్వేషం, కోపం వస్తున్నప్పుడు, ఆ ఒకరు ఆ భావనలను లోపలికి అనుమతించకూడదు.

– మౌలానా వహీదుద్దీన్ ఖాన్, ఇస్లాం స్కాలర్

పాత్రలే కీలకం



ఒక రచయిత ఫిక్షన్ రాస్తున్నా, నాన్–ఫిక్షన్ రాస్తున్నా ఆ పుస్తకానికి పాత్రలే ప్రాణం. ఏవో కొన్ని మినహాయింపులను వదిలేస్తే, అన్ని పుస్తకాలకూ పాత్రలే కేంద్రంగా ఉంటూ ఆ కథకు ప్రాణం పోస్తాయి. వాటి కోరికలు, ప్రేరణలు, లోపాలు... ఇవే కథనాన్ని ముందుకు నడుపుతాయి.

– మేరూ గోఖలే, పబ్లిషర్

అవి వేరు!



డాక్టర్: “మీకు మద్యం, పొగ, ఇంకా అలాంటి అలవాట్లు ఏమైనా ఉన్నాయా?” పేషెంట్: “లేవు డాక్టర్, నేను ప్యూర్ వెజిటేరియన్.” కారణం ఏదైనా గానీ ఇండియాలో పొగ తాగేవాళ్లు, మద్యం తాగేవాళ్ల విభాగంలోకే మాంసాహారులు కూడా వస్తారని నమ్ముతుంటారు.

– ప్రవీణ్ త్రిపాఠీ, సైకియాట్రిస్ట్

ఘోరం



టర్కీ 1952లో ‘నాటో’ సభ్యత్వం పొందింది. ఆ తర్వాత 22 ఏళ్లకు, అంటే 1974 జూలై 20న సైప్రస్ రిపబ్లిక్‌ను టర్కీ దురాక్రమించింది. ఇప్పటికి కూడా ఆ ద్వీపంలోని 36 శాతం అక్రమంగా టర్కీ అధీనంలోనే ఉంది. సైప్రస్ ఉత్తర భాగంలోని మొత్తం టర్కీయేతర తెగలందరినీ టర్కీ నిర్మూలించింది.

– ఉజయ్ బులూత్, ఫెలో

భవిష్యత్ పటం



రెండు దశాబ్దాల లోపల, పాకిస్తాన్ కంటే ఇండియా పరిస్థితి దారుణంగా తయారవుతుంది. తన బ్రిటిష్ వ్యవస్థలను నిర్వీర్యం చేసి పాకిస్తాన్ పరియా విధించింది. ఆ పని చేయని బంగ్లాదేశ్, ఇండియా కంటే మెరుగవుతోంది. మిగిలివున్న బ్రిటిష్ వ్యవస్థలను హిందూయిజపు అవ్యవస్థలతో ఇండియా పునఃస్థాపిస్తోంది. ఇది ఉపశమనం లేని దారుణం.

– జయంత్ భండారీ, ఎనలిస్ట్

సనాతన సత్యం



ఎవరు సనాతనీ? ప్రకృతి సూత్రాలు, ప్రాచీన వివేకం, రుషులు, సాధువులు, శాస్త్రవేత్తలు, కళాకారులు, ఆస్తికులు, నాస్తికుల ద్వారా కావ్యాలు, పురాణాల రూపంలో ప్రవహించిన జ్ఞానం నుంచి పరిణామం చెందినదే సనాతన ధర్మం. సనాతనం అంటే శాశ్వతమైనది. సనాతనానికి వ్యతిరేకంగా పోవడమంటే ప్రకృతి సూత్రాలకు వ్యతిరేకంగా పోవడమే! మనుషుల్ని మనుషులు గెలవగలరు. కానీ మనుషులు ప్రకృతిని ఎప్పటికీ గెలవలేరు.

– ఖాలిద్ ఉమర్, లౌకిక మానవవాది

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

కవిత

తప్పి పోయింది!

ఎవరక్కడ..?
నా కుక్క తప్పిపోయింది/తక్షణం వెతికిపెట్టండి
ఎన్ని సార్లు చెప్పినా /మీరు జాగ్రత్త వహించలేదు
నిర్లక్ష్యంగా వ్యవహరించారు

ప్రజల సొమ్ము తింటున్న / మీకు విశ్వాసం లేదు
ఉద్యోగం మీద ధ్యాస లేదు / ప్రభుభక్తి అసలే లేదు

మిమ్మల్ని ఉద్యోగం నుంచి
తొలగించాలని ఆదేశిస్తున్నాను
దాన్ని వెతికి తెస్తె సరే సరి
లేదంటే / మీ ఉద్యోగాలు పోతాయి
మీ బతుకు / కుక్క బతుకు అవుతుంది.

ఎవరక్కడ...
నా కుక్కని వెదికి / వెంటనే ప్రవేశపెట్టండి!!
అది లేకపోతే / నాకు భోజనం సహించదు
నిద్ర కూడా పట్టదు

:::

అయ్యా...
మా శక్తి సామర్థ్యాలను ఉపయోగించి
మా పరిశోధనా పాటవాలను ప్రయోగించి
మీ కుక్కను దొరికించుకున్నాం!
విశ్వాసానికి ప్రతీక అయిన కుక్క
మీ మీద విశ్వాసం చూపించడం లేదు!
అది మీ ఉప్పు తినలేదో
మీ తెంపరితనం దానికి నచ్చలేదో
రానంటే రానని మొండికేస్తోంది!
బంధించి / ఇక్కడే ఉంచమంటారా?
మీరున్న నగరానికి తీసుకొని రమ్మంటారా?
లేదా /ఎన్ కౌంటర్ చెయ్యమంటారా?
ఏదో ఒకటి చెప్పండి!

– జింబో

సారాంశం
సరికొండ చలపతి

రెయిన్–పెయిన్... సేమ్ సీన్!

ముందుమాట

‘‘రండి రండి.. మీ కోసమే చూస్తున్నాం. పోయి నేడాది ఇదే సమయం ఇదే వానల్లో వచ్చారుగా.. ఫొటోలు వీడియోలు తీసుకున్నారుగా.. మమ్మల్ని నానాప్రశ్నలు వేశారుగా! ఏమైంది? ఏమన్నా మారిందా? మాకు చెప్పడం మీరు వినడం అంతేగా. మీరు అటు వెళ్లగానే ఓ మంద వస్తది.. పావలా అర్ధ ఇస్తరు.. సరుకులు మొహాన కొడతరు.. ఫొటోలు దిగుతరు.. అంతే మా బాధలు మావి.. అంతా మునుగుడే.. ఎందుకీ సోదంతా.. మా పరిస్థితి మారేదిలేదు.. మా గురించి ఎవరూ పట్టించుకునేది లేదు. మళ్లీ వచ్చేయేడు రండి మాట్లాడుకుందాం.’’

– వరదల బాధలు రిపోర్ట్ చేయడానికి వచ్చిన టీవీ రిపోర్టర్‌పై ఓ మహిళ ఫైరింగ్.

ఇంట్లో నీళ్లు... కంట్లో నిప్పులు

రోటికాడ పాట

వానల్లు కురవాలి వానదేవుడా –
వరిచేలు పండాలి వానదేవుడా
చెరువులన్ని నిండాలి వానదేవుడా –
చేలన్నీ పండాలి వాన దేవుడా

అని కరువు రోజుల్లో తెలుగులో.. రెయిన్ రెయిన్ గో అవే–కమ్ ఎగైన్ ఎనదర్ డే.. అని వరదల కాలంలో.. ఇంగ్లిషులో పాడుకునేది పిల్లలే కాదు.. ఇంకో సెక్షన్ కూడా ఉంది. వానలు పడగానే రెయిన్‌కోట్లు వేసుకుని హడావిడిగా నీళ్ల నిండిన ఇళ్ల వద్ద మందీ మార్బలంతో, అనుచర, అధికార గణంతో, గొడుగులతో ప్రాజెక్టుల వద్ద ప్రత్యక్షమయ్యే సెక్షన్.

గాంధారి వాన

వానల కోసం రెండు నెలలుగా ఎదురు చూస్తుండగా వారం పదిరోజులు దంచి కొట్టి కసి తీర్చుకున్న వాన.. కుండపోత వాన అనుకున్నాం కదా! ఒక్క కుండపోతే కాదు... ఇలాంటి వానలు పాతిక రకాలుంటాయట...

మాపుసారి వాన, మీసర వాన, దుబ్బురు వాన, సూరునీల్ల వాన, బట్టదడుపు వాన, తెప్పె వాన, సాలు వాన, ఇరువాలు వాన, మడికట్టు వాన, కుండపోత వాన, ముసురు వాన, దరోదరి వాన, కప్పదాటు వాన, సాలేటి వాన, సాలుపెట్టు వాన, గాంధారి వాన... ‘‘కుండపోత వాన కాదు. మనకు పడే ప్రతి వానా.. గాంధారి వానే! ధృతరాష్ట్ర పాలన కదా! వానా కనపడదు..బాధలూ కనపడవు.’’

– సర్కారు సెలవులిస్తే ఇంట్లో కూర్చుని మిర్చీ బజ్జీ తింటూ, టీవీల్లో చూపే జనాల బాధలు చూసి ఒకాయన చిటపటలు.

...

‘సాయం’ కాలం మాట

‘సర్! ప్రతిసారీ ఇలా వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఇలా పదో పరక సాయం చేసే బదులు ..చిన్న చిన్న డ్రైనేజీ సమస్యలే కదా.. తక్కువ ఖర్చుతో పోతుంది కదా చేయిస్తే పోలా’ అని ఓ ప్రజా ప్రతినిధిని ఆయన పీఏ ప్రశ్నిస్తే...‘అన్ని సమస్యలూ తీరిస్తే వచ్చే ఎన్నికల్లో హామీ ఇవ్వడానికి ఏం మిగులుతాయి..’ అని ఆ ప్రజాప్రతినిధి ఎదురు ప్రశ్న.

పూర్తిగా సమస్యలు తీరడం వీరికి ఇష్టం ఉండదన్న మాట, దానితో పాటు డబ్బులు ఖర్చుపెట్టడం కూడా ఇష్టం ఉండదట.. దానికీ ఓ జోక్ ఉంది.

‘‘ప్రజా ప్రతినిధి.. అంటేనే ప్రజల ప్రతినిధినీ తినేవాడు అని..’

– ఈ అర్థం జీర్ణం చేసుకున్నాక సమస్యలు



తీర్చడానికి డబ్బులేం మిగులుతాయి.. అని ఓ నిష్ఠూరం.

...

కాటకాల ఆట

ధృతరాష్ట్ర పాలన గాంధారి వానలను విస్మరించినా, తాత్కాలికంగా ఏమార్చే ప్రయత్నం చేసినా... ఎన్నికల కురుక్షేత్రంలో జనం దాని తాలూకు రుచి చూపుతూనే ఉంటారు. అధికార పార్టీల ఆశలపై ‘నీళ్లు’ చల్లుతూనే ఉన్నారు. అలా మన దేశంలో వరదలు, కరువు పరిస్థితులు కొన్నిసార్లు ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ రాజకీయ పరిణామాలనే మార్చేశాయి. అలాంటివి కొన్ని చూడండి.

- 1960వ దశకం మొదట్లో దేశంలో కరువు పరిస్థితులు నెలకొనడం మొదలైంది. 1966 నాటికి తీవ్ర కరువు ఏర్పడింది. దేశంలో ఆహార ధాన్యాల దిగుబడి ఏకంగా 23.5 శాతం తగ్గిపోయింది. దీనితో ధరలు పెరిగిపోయి ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభ పరిస్థితి తలెత్తింది. దీనిని చక్కదిద్దడానికి అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం 1966 జూన్ 6న రూపాయి విలువ (డాలర్‌తో మారకంలో)ను తగ్గించింది. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో ఇందిరాగాంధీపై వ్యతిరేకత పెరిగింది. ఇది 1969లో జాతీయ కాంగ్రెస్‌లో చీలికకు దారితీసింది. ఇందిరాగాంధీ సొంతంగా పార్టీ పెట్టుకోవాల్సి వచ్చింది.
- 1973లోనూ భారత్‌లో మరోసారి తీవ్ర కరువు వచ్చింది. దానికి చమురు ధరల మంట తోడై.. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లింది. అంతకు రెండేళ్ల ముందు ‘అపర కాళిక’గా కీర్తింపబడిన ఇందిరాగాంధీపై ఇటు ప్రజల్లోనూ వ్యతిరేకత మొదలైంది. ప్రతిపక్షాలు ఒక్కసారిగా యాక్టివ్‌గా మారాయి. జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో ప్రతిపక్షాల ఉద్యమాలు మొదలయ్యాయి. వాటిని అణచడానికి ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించడం, ఆ ప్రభావంతో చిత్తుగా ఓడిపోయి.. జనతా పార్టీ సంకీర్ణ సర్కారు ఏర్పడటం అందరికీ తెలిసిందే.
- కరువు పరిస్థితులు 1986లోనూ జాతీయ రాజకీయాల్లో గట్టి ప్రభావం చూపాయి. జనంలో అప్పటి ప్రభుత్వంపై, ప్రధాని రాజీవ్ గాంధీపై వ్యతిరేకత పెరగడాన్ని పసిగట్టిన వీపీ సింగ్.. కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చి సొంత పార్టీ పెట్టుకున్నారు. బీజేపీ సహా పలు ప్రతిపక్షాలను కూడగట్టి.. కాంగ్రెస్ పార్టీని ఓడించి ప్రధాని అయిపోయారు.
- 2002లో వచ్చిన కరువు దేశ రాజకీయాల్లో మరోసారి మార్పులకు దారితీసింది. 20 శాతం లోటు వర్షపాతంతో, దేశంలో ఏకంగా 30 శాతం భూభాగం కరువు బారినపడటం, ధరలు పెరగడం... కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. దేశంలో బీజేపీ నేతృత్వంలో ఏర్పడిన తొలి ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి గట్టి దెబ్బ తగిలింది. 2004 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలోకి వచ్చింది.

ఓటుకాడ ‘స్పాట్’

కరువులు, వరదలు ఎన్నికలను ఎలా ప్రభావితం చేస్తాయి? పార్టీలు, ప్రభుత్వాల చేతుల్లో లేని కరువు, వరదల కారణంగా ప్రజలు ఆగ్రహంగా ఉండటం ఏమిటి? అన్న అంశాలపై కొద్దికాలం క్రితం ఓ సంస్థ అధ్యయనం చేసింది. మన దేశంలో జాతీయ, రాష్ట్ర, స్థానిక ఎన్నికలు, మధ్యంతరాలు, ఉప ఎన్నికలు వంటి వన్నీ కలిపి ఇప్పటివరకు వేలాది ఎన్నికలు జరిగాయి. వాటన్నింటినీ విశ్లేషించగా.. కరువులు, వరదలతో ఏర్పడే పరిస్థితులతో పాటు, అప్పుడు అధికారంలో ప్రభుత్వాలు ఎలా స్పందించాయనే అంశం కూడా ప్రజల మూడ్‌ను ప్రభావితం చేస్తున్నట్టు తేలింది.

ముఖ్యంగా ఎన్నికలు సమీపంలో ఉన్న సమయంలో వచ్చిన కరువు లేదా వరదలను ఎదుర్కొనేందుకు సదరు ప్రభుత్వం ఏ స్థాయిలో సహాయ కార్యక్రమాలు చేపట్టింది? ప్రజలకు నేరుగా ఎంత మేర ప్రయోజనం కలిగించింది అన్నది కీలకమని అధ్యయనం గుర్తించింది. ఉపశమన చర్యలు, సంక్షేమం కోసం ఎక్కువ ఖర్చు చేసిన ప్రభుత్వాలపై వ్యతిరేకత తక్కువగా ఉందని తేల్చింది.

అందుకే... ఆన్ ది స్పాట్..

వర్షాలు లేక విత్తనాలు మొలకెత్తకపోతే వీరికి ఓట్లు పండవు.

వరదొచ్చి ఇళ్లలోకి నీళ్లు వస్తే,,, పీఠం కిందికి నీరు వస్తుందని భయం!

టీవీల నిండా, పేపర్ల నిండా నీళ్లతో పాటు బాధితుల కళ్లలో నీళ్లు, గొంతులో నిప్పులు కనపడేసరికి కంగారు పడి స్కూళ్లకు, విద్యాసంస్థలకు కాసిన్ని సెలవులు, అక్కడక్కడ కాసింత సాయం, మరికొన్ని హామీలతో సమస్య కాస్త తగ్గించే హడావిడి కనిపిస్తుంది.

– పైన గృహిణి చెప్పినట్టు మళ్లీ వర్షాలకు సేమ్‌సీన్.

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.3.07 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** పూర్వాషాఢ సా.6.34 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** రా.2.07 నుండి 3.36 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.33 నుండి 1.24 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.57 వరకు, **అమృతఘడియలు:** ప.2.06 నుండి 3.30 వరకు ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.42, **సూర్యాస్తమయం:** 6.31.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

బీసీ సీఎంను ప్రకటించిన పార్టీలకే బీసీల మద్దతు



బీసీల సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ/ముషీరాబాద్ (హైదరాబాద్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిగా ప్రకటించిన పార్టీలకే బీసీల మద్దతు ఉంటుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తేల్చిచెప్పారు. ఆదివారం దుడుకు లక్ష్మీనారాయణ అధ్యక్షతన కాచిగూడలో జరిగిన సమావేశంలో 'బీసీల సింహగర్జన సదస్సు'పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఆగస్టు 6వ తేదీన నల్లగొండలో నిర్వహిస్తున్న బీసీల సింహగర్జన సభను విజయవంతం చేసి బీసీల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, అంజి, లక్ష్మణ్, రాజ్‌కుమార్, టి.నందగోపాల్, సుధాకర్, పద్మ, రాజేందర్, రాందేవ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం బీసీల బడ్జెట్ రూ.2 లక్షల కోట్లకు కేటాయించాలని, బీసీలకు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 8వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కృష్ణయ్య అన్నారు. ఆదివారం బీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్, పండరీనాథ్, కిరణ్, మురళీకృష్ణ, శ్రీకాంత్‌గౌడ్, నాగేశ్వర్‌రావు, అజయ్ తదితరులున్నారు.

జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లివ్వాలి



బీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

పంజగుట్ట (హైదరాబాద్): బీసీలకు విద్య, ఉద్యోగం, ఆర్థిక, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని లేనిపక్షంలో దేశంలో మరో మహామండల్ ఉద్యమం తీసుకువస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. దేశంలోని బీసీల చరిత్రను తిరగరాసేందుకు బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ మహారాష్ట్ర, అఖిల భారత బీసీ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 7న తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ స్టేడియం గ్రౌండ్‌లో 'అఖిల భారత జాతీయ ఓబీసీ 8వ మహాసభలు'నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీ, అగ్రకులాలకు కూడా జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లున్నాయని కేవలం బీసీలకు మాత్రమే జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు లేవని ఆవేదన వ్యక్తంచేశారు. మహాసభలకు దేశవ్యాప్తంగా 26 పార్టీల నేతలు, తెలుగు రాష్ట్రాల నుంచి మంత్రులు హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ, జాతీయ విద్యార్థి విభాగం అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, మహేశ్‌యాదవ్, శ్యామల, సుజాత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు ప్రధాని హామీ




మందకృష్ణ మాదిగ

జడ్చర్ల: ఎస్సీ రిజర్వేషన్‌ను వర్గీకరిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ హామీ ఇచ్చారని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల వరంగల్ సభకు విచ్చేసిన ప్రధానిని కలిశానని, వర్గీకరణ గురించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలోనే చర్చించానని చెప్పారు. తాను ఇచ్చిన వినతిపత్రాన్ని మోదీ నిశితంగా పరిశీలించి, త్వరలోనే వర్గీకరణ చేపట్టేలా చర్యలు తీసుకుంటామని చెప్పారని వివరించారు. అయితే వర్గీకరణ బిల్లును అంత సునాయాసంగా పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం లేదని, చివరివరకు కుట్రలు జరుగుతాయని, మాల నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తారని ఆరోపించారు. ఇకపై కాలయాపన చేయకుండా ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో జాతి కోసం పోరాడాలని, రాజకీయ పార్టీల జెండాలు మోసేందుకు కాకుండా దండోరా ఉద్యమానికి సమయం ఇవ్వాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ మాదిగల వ్యతిరేకి అని, ఒక చేత్తో దళితబంధు ఇచ్చి, మరోచేత అసైన్డ్ భూములు లాక్కున్నారని దుయ్యబట్టారు.

ఆరోగ్యం.. గురకాయ స్వాహా

- వయసులకతీతంగా గురక సమస్యలు
- వ్యాధులకు మూలం అంటున్న వైద్యులు
- చికిత్స తీసుకోకపోతే ప్రాణాలకూ ముప్పు!
- గురక సమస్యలపై మనదేశంలో అవగాహన అంతంతే

'చెవిచిల్లు పెట్టే నీ గురక... చిందరవందర అయింది నా పడక' అని నిద్రలో గురక పెట్టే వాళ్లపైన చుట్టుపక్కలవాళ్లు గింజుకుంటారు. అయితే నిద్రలో గురకపెట్టేవారికి అంతకు మించిన సమస్యలే ఎదురవుతాయని హెచ్చరిస్తున్నాయి అధ్యయనాలు. ఎవరైనా మంచం మీద ఇలా వాలి అలా గుర్రుపెట్టారంటే హాయిగా నిద్రపోతున్నారనుకుంటాం. అయితే గురకపెడుతూ నిద్రపోవడం హాయిగా భావించడం సరికాదని, దానిని తీవ్రమైన ఆరోగ్య సమస్యగా భావించాలని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. గురక తెచ్చిపెట్టే సమస్యలపై మన దేశంలో అవగాహన అత్యల్ప స్థాయిలో ఉందని వారంటున్నారు



సాక్షి, హైదరాబాద్

ఇటీవల చేసిన రెస్మెడ్-2023 గ్లోబల్ స్లీప్ సర్వేలో 58 శాతం మంది భారతీయులు గురకను మంచి నిద్రకు చిహ్నంగా భావిస్తున్నట్టు తేలడం నిద్ర ఆరోగ్యంపై వారి అవగాహన లేమిని తేల్చింది. 2022తో పోలిస్తే 2023లో మన వాళ్ల నిద్ర నాణ్యత 22 శాతం క్షీణించినా సర్వేలో పాల్గొన్నవారిలో 85 శాతం మంది తమ నిద్ర నాణ్యత బాగుందన్నారని సర్వే వెల్లడించింది. మూడ్ మార్పులు, పగటినిద్ర, ఏకాగ్రత లోపం ఉన్న 20 శాతం మంది మాత్రమే వైద్యుడ్ని సంప్రదించాలని నిర్ణయించుకున్నారని తేల్చింది.

గురక.. అనారోగ్య కారణమే...

అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ మెడికల్ జర్నల్ 'న్యూరాలజీ ఆన్‌లైన్'సంచికలో ప్రచురించిన అధ్యయనం ప్రకారం..గురక పెట్టే వారికి స్ట్రోక్ వచ్చే అవకాశం 91 శాతం ఎక్కువ. అంతేకాదు గురకపెట్టేవారిలో దాదాపు 20–25 శాతం మంది గురక.. తద్వారా అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా (ఒఎస్ఎ)తో బాధపడుతూ ఉండవచ్చునని మరో అధ్యయనం తేల్చింది. గురకపెట్టే వారిలో ప్రతి నాల్గవ వ్యక్తి స్లీప్ అప్నియా రోగి అని వైద్యులు అంటున్నారు.

పెరుగుతున్న బాధితులు

గురక-స్లీప్ అప్నియాతో బాధపడుతున్న చాలా మందికి దాని తీవ్రమైన పరిణామాల గురించి తెలియదని ఛాతీ, శ్వాసకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ సందీప్ అంటున్నారు. '40 శాతం మంది వ్యక్తులు గురక పెట్టినట్లయితే, వారిలో 10 శాతం మందికి స్లీప్ అప్నియా ఉన్నట్టే'అని దేశంలో తొలి స్లీప్ ల్యాబ్ ప్రారంభించిన డాక్టర్ జేసీ సూరి అన్నారు. తాను స్లీప్ ల్యాబ్ ప్రారంభించినప్పుడు నెలకు నలుగురైదుగురు రోగులు మాత్రమే వచ్చేవారని, ఇప్పుడు ఆ సంఖ్య గణనీయంగా పెరిగిందని అందులో మధ్య వయస్కులు, వృద్ధుల సంఖ్య దాదాపు 15–20 శాతంగా ఉందన్నారు. 'స్లీప్ అప్నియా ద్వారా రక్తపోటు, గుండె జబ్బుల ప్రమాదం కూడా ఉందని అంటున్నారు.

బాల్యంలోనే...

నగరానికి చెందిన ఏఐజీ ఆసుపత్రి ఇటీవలి అధ్యయనం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 30 నుంచి 40 శాతం మంది పిల్లలు గురక, నిద్రలేమితో బాధపడుతున్నారు. చిన్నారుల్లో గురకకు చికిత్స చేయకపోతే మానసిక వికాసం, మేధో సామర్థ్యాలు దెబ్బతింటాయని, శారీరక చురుకుదనంపై కూడా ప్రభావం చూపుతుందని, దీర్ఘకాలిక అనారోగ్యానికి దారితీయవచ్చునని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గురక లక్షణాలున్న కేసుల్లో దాదాపు 70 శాతం మంది పిల్లలకు స్లీప్ అప్నియా ఉన్నట్టు, 15 నుంచి 20 శాతం మంది పాఠశాల పిల్లలు ఊబకాయంతో ఉన్నారని వీరిలో అత్యధికులు గురకతో బాధపడేవారేనని ఏఐజీ అధ్యయనంలో తేలింది, నిద్ర పోకుండా పిల్లలు ఎక్కువ గంటలు మేల్కొని ఉండటం అధిక చురుకుదనం లక్షణంగా తల్లిదండ్రుల భావిస్తే అది అపోహ మాత్రమేనని వైద్యులు స్పష్టం చేస్తున్నారు.

స్లీప్ అప్నియా లక్షణాలివే..

నిద్రలో కండరాలు సడలించడం వల్ల శ్వాసనాళాలు కుంచించుకుపోతాయి. ఫలితంగా ఆక్సిజన్ అందక అది నాణ్యమైన శ్వాసక్రియకు, నిద్రకు తీవ్రమైన అంతరాయం కలిగించే పరిస్థితే స్లీప్ అప్నియా. గురక ముదిరి స్లీప్ అప్నియాకు దారి తీస్తుంది. సాధారణంగా ఊబకాయం ఉన్న వారిలో ఇది కనిపిస్తుంది. మెడ చుట్టుకొలత తగినంత లేకపోవడం, ఎగువవైపునకు గాలి వెళ్లే మార్గం ఇరుకుగా మారడం స్లీప్ అప్నియాకు దోహదం చేస్తుంది. ఉదాహరణకు, పిల్లలలో టాన్సిల్స్ లేదా అడినాయిడ్స్ కూడా స్లీప్ అప్నియాకు కారణం కావచ్చు. స్లీప్ అప్నియా ముదురుతున్న దశలో వ్యక్తి సురక్షితంగా డ్రైవింగ్ చేసే సామర్థ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. పగటిపూట అధికంగా నిద్రపోవడం ఏకాగ్రత లోపాలకు దారితీస్తుంది. 'స్లీప్ అప్నియా చికిత్సలో భాగంగా బరువు తగ్గడం, ధూమపానం మానేయడం, ఆల్కహాల్ బాగా తగ్గించడం, తీరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం తప్పనిసరి. ఈ వ్యాధి తీవ్రమైతే రోగులకు మాస్క్ ద్వారా గాలిని అందించే వైద్య పరికరం, కొన్ని సందర్భాల్లో, అడ్డంకిని సరిచేయడానికి శస్త్రచికిత్స కూడా అవసరం కావచ్చు.

పిల్లలకు మరింత చేటు...



తీవ్ర గురకతో బాధపడుతున్న పిల్లల్లో చురుకుదనం, శ్రద్ధ లోపిస్తాయి. చిరుతిళ్లు అధికంగా తినడం, చిరాకు, తరచుగా అలసట ఉంటాయి. గురక, నోటితో శ్వాస తీసుకోవడం, రాత్రి పూట చెమట పట్టడం వంటివి పిల్లల్లో గమనిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

-ఆర్.దీప్తి, చీఫ్ పీడియాట్రిషియన్, అమోర్ హాస్పిటల్స్

'నవోదయ'లో రీజినల్ మీట్ కబడ్డీ పోటీలు రద్దు

కూసుమంచి: ఖమ్మం జిల్లా పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆగస్టు 3 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించాల్సిన రీజినల్ మీట్ కబడ్డీ పోటీలను రద్దు చేసినట్లు నవోదయ విద్యాలయాల హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ అభిజిత్ బేరా తెలిపారు. ఆదివారం ఆయన విద్యాలయంను సందర్శించి విలేకరులతో మాట్లాడారు. ఈ రీజినల్ మీట్ పోటీల్లో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన నవోదయ విద్యార్థులు పాల్గొనాల్సి ఉందన్నారు. అయితే, విద్యాలయంలో శనివారం దుర్గా నాగేందర్ అనే విద్యార్థి విద్యుత్ షాక్‌తో మృతిచెందడంతో పోటీలను రద్దు చేశామని వెల్లడించారు.

జీతాల్లేవ్... రెన్యువల్ లేదు

- వైద్య విధాన పరిషత్‌లో 3,650 మంది కాంట్రాక్టు ఉద్యోగుల వెతలు
- మూడు నెలలుగా వేతనాలు అందక అవస్థలు
- ఈ ఏడాది మార్చితో ముగిసిన కాంట్రాక్టు గడువు
- ఇప్పటికీ రెన్యువల్ చేయని ప్రభుత్వం
- పని చేయించుకుంటున్నా కనీసం పట్టించుకోని వైనం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వేతనాల కోసం అల్లాడుతున్నారు. మూడు నెలలుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వేతనాలు మాత్రం అందడం లేదు. అందుకు ఆర్థిక శాఖ నుంచి అనుమతులు రాకపోవడమేనని అధికారులు చెబుతున్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో దాదాపు 3,650 మంది పనిచేస్తున్నారు. డాక్టరు స్థాయి మొదలు స్టాఫ్ నర్సులు, రేడియోగ్రాఫర్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డార్క్ రూమ్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డ్స్ తదితర కేడర్లలో కాంట్రాక్టు ప్రాతిపదికన, ఔట్ సోర్సింగ్ పద్ధతుల్లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును ప్రతి సంవత్సరం రెన్యువల్ చేస్తారు. ఏప్రిల్ నెల నుంచి మార్చి వరకు సర్వీసు కాల పరిమితి ఉంటుంది. ఆ తర్వాత తిరిగి రెన్యువల్ చేస్తేనే నిధులు విడుదల చేస్తారు.

పెండింగ్.. పెండింగ్..

ఈ ఏడాది ఏప్రిల్‌లో వైద్య విధాన పరిషత్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసు రెన్యువల్ ప్రతిపాదనలను ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి సమర్పించారు. సాధారణంగా ఈ ప్రక్రియ వారం నుంచి పది రోజుల్లోగా పూర్తి కావాలి. కానీ ఏప్రిల్ నెలలో సమర్పించిన ప్రతిపాదనలకు ఇప్పటికీ ఆమోదం రాలేదు. ఆ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ ఫైలు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 3,650 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వీసు రెన్యువల్ కోసం ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నారు.

ఏటా ఇదే తంతు...

వైద్య విధాన పరిషత్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతన చెల్లింపుల్లో ప్రతి సంవత్సరం తీవ్ర జాప్యం జరుగుతోంది. ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో వేతనాలు అందడంలో ఆలస్యం అవుతోంది. ఇందుకు ప్రధాన కారణం సర్వీసు పునరుద్ధరణే. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చొరవ తీసుకోవాలని ఉద్యోగులు మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రాలు సమర్పించారు.

మా ఉద్యమ ఫలితమే ఈరోజు మీకీ అధికారం

టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



చేవెళ్ల: 'కేసీఆర్.. ఉద్యమకారులుగా మా పోరాటాలే లేకపోతే మీకు ఆ కుర్చీ ఎక్కడిది? అధికారం వచ్చిన తర్వాత ఉద్యమకారులు కనిపించటం లేదా? కుర్చీ ఎక్కించిన మేమే ఆ కుర్చీని దించుతాం'అని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఆదివారం నియోజకవర్గ స్థాయి తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ చరిత్రనే వక్రీకరించారని, కేసీఆరే తెలంగాణ తెచ్చారనే భ్రమలో పడేశారని విమర్శించారు. ఉద్యమకారులు సాధించుకున్న తెలంగాణలో వారి ఆత్మగౌరం నిలబెట్టే పార్టీలకే తమ మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు. అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమకారుల డిమాండ్లను నేరవేరుస్తామని మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమం అంటేనే త్యాగమని, ఎన్నో త్యాగాలు చేసి స్వరాష్ట్రం సాధించుకున్నామని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. అలాంటి రాష్ట్రంలో ఇప్పుడు ఉద్యమకారులుగా మమ్మల్ని గుర్తించండి, మాకు పింఛన్ ఇవ్వండి అని అడుక్కోవాల్సిన దుస్థితి రావడం సిగ్గుచేటన్నారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమకారులను అన్ని రాజకీయ పార్టీలు గుర్తించి తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 20న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహిస్తున్న ఉద్యమకారులు ఆత్మగౌరవ సదస్సుకి పెద్దఎత్తున ఉద్యమకారులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఆంజనేయులు, మేడ్చల్ జెట్పీటీసీ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జి బేగరి రాజు, బీసీప సేన రాష్ట్ర అధ్యక్షుడు బర్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాస్ ఉంటేనే ర్యాంప్ నుంచి మాడవీధిలోకి...

- యాదగిరిగుట్టలో అమల్లోకి కొత్త నిబంధన



పాస్‌చెక్ చేస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాధికారులు కొత్త నిబంధన అమల్లోకి తీసుకురావడంతో స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులు గతంలో మాదిరిగా ఎలాపడితే అలా దర్శనానికి వెళ్లడం ఇకనుంచి వీలు పడదు. గతంలో ప్రధానాలయంలోని బాలాలయాన్ని తొలగించి అక్కడి నుంచి భక్తులు మాడ వీధిలోకి వెళ్లేందుకు సీసీరోడ్డుతో కూడిన ర్యాంప్‌ను వేశారు. ఈ ర్యాంప్‌పై నుంచే మాడవీధిలోకి భక్తులు దర్శనానికి వచ్చేవారు. ఇదేమార్గంలో కొండపైనే ఉన్న బస్టాండ్ వద్దకూ వెళ్లేవారు. ఇప్పుడు ఈ ర్యాంప్‌పై రూ.300 టికెట్ కొనుగోలు చేసి బ్రేక్ దర్శనాలకు వెళ్లే భక్తులు, అభిషేకంతో పాటు ప్రొటోకాల్ కార్యాలయం నుంచి అధికారి సంతకం చేసి ఉన్న పాస్‌లు ఉన్న భక్తులను మాత్రమే అనుమతిస్తున్నారు. పాస్‌లు, టికెట్లను ఎస్పీఎఫ్ సిబ్బంది పకడ్బందీగా తనిఖీలు చేసిన తర్వాతే ర్యాంప్‌పైకి అనుమతిస్తున్నారు. ఇక వర్షాల కారణంగా పాఠశాలలకు వరుసగా సెలవులు రావడంతోపాటు ఆదివారం వారాంతపు సెలవు కావడంతో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి వారికి నిత్యాదాయం రూ.34,23,679 వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పేట్ బషీరాబాద్ స్థలాన్ని అప్పగించాలి

- సీఎం కేసీఆర్‌కు జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ సొసైటీ వినతి



మాట్లాడుతున్న వంశీ. చిత్రంలో పల్లె రవికుమార్, రవికాంత్‌రెడ్డి, జ్యోతి ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: దశాబ్దకాలానికిపైగా చేసిన పోరాటం ఫలితంగా మంజూరైన ఇళ్ల స్థలాలను వెంటనే సొసైటీకి అప్పగించాలని జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పేట్ బషీరాబాద్‌లో 38 ఎకరాలను తమకు కేటాయించేలా అధికారులను ఆదేశించాలని సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. సొసైటీ సభ్యులు ఆదివారం పేట్ బషీరాబాద్‌లో సమావేశమై తమ సమస్యలపై చర్చించారు. తాము ప్రభుత్వానికి రూ.12.33 కోట్లు చెల్లించామని, సుదీర్ఘ నిరీక్షణ కారణంగా సొంత ఇళ్లలో నివసించాలనే కోరిక నెరవేరకుండానే 60 మంది సభ్యులు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాంపేట్‌లోని 32 ఎకరాల స్థలాన్ని తమకు అప్పగించేలా ఆదేశాలు ఇచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి స్పందించి వెంటనే తమకు దక్కాల్సిన భూమిని అప్పగిస్తారని సొసైటీ ఉపాధ్యక్షుడు పల్లె రవికుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆగస్టు 10లోగా హెచ్ఎండీఏ అధికారులు పేట్ బషీరాబాద్‌లో ఆక్రమణలను తొలగించి 38 ఎకరాలను తమకు అప్పగించాలని సొసైటీ గడువు విధించింది. లేని పక్షంలో హెచ్ఎండీఏ కార్యాలయం ఆవరణలో ఆమరణ దీక్షకు దిగుతామని హెచ్చరించింది. ఈ సమావేశంలో సీఈఓ వంశీ శ్రీనివాస్ మాట్లాడుతూ సొసైటీకి ఉపకరించే దిశగా తాము తీసుకున్న పలు చర్యలను వివరించారు. ఈ సమావేశంలో సభ్యులు బీఎస్ జ్యోతిప్రసాద్, కె.రవికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలకు బ్లాక్ స్ప్రే చేసి.. గ్యాస్ కట్టర్‌తో తెరిచి..

- ఏటీఎంలో రూ.23 లక్షలు చోరీ
- నల్లగొండ జిల్లా అయిటిపాములలో ఘటన



ఏటీఎంలో చోరీకి గురైన యంత్రం

కట్టంగూర్: గుర్తుతెలియని దుండగులు ఏటీఎం కేంద్రంలోకి చొరబడి మెషీన్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి రూ.23లక్షలు అపహరించుకుపోయారు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాములలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన వివరాలిలా.. ఎస్‌బీఐ బ్యాంకు పక్కనే ఉన్న ఏటీఎం గదిలో రెండు యంత్రాలు ఉన్నాయి. ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు తెల్లవారుజామున 2:30–3 గంటల సమయంలో ఏటీఎం కేంద్రం వద్దకు కారులో వచ్చారు. మొదటగా ఓ వ్యక్తి చేతులకు గ్లౌజ్‌లు, తలకు టోపీ, ముఖానికి దస్తీ కట్టుకొని నేరుగా వెళ్లి బయట ఉన్న సీసీ కెమెరాతో పాటు లోపల ఉన్న సీసీ కెమెరాలకు బ్లాక్ స్ప్రే చేశాడు. వెంటనే బయటకు వెళ్లి మరో ఇద్దరితో కలసి కారులో నుంచి గ్యాస్‌కట్టర్‌ను తీసుకొచ్చాడు. ఒక వ్యక్తి గ్లాస్ బయట నిలబడి ఉండగా ఇద్దరు వ్యక్తులు గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను కట్‌చేసి అందులో ఉన్న రూ.23లక్షలను తీశారు. పక్కనే ఉన్న మరో ఏటీఎంను కూడా కట్ చేసే ప్రయత్నం చేసినప్పటికీ సాధ్యం కాకపోవడంతో వెళ్లిపోయారు. ఈ ముగ్గురితో పాటు ఓ వ్యక్తి రోడ్డుపై మారణాయుధాలతో ఉండగా ఇంకో వ్యక్తి కారులో ఉన్నట్లు తెలిసింది. దుండగులు చోరీకి పాల్పడే ముందు ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. కాగా రెండో ఏటీఎంలో ఉన్న రూ.40లక్షలు భద్రంగా ఉన్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. నల్లగొండ అడిషనల్ ఎస్పీ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

హరియాణా గ్యాంగ్ పనేనా?

గత డిసెంబర్‌లో నల్లగొండ పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో ఇదే తరహాలో హరియాణా గ్యాంగ్ చోరీకి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇక్కడ కూడా ఆ గ్యాంగ్ పనే అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

అత్యవసర వైద్యసేవలకు 466 వాహనాలు

రేపటి నుంచి ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్యశాఖ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర సేవలకు కొత్తగా 466 వాహనాలు అందుబాటులోకి రానున్నాయి. వీటిని వచ్చేనెల 1వ తేదీన ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు కొత్త వాహనాలను కొనుగోలు చేశారు. 108, 102 అనే హెల్ప్‌లైన్ సేవల నంబర్లు స్పష్టంగా కనిపించేలా బ్రాండింగ్ చేశారు. సీఎం కేసీఆర్ ఫొటో, తెలంగాణ ప్రభుత్వ లోగో స్పష్టంగా కనిపిస్తున్నాయి. పార్థివ వాహనాల సేవలు ఉచితంగా అందిస్తామనే విషయాన్ని తెలిపేవిధంగా ఉచితసేవ అని ముద్రించారు.

అంబులెన్స్‌లు ఇలా...

ప్రస్తుతం రాష్ట్రంలో 426 అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. 175 అంబులెన్సుల స్థానంలో కొత్తవి రిప్లేస్ చేస్తుండగా, మిగిలిన 29 అంబులెన్సులను అవసరమున్నట్టు గుర్తించిన కొత్త ప్రాంతాల్లో వినియోగించనున్నారు. కొత్తగా వచ్చే 204 వాహనాలను కలిపితే రాష్ట్రంలో 108 అంబులెన్సుల సంఖ్య 455కు పెరుగుతుంది.

అమ్మ ఒడి వాహనాలు ఆకర్షణీయంగా

గర్భిణుల కోసం ప్రవేశపెట్టిన అమ్మఒడి(102) వాహనాలు రాష్ట్రంలో 300 ఉన్నాయి. అయితే ఇందులో 228 వాహనాలకు కాలం చెల్లాయి. వాటి స్థానంలో కొత్తగా 228 వాహనాలను రీప్లేస్ చేస్తున్నారు. కొత్తగా అందుబాటులోకి రానున్న అమ్మఒడి వాహనాలు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. వాహనం వెనుకభాగంలో అమ్మకు ఆత్మీయతతో, బిడ్డకు ప్రేమతో అనే ట్యాగ్‌లైన్‌తో పాటు, సీఎం కేసీఆర్ ఓ బాలింతకు కేసీఆర్ కిట్ అందిస్తున్న ఫొటో ముద్రించారు. చూడటానికి ఆహ్లాదంగా ఉండే రంగుల్లో, అమ్మఒడి కార్యక్రమ లోగో, శిశువు ఫొటోలతో 102 వాహనాలు కొత్తలుక్ సంతరించుకున్నాయి.

పార్థివ వాహనాలు

ప్రధాన ప్రభుత్వ దవాఖానాల్లో మరణించినవారి పార్థివదేహాలను స్వస్థలాలకు తరలించడం కుటుంబసభ్యులకు ఖర్చుతో కూడుకున్న పని. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఉచితంగా హర్సే వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. ఈ హర్సే వాహనాలు 50 ఉన్నాయి. ఇందులో 34 వాహనాలకు కాలం చెల్లిపోయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా 34 వాహనాలను కొనుగోలు చేసి రిప్లేస్ చేస్తున్నది.



108 అంబులెన్స్‌లు	204
102 అమ్మ ఒడి	228
పార్థివ వాహనాలు	34



వైద్యసేవలు మరింత పటిష్టం

- మంత్రి హరీశ్‌రావు

అత్యవసర సమయాల్లో సేవలు అందించే కొన్ని వాహనాలకు కాలం చెల్లిపోవడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పాత వాహనాల స్థానంలో కొత్తవి సమకూర్చుకోవడంతో పాటు, అవసరమున్నట్టు గుర్తించిన కొత్త ప్రాంతాల్లో వాహనాల సేవలు విస్తరించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. వీటి రాకతో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో మరింత వేగం పెరుగుతుంది. ప్రజలకు అవసరమైన ఆరోగ్యసేవలు అందించే విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీపడటం లేదు. పెద్దమొత్తంలో నిధులు కేటాయించి వైద్యారోగ్య రంగాన్ని పటిష్టం చేసి, ఆరోగ్య రంగంలో తెలంగాణ దినదినాభివృద్ధి చెందుతూ ప్రజల మన్ననలు పొందుతుండటం సంతోషకరం.

బతికుండగానే డెత్ సర్టిఫికెట్!

- జప్తు చేసిన ట్రాక్టర్‌ను విడిపించుకునేందుకు అడ్డదారులు

బాన్సువాడ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన ట్రాక్టర్‌ను విడిపించుకోవడంతోపాటు ఇన్సూరెన్స్ డబ్బులకోసం ఇద్దరు వ్యక్తులు బతికున్న వ్యక్తి పేరుతో నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించారు. ఆలస్యంగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపు తండాకు చెందిన బోడ రాంచందర్ మూడేళ్ల క్రితం తన పాత ట్రాక్టర్‌ను నిజామాబాద్‌లోని ఓ షోరూంలో ఎక్స్ఛేంజీలో అమ్మేశాడు. రూ.1.80 లక్షలకు అమ్మేసి, కొత్త ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. షోరూం నిర్వాహకులు పాత ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించి నిజామాబాద్ జిల్లా రుద్రూర్‌కు చెందిన సాగర్ అనే ఇన్సూరెన్స్ ఏజెంట్‌కు విక్రయించారు. సాగర్ ఆ ట్రాక్టర్‌ను తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకోకుండా రెండేళ్లపాటు వాడుకుని, ఏడాది క్రితం గంగాప్రసాద్ అనే వ్యక్తికి విక్రయించాడు. గంగాప్రసాద్ వద్ద ట్రాక్టర్ ఉన్న సమయంలో ఓ ఆటోను ఢీకొట్టడంతో మహారాష్ట్రలోని ఔరద్‌కు చెందిన ఉస్మాన్ అనే వ్యక్తి మృతిచెందాడు. బోధన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని ట్రాక్టర్‌ను జప్తు చేశారు. ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి గంగాప్రసాద్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. పోలీసుల అధీనంలో ఉన్న ట్రాక్టర్‌ను విడిపించుకోవడంతో పాటు ట్రాక్టర్ ఇన్సూరెన్స్ డబ్బుల కోసం సాగర్, గంగాప్రసాద్‌లు అడ్డదారి తొక్కారు. ట్రాక్టర్ పాత ఓనర్ బోడ రాంచందర్ చనిపోయినట్లు ఫేక్ డెత్ సర్టిఫికెట్‌తోపాటు ఇతర ఆధారాలు సృష్టించి, ట్రాక్టర్‌ను స్టేషన్ నుంచి విడిపించుకున్నారు. అయితే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి ఔరద్‌కు చెందినవాడు కావడంతో అతడి కుటుంబ సభ్యులు న్యాయం కోసం ఔరద్ పోలీసులను ఆశ్రయించారు. అక్కడి పోలీసులు ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ ఆధారంగా బోడ రాంచందర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. దీంతో కంగుతిన్న బోడ రాంచందర్ సదరు షోరూం వారితో బోధన్ పోలీసులను ఆశ్రయించి ఆధారాలు సేకరించాడు. తాను చనిపోయినట్లు ఫేక్ సర్టిఫికెట్, నకిలీ పత్రాలు సృష్టించినట్లు తెలుసుకుని, నెలరోజుల క్రితం బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో బాన్సువాడ పోలీసులు సాగర్, గంగాప్రసాద్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

పాక్‌లో ఆత్మాహుతి దాడి.. 44 మంది మృతి



పెషావర్: పాకిస్తాన్‌లో ఓ అతివాద రాజకీయ పార్టీ సభలో సూసైడ్ బాంబు పేలిన ఘటనలో 44 మంది చనిపోగా మరో 200 మంది గాయాలపాలయ్యారు. పాక్–అఫ్గాన్ సరిహద్దుల్లోని ఖైబర్ ఫక్తున్వా ప్రావిన్స్‌లో ఆదివారం సాయంత్రం ఈ విషాదం చోటుచేసుకుంది. బజౌర్ జిల్లా కేంద్రం ఖర్‌లో జమియత్ ఉలేమా ఇ ఇస్లామ్ ఫజుల్(జేయూఐ–ఎఫ్) కార్యకర్తల సమావేశం జరుగుతుండగా శక్తివంతమైన పేలుడు సంభవించింది. క్షతగాత్రుల్లో అత్యధికుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. పేలుడుకు ఆత్మాహుతి దాడే కారణం కావచ్చని పోలీసులు తెలిపారు. ఘటన వెనుక ఐసిస్ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మూడేళ్లలో..13.13 లక్షల మంది మహిళలు మిస్సింగ్

న్యూఢిల్లీ: దేశంలో 2019–21 సంవత్సరాల మధ్య 13.13 లక్షల మంది బాలికలు, మహిళలు కనిపించకుండాపోయారని కేంద్రం తెలిపింది. ఇందులో మధ్యప్రదేశ్ నుంచి అత్యధికంగా సుమారు 2 లక్షల మంది ఉన్నారని, ఆ తర్వాతి స్థానంలో పశ్చిమ బెంగాల్ ఉందని పేర్కొంది. గత వారం పార్లమెంట్‌లో కేంద్ర హోం శాఖ ఇందుకు సంబంధించి నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్‌బీ) నమోదు చేసిన గణాంకాలను వెల్లడించింది. మూడేళ్ల కాలంలో మిస్సయిన మొత్తం 13.13 లక్షల మందిలో బాలికలు 2,51,430 మంది కాగా, 18 ఏళ్లు పైబడిన వారి సంఖ్య 10,61,648 అని వివరించింది. 2019–2021 మధ్య మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా 1,60,180 మహిళలు, 38,234 మంది బాలికలు అదృశ్యమయినట్లు ఆ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆ తర్వాతి స్థానంలో ఉన్న పశ్చిమబెంగాల్‌లో 1,56,905 మంది మహిళలు, 36,606 మంది బాలికలు మిస్సయ్యారని తెలిపింది. ఇదే సమయంలో మహారాష్ట్రలో 1,78,400 మంది మహిళలు, 13,033 మంది బాలికలు.. ఒడిశాలో 70,222 మంది మహిళలు, 16,649 మంది బాలికలు..ఛత్తీస్‌గఢ్‌లో 49,116 మంది మహిళలు, 10,817 మంది బాలికలు కనిపించకుండాపోయారు. 2019–21 మధ్య ఢిల్లీలో 61,054 మంది మహిళలు, 22,919 మంది బాలికలు కనిపించకుండాపోయారు.

ఇస్రో మరో వాణిజ్య విజయం

పీఎస్ఎల్‌వీ సిరీస్‌లో 56వ సారి విజయకేతనం ● 23 నిమిషాల్లోనే పూర్తయిన ప్రయోగం ● అంతరిక్ష వ్యర్థాలను తగ్గించే ప్రయోగం సక్సెస్

సూళ్లూరుపేట: పీఎస్ఎల్‌వీ సీ–56 ఉపగ్రహ వాహకనౌక ఆదివారం ఉదయం 6.31 గంటలకు విజయవంతంగా అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. దీంతో ఈ ఏడాదిలో ఇస్రో మూడో వాణిజ్య విజయాన్ని సొంతం చేసుకున్నట్లయింది. భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో), న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా తిరుపతి జిల్లా సతీస్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి దీనిని ప్రయోగించాయి. పీఎస్ఎల్‌వీ రాకెట్ సిరీస్‌లో చేపట్టిన 58 ప్రయోగాల్లో ఇది 56వ విజయం కావడం గమనార్హం. పీఎస్ఎల్‌వీ సీ–56 రాకెట్‌కు శనివారం ఉదయం 5.01 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించి 25.30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం ఆదివారం ఉదయం 6.31 గంటలకు నింగిలోకి దూసుకెళ్లింది. నాలుగు దశల ప్రయాణాన్ని విజయవంతంగా సాగిస్తూ 23 నిమిషాల వ్యవధిలో (1,381 సెకన్లకు) సింగపూర్‌కు చెందిన ఏడు ఉపగ్రహాలను భూమికి 535 కిలో మీటర్లు ఎత్తులోని నియో ఆర్బిట్ (భూ సమీప కక్ష్య)లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. 352 కిలోలు బరువు కలిగిన డీఎస్–ఎస్ఏఆర్ (షార్ట్ ఫర్ సింథటిక్ అపార్చర్ రాడార్) అనే ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్, 23.58 కిలోల ఆర్కేడ్, 23 కేజీల బరువున్న వెలాక్స్–ఏఎం, 12.8 కిలోల ఓఆర్‌బీ–12 స్ట్రయిడర్, 3.84 కేజీల గలాసియా–2, 4.1 కేజీల స్కూబ్–11, 3.05 కేజీల బరువైన న్యూలయన్ అనే ఉపగ్రహాలను నియో ఆర్బిట్‌లోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. షార్ నుంచి చేసిన 90వ ప్రయోగమిది.

అంతరిక్ష వ్యర్థాలను తొలగించే కొత్త ప్రయోగం

పీఎస్ఎల్‌వీ సీ–56 రాకెట్‌లోని నాలుగో దశ (పీఎస్–4)తో అంతరిక్షంలో పెరిగిపోతున్న వ్యర్థాలను తొలగించేందుకు సరికొత్త ప్రయోగం చేపట్టినట్లు ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. భూమికి 535 కిలోమీటర్లు ఎత్తులో ఉపగ్రహాలను ప్రవేశపెట్టిన తర్వాత పీఎస్–4 అక్కడ నుంచి 300 కిలోమీటర్ల స్థాయికి దిగి వస్తుంది. ఈ ఎత్తులో ఉండటం వల్ల ఇది త్వరగానే భూ కక్ష్యలోకి ప్రవేశించి మండిపోతోంది. దీంతో అంతరిక్షంలో ఇలాంటి ప్రయోగాల తదుపరి చెత్త తగ్గుతుంది. ఒకవేళ 530కి.మీ.ల ఎత్తులోనే ఉంటే కింది కక్ష్యలకు వచ్చి పడిపోవడానికి దశాబ్దాల కాలం పడుతుంది. ఇప్పుడు కిందిస్థాయిలోనే ఉంది కనుక కేవలం రెండునెలల్లో పడిపోతుంది.



ఆ కీలక భాగాల తయారీదారు హైదరాబాద్ సంస్థే

పీఎస్ఎల్‌వీ సి–56లోని కీలక భాగాలు, వ్యవస్థలు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్(ఏటీఎల్) రూపొందించినవే కావడం విశేషం. ఈ విషయాన్ని ఆ సంస్థ వ్యవస్థాపకుడు పావులూరి సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. పీఎస్ఎల్‌వీ సి–56 లాంఛ్ వెహికల్‌లో వాడిన నావిగేషన్ ఇంటర్‌ఫేస్ మాడ్యూళ్లు, ఇనెర్షియల్ సెన్సింగ్ యూనిట్లు, ఇంట్రా మాడ్యూల్ హార్నెస్, కంట్రోల్ ఎలక్ట్రానిక్స్, పైరో కంట్రోల్ సిస్టమ్స్, ట్రాకింగ్ ట్రాన్స్‌పాండర్, ఇంధన వ్యవస్థల రూపకల్పనలో తమ సంస్థ భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. ఇస్రో లాంఛ్ వెహికల్స్, శాటిలైట్లు, స్పేస్ క్రాఫ్ట్ పేలోడ్స్, గ్రౌండ్ సిస్టమ్స్‌ను తాము ఉత్పత్తి చేస్తున్నామన్నారు. పీఎస్ఎల్‌వీ సి–56తో కలిపి ఇప్పటి వరకు అయిదు పీఎస్ఎల్‌వీ మిషన్లలో అత్యంత కీలకమైన సబ్ అసెంబ్లీ ప్రక్రియను ఏటీఎల్ నిపుణులు చేపట్టినట్లు వివరించారు.

అమెరికా రక్షణ పరికరాల్లో చైనా మాల్‌వేర్!

అత్యవసర సమయాల్లో విద్యుత్, నీటి సరఫరాను అడ్డుకొనే అవకాశం
డ్రాగన్ హ్యాకర్ల దుశ్చర్య

వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత బలమైన సైన్యం, ఆయుధాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ ఉన్న అమెరికాను ఇప్పుడు చైనా మాల్‌వేర్ బెంబేలెత్తిస్తోంది. ఓ అజ్ఞాత మాల్‌వేర్‌ను తమ రక్షణ పరికరాల్లో చైనా ప్రవేశపెట్టిందని అమెరికా సైనికాధికారులు అనుమానిస్తున్నారు. ఈ విషయాన్ని అమెరికా కాంగ్రెస్ అధికారి ఒకరు నిర్ధారించారు. తమ రక్షణ వ్యవస్థపై చైనా హ్యాకర్లు కన్నేశారని, రక్షణ శాఖ పరికరాల్లోకి ఓ కంప్యూటర్ కోడ్‌ను(మాల్‌వేర్) ప్రవేశపెట్టారని భావిస్తున్నారు. సైన్యానికి చెందిన నెట్‌వర్క్ కంట్రోలింగ్ పవర్ గ్రిడ్‌లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్, సైనిక కేంద్రాలకు నీటిని సరఫరా చేసే వ్యవస్థల్లోకి ఈ మాల్‌వేర్ రహస్యంగా చేరినట్లు అంచనా వేస్తున్నారు. దీనివల్ల అత్యవసర, సంక్షోభ సమయాల్లో సైన్యానికి అవసరమైన సరఫరాల్లో అంతరాయం కలిగించేందుకు ఆస్కారం ఉంటుంది.



టైం బాంబులాంటిదే

మాల్‌వేర్ వ్యవహారం తొలుత ఈ ఏడాది మే నెలలో బయటపడింది. గువామ్‌లో అమెరికా ఎయిర్ బేస్‌కు చెందిన టెలికమ్యూనికేషన్స్ వ్యవస్థల్లో అనుమానాస్పద కంప్యూటర్ కోడ్‌ను తాము గుర్తించినట్లు మైక్రోసాఫ్ట్ సంస్థ వెల్లడించింది. మరో కీలక ప్రాంతంలో ఉన్న కంప్యూటర్లలోనూ ఇది ఉన్నట్లు పేర్కొంది. ఓల్ట్ టైఫూన్ అనే చైనా హ్యాకింగ్ సంస్థపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రక్షణ పరికరాల్లో చైనా మాల్‌వేర్ అనేది నిజంగా టైంబాంబు లాంటిదేనని అమెరికా కాంగ్రెస్ అధికారి చెప్పారు. సైనిక స్థావరాలకు విద్యుత్, నీటి సరఫరాను, సమాచార మార్పిడిని హఠాత్తుగా నిలిపివేయడానికి ఈ మాల్‌వేర్‌ను ఉపయోగిస్తుంటారని చెప్పారు. దీనివల్ల సైన్యంలో పనివేగం తగ్గిపోతుందని అన్నారు. కేవలం అమెరికాలోనే కాదు, విదేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాల్లోని పరకరాల్లోకి చైనా హ్యాకర్లు మాల్‌వేర్‌ను పంపించినట్లు ప్రచారం సాగుతోంది. తైవాన్ విషయంలో ఇటీవలి కాలంలో చైనా దూకుడు పెంచింది. ఈ దేశంలో సమీపంలో తరచుగా వైమానిక విన్యాసాలు నిర్వహిస్తోంది. తమ దేశంలో తైవాన్ ఒక అంతర్భాగమని వాదిస్తోంది. మరోవైపు తైవాన్‌కు అమెరికా అండగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా రక్షణ పరికరాల్లోకి చైనా మాల్‌వేర్ ప్రవేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది.



అంటార్కిటికాలో కరిగిపోతున్న మంచు



అర్జెంటీనా విస్తీర్ణంతో సమానమైన హిమం మాయం

వాషింగ్టన్: ఉత్తరార్ధ గోళంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో వడగాలులు వీచాయి. ఫలితంగా అంటార్కిటికా ఖండంలో పెద్ద ఎత్తున మంచు కరిగిపోయింది. ఈసారి అక్కడ రికార్డు స్థాయిలో మంచు ఫలకలు కరిగినట్లు శాస్త్రవేత్తలు తేల్చారు. వాస్తవానికి అంటార్కికాలో వేసవి కాలంలో మంచు కరిగి, శీతాకాలంలో మళ్లీ భారీ మంచు ఫలకలు ఏర్పడుతుంటాయి. కానీ, ఈసారి అలా జరగలేదు. గత 45 ఏళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ స్థాయిలో హిమం ఉంది. నేషనల్ స్నో అండ్ ఐస్ డేటా సెంటర్ (ఎన్ఎస్ఐడీసీ) గణాంకాల ప్రకారం.. అంటార్కిటికాలో 2022 శీతాకాలంతో పోలిస్తే ఇప్పుడు 16 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మంచు కరిగిపోయింది. అలాగే 1981–2010 మధ్య సగటు విస్తీర్ణం కంటే ఈ ఏడాది జూలై మధ్యలో 26 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం మేర మంచు తక్కువగా ఉంది. ఇది అర్జెంటీనా దేశ విస్తీర్ణంతో సమానం. అమెరికాలోని టెక్సాస్, కాలిఫోర్నియా, న్యూమెక్సికో, అరిజోనా, నెవడా, ఉతాహ్, కొలరాడో రాష్ట్రాల ఉమ్మడి విస్తీర్ణంతో సమానం. అంటార్కిటికాలో సముద్రపు మంచు కొన్ని దశాబ్దాలుగా రికార్డు స్థాయి నుంచి కనిష్టానికి పడిపోతోంది. ఇది చాలా అసాధారణ పరిణామమని, 10 లక్షల ఏళ్లకోసారి ఇలా జరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూతాపం, వాతావరణ మార్పులు అంటార్కిటికాను మరింతగా ప్రభావితం చేస్తాయని అంటున్నారు.

‘మేరీ మాటీ.. మేరీ దేశ్’

- అమరుల స్మరణకు ఆగస్టు 15 దాకా ప్రత్యేక కార్యక్రమం
- పవిత్ర మట్టితో ఢిల్లీ దాకా అమృత్ కలశ్ యాత్ర
- ‘మన్ కీ బాత్’లో మోదీ

న్యూఢిల్లీ: మన అమర జవాన్లను, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పౌరులను గౌరవించుకోవడానికి స్వాతంత్య్ర దినోత్సవం(ఆగస్టు 15) వరకూ దేశవ్యాప్తంగా మేరీ మాటీ.. మేరీ దేశ్ (నా మట్టి.. నా దేశం) పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. వారి జ్ఞాపకార్థం ప్రతి గ్రామ పంచాయతీలో స్మారకాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం ‘మన్ కీ బాత్’లో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడారు. మేరీ మాటీ.. మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా అమృత్ కలశ్ యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. దేశమంతటా వివిధ ప్రాంతాల నుంచి 7,500 కలశాల్లో పవిత్ర మట్టిని, దాంతోపాటు మొక్కలను దేశ రాజధాని ఢిల్లీకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఆ పవిత్ర మట్టితో ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం సమీపంలో ‘అమృత్ వాటిక’ను నిర్మించబోతున్నట్లు చెప్పారు. అక్కడే మొక్కలను నాటనున్నట్లు వివరించారు. ఈ అమృత్ వాటిక ‘ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్’కు ఒక గొప్ప చిహ్నం అవుతుందని స్పష్టం చేశారు. మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...



ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి

‘‘ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఇప్పటికే 2 లక్షలకుపైగా కార్యక్రమాలు నిర్వహించుకున్నాం. అమృత్ మహోత్సవ్ నినాదం అంతటా ప్రతిధ్వనిస్తోంది. గత ఏడాది ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమం కోసం దేశమంతా ఒక్కతాటిపైకి వచ్చింది. ప్రజలంతా తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాలు ఎగరేశారు. ఆ సంప్రదాయాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నా. ఇలాంటి ప్రయత్నాలతో మన బాధ్యతలను మనం గుర్తించగలుగుతాం. దేశ స్వాతంత్య్రం కోసం జరిగిన బలిదానాలను స్మరించుకుంటాం. స్వేచ్ఛా స్వాతంత్య్రాల విలువను గుర్తిస్తాం. అందుకే ప్రతి పౌరుడూ ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి. ప్రజల్లో సాంస్కృతి చైతన్యం ఇనుమడిస్తోంది. పుణ్య క్షేత్రాలను సందర్శించే యాత్రికుల సంఖ్య భారీగా పెరుగుతోంది. కాశీని ప్రతిఏటా 10 కోట్లకు పైగా యాత్రికులు సందర్శిస్తున్నారు. అయోధ్య, మథుర, ఉజ్జయిని లాంటి క్షేత్రాలను సందర్శించే భక్తుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. దీనివల్ల లక్షలాది మంది పేదలకు ఉపాధి లభిస్తోంది.

మరో 50,000 అమృత్ సరోవరాలు

ఇటీవల దేశంలో భారీ వర్షాలు కురిశాయి. వరదలు ముంచెత్తాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. జనం చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ప్రకృతి విపత్తుల నుంచి కాపాడుకోవడానికి వారు కలిసికట్టుగా పని చేశారు. అలాగే జల సంరక్షణ కోసం జనం కృషి చేయడం సంతోషకరం. ఉత్తరప్రదేశ్‌లో ఒక్కరోజులో 30 లక్షల మొక్కలు నాటారు. జల సంరక్షణ కోసం దేశంలో ఇప్పటికే 60,000 అమృత్ సరోవరాలు నిర్మించారు. మాదక ద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని కోరుతున్నా. భవిష్యత్తు తరాలను కాపాడుకోవాలంటే డ్రగ్స్‌ను దూరం పెట్టాల్సిందే. ఇందుకోసం 2020 ఆగస్టు 15న ‘నషా ముక్త్ భారత్ అభియాన్’ ప్రారంభించాం. 11 కోట్ల మందికి పైగా జనం ఈ అభియాన్‌తో అనుసంధానమయ్యారు. రూ.12,000 కోట్ల విలువైన 10 లక్షల కిలోల డ్రగ్స్‌ను అధికారులు ధ్వంసం చేశారు. ఇదొక విశిష్టమైన రికార్డు. మధ్యప్రదేశ్‌లోని బిచార్పూర్ అనే గిరిజన గ్రామం ఒకప్పుడు అక్రమ మద్యం, డ్రగ్స్‌కు అడ్డాగా ఉండేది. ఇప్పుడు ఆ గ్రామస్థులు వ్యసనాలు వదిలేశారు. ఫుట్‌బాల్ ఆటలో నిష్ణాతులుగా మారారు. మనసుంటే మార్గం ఉంటుంది’ అని మోదీ ఉద్ఘాటించారు.

కళాఖండాలు తిరిగొచ్చాయి

మన దేశానికి చెందిన వందలాది అరుదైన, ప్రాచీన కళాఖండాలు ఇటీవలే అమెరికా నుంచి తిరిగివచ్చాయి. అమెరికా వాటిని తిరిగి మనకు అప్పగించింది. దీనిపై సోషల్ మీడియాలో చాలా చర్చ జరిగింది. అమెరికా నుంచి వచ్చిన వాటిలో 2,500 నుంచి 250 ఏళ్ల క్రితం నాటికి కళాఖండాలు ఉన్నాయి. 2016, 2021లో అమెరికాలో పర్యటించా. మన కళాఖాండలను వెనక్కి తీసుకురావడానికి కృషి చేశా.

చిన్నారుల అక్రమ రవాణాలో యూపీ టాప్

న్యూఢిల్లీ: దేశంలో చిన్నారుల అక్రమ రవాణాలో ఉత్తరప్రదేశ్, బిహార్, ఆంధ్రప్రదేశ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. కోవిడ్ తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో చిన్నారుల అక్రమ రవాణా కేసుల్లో 68 శాతం పెరుగుదల నమోదైంది. 2016–22 సంవత్సరాల మధ్య గణాంకాల ఆధారంగా ప్రభుత్వేతర సంస్థ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. జిల్లా వారీగా చూస్తే.. దేశంలోనే అత్యధికంగా జైపూర్ సిటీలో అత్యధికంగా చైల్డ్ ట్రాఫికింగ్ కేసులు నమోదవుతున్నాయి. టాప్ నాలుగు జిల్లాల్లో దేశ రాజధాని ఢిల్లీ ఉండటం గమనార్హం. 2016–22 మధ్య 18 ఏళ్లలోపు 13,549 మంది చిన్నారులను అక్రమ రవాణా నుంచి రక్షించగలిగారు. వీరిలో 9 ఏళ్లలోపు చిన్నారులు 2 శాతం మంది ఉండటం ఆందోళన కలిగించే అంశమని అధ్యయనకర్తలు పేర్కొన్నారు. చిన్నారులను అత్యధికంగా పరిశ్రమల్లోనే వినియోగిస్తున్నట్లు తేలింది. హోటల్, ధాబాల్లో ఉండే సిబ్బందిలో 15.6% మంది, రవాణారంగంలో 13% మంది, వస్త్ర రంగంలో 11.18% మంది చిన్నారులు పనిచేస్తున్నారు. కాస్మెటిక్స్ పరిశ్రమల్లో 5, 8 ఏళ్ల బాలల్ని వాడుకుంటున్నట్లు నివేదిక తెలిపింది. కోవిడ్ అనంతరం చిన్నారులను పనిలో పెట్టుకోవడం అనేక రెట్లు పెరిగింది. కర్ణాటకలో చైల్డ్ ట్రాఫికింగ్ 18 రెట్లు ఎక్కువైనట్లు వెల్లడించింది.

‘అవిశ్వాసం’ పూర్తయ్యేదాకా సభలో బిల్లులు ఆమోదించొద్దు

కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై పార్లమెంట్‌లో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన తర్వాత ఇతర బిల్లులను ఆమోదించడం సరైంది కాదని కాంగ్రెస్ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి మనీశ్ తివారీ అభిప్రాయపడ్డారు. అవిశ్వాసంపై చర్చ, ఓటింగ్ జరిగి ఫలితం తేలిన తర్వాతే ఇతర బిల్లును ప్రవేశపెట్టడం లేదా ఆమోదించడం చేయాలని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వంపై లోక్‌సభలో విపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. నిబంధనల ప్రకారం దీనిపై 10 రోజుల్లోగా చర్చ, ఓటింగ్ నిర్వహించాల్సి ఉంది. బిల్లులను ఇష్టారాజ్యంగా ఆమోదింపజేసుకోవడానికి ఈ గడువును వాడుకోవద్దని మనీశ్ తివారీ హితవు పలికారు. అలా చేయడం పార్లమెంటరీ సంప్రదాయాలకు, నైతిక విలువలకు విరుద్ధమన్నారు.

కోర్టు ధిక్కరణ కేసుల్లో అతి సున్నితత్వం వద్దు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కోర్టు ధిక్కరణ కేసుల్లో విచారణ, తీర్పునిచ్చే విషయంలో న్యాయస్థానాలకు అతి సున్నితత్వం పనికిరాదని, బావోద్వేగాలకు లోను కావొద్దని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సంజయ్ కరోల్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించింది. కోర్టు ధిక్కరణ కేసులో ఓ వైద్యుని లైసెన్స్‌ను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వును సుప్రీంకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. జరిమానాగా లైసెన్స్ రద్దు సరైంది కాదని పేర్కొంది.

నేరుగా సముద్రంలోనే ల్యాండింగ్..

మార్సెయిల్(ఫ్రాన్స్): ఇంజిన్ వైఫల్యం చెందడంతో ఓ పైలట్ విమానాన్ని సముద్రంలోనే అర్ధాంతరంగా దించేశాడు. విమానం మునిగిపోయినా అందులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఫ్రాన్సులోని మధ్యధరా సముద్ర తీరం ఫ్రెజస్ వద్ద ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో చోటుచేసుకుంది. తీరానికి మరో 600 మీటర్ల దూరం ఉండగా సెస్నా 177 రకం చిన్నపాటి పర్యాటక విమానం ఇంజిన్‌లో లోపం ఏర్పడింది. దీంతో, పైలట్ సముద్ర జలాల్లోనే అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అత్యవసర విభాగం సిబ్బంది అక్కడికి చేరుకునే అందులోని ముగ్గురినీ రక్షించారు. ‘ఫ్రెజస్ బీచ్‌లో జనం రద్దీ ఎక్కువగా ఉంది. బీచ్‌లో అత్యవసర ల్యాండింగ్ వారికి అపాయం కలుగుతుందని పైలట్ భావించాడు. దీంతో, సమయస్ఫూర్తితో వ్యవహరించి బీచ్‌లో కాకుండా దగ్గర్లోని సముద్ర జలాల్లో ల్యాండ్ చేశాడు. ఇందుకు ఎంతో నైపుణ్యం కావాలి. అదృష్టమూ కలిసి రావాలి’ అని సహాయక సిబ్బంది తెలిపారు. ఈ ఘటనలో విమానం సముద్రంలో మునిగిపోయింది.

మాస్కోపై మళ్లీ డ్రోన్ దాడి

మాస్కో: రష్యా రాజధాని మాస్కోలో ఆదివారం వేకువజామున డ్రోన్ దాడి జరిగింది. ఈ ఘటనలో ఒకరు గాయపడ్డారు. రాజధాని నగరంలోని నాలుగు ఎయిర్‌పోర్టుల్లో ఒక దానిని తాత్కాలికంగా మూసివేశామని అధికారులు తెలిపారు. కాగా, మాస్కోపై డ్రోన్ దాడి జరగడం ఈనెలలో నాలుగోసారి కావడం గమనార్హం. మాస్కో దిశగా దూసుకొచ్చిన మూడు డ్రోన్లలో ఒక దానిని వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేయగా, మరో రెండింటిని జామర్లు నిర్వీర్యం చేశాయి. ఆ రెండు డ్రోన్లు మాస్కోలోని వాణిజ్య రాజధాని ప్రాంతంలో కూలాయని అధికారులు వివరించారు. కీవ్ ప్రభుత్వ ఉగ్రదాడియత్నంగా రష్యా రక్షణ శాఖ అభివర్ణించింది. మాస్కోలోని ఓ బహుళ అంతస్తుల భవనం పై ఫ్లోర్ దెబ్బతిన్న దృశ్యాలు కనిపించాయి. అయితే, ఈ దాడులతో రెండు భవనాల వెలుపలి భాగాలకు కలిగిన సాధారణ నష్టం జరిగినట్లు మాస్కో మేయర్ చెప్పారు. ఈ ఘటన అనంతరం మాస్కో శివారులోని వినుకోవో ఎయిర్ పోర్టును గంటపాటు అధికారులు మూసివేశారు. మాస్కో, చుట్టుపక్కల ప్రాంతాల్లో గగనతలాన్ని కొద్దిసేపు మూసివేశారు. డ్రోన్ కూలిన ప్రాంతంలోని రహదారిని మూసివేశారు. ఘటనపై ఉక్రెయిన్ పరోక్షంగా స్పందించింది. ఉక్రెయిన్‌పై జరుగుతున్న యుద్ధం దుష్ఫలితాలను రష్యా ప్రజలు చూస్తున్నారంటూ వ్యాఖ్యానించింది. శనివారం రాత్రి ఆక్రమిత క్రిమియా గగనతలంలో 16 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా తెలిపింది. మరో 8 డ్రోన్లను తమ జామర్లు నిర్వీర్యం చేశాయని తెలిపింది.



అఫ్గానిస్తాన్‌లో మహిళల హక్కుల్ని కాలరాస్తున్న తాలిబన్ పాలకుల నిషేధాజ్ఞలు తాజాగా సంగీతంపై పడ్డాయి. సంగీతం అనైతికమని దీని కారణంగా యువత పెడదోవ పడుతుందని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆదివారం హీరట్ ప్రావిన్స్‌లో లక్షల విలువైన గిటార్, తబలా వంటి సంగీత పరికరాలను స్వాధీనం చేసుకుని స్థానిక అధికారులు ఇలా అగ్నికి ఆహుతి చేశారు.

హింస నివారణలో ప్రభుత్వం విఫలం

- మణిపూర్ అంశంలో ప్రధాని మోదీ ఉదాసీన వైఖరి
- గవర్నర్‌కు ‘ఇండియా’ కూటమి వినతిపత్రం

ఇంఫాల్: మణిపూర్‌లో జాతి వైషమ్యాలను అదుపుచేయడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని ప్రతిపక్ష ‘ఇండియా’ కూటమి ఆరోపించింది. మణిపూర్ సమస్యను పరిష్కరించడంలో ప్రధాని మోదీ తీవ్ర ఉదాసీనతను ప్రదర్శిస్తున్నారని పేర్కొంది. సత్వరమే పరిష్కరించకుంటే దేశ భద్రతకు సైతం సమస్యగా మారొచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతిపక్ష పార్టీలకు చెందిన 21 మంది ఎంపీలు ఈ మేరకు ఆదివారం రాష్ట్ర మహిళా గవర్నర్ అనసూయ ఉయికేకు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. వారు శని,ఆదివారాల్లో మణిపూర్‌లో సుడిగాలి పర్యటన చేశారు. బాధిత ప్రజలకు తక్షణమే పునరావాసం కల్పించాలని, రాష్ట్రంలో శాంతి సామరస్యాలను నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా నిరంతరాయంగా కాల్పులు, గృహదహన ఘటనలు కొనసాగుతుండటాన్ని బట్టి ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్న విషయంలో ఎలాంటి సందేహం లేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. గడిచిన మూడు నెలలుగా రాష్ట్రంలో ఇంటర్నెట్ సేవలపై నిషేధం కొనసాగుతుండటంతో వదంతులు వ్యాప్తి చెంది జాతుల మధ్య విభేదాలు మరింతగా పెరిగాయన్నారు. జాతుల మధ్య పెరిగిన వైషమ్యాలను తక్షణమే చల్లార్చాల్సిన అవసరముందన్నారు. ఈ విషయంలో ప్రధాని మోదీ మౌనం వహించడాన్ని వారు తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్రంలో తక్షణమే సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని కేంద్ర ప్రభుత్వానికి వివరించాలని గవర్నర్‌కు విపక్ష ఎంపీలు విజ్ఞప్తి చేశారు.



మహిళా గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విపక్ష ఎంపీలు

మణిపూర్‌లో బయోమెట్రిక్ సర్వే

2021 సంవత్సరంలో మయన్మార్ దేశంలో సైనిక జుంటా అధికారంలోకి వచ్చాక ఈశాన్య రాష్ట్రాల్లోకి పెరిగిన వలసలపై కేంద్రం అప్రమత్తమైంది. అక్రమంగా ప్రవేశించిన మయన్మార్ దేశస్తులను గుర్తించేందుకు బయోమెట్రిక్ సర్వే చేపట్టాలంటూ కేంద్రప్రభుత్వం ఇటీవల మణిపూర్, మిజోరం రాష్ట్రాలను ఆదేశించింది. మిజోరంలోని మొత్తం 11 జిల్లాల్లో కలిపి 30 వేల మందికిపైగా మయన్మార్ దేశస్తులున్నట్లు అంచనా. కేంద్రం నుంచి అందిన ఆదేశాల మేరకు ప్రస్తుతం సహాయక శిబిరాల్లో సర్వే చేపట్టినట్లు మిజోరం ముఖ్యమంత్రి లాల్ థంగ్లియానా ఆదివారం చెప్పారు. సెప్టెంబర్ 30వ తేదీలోగా మయన్మార్ దేశస్తుల నమోదు పూర్తి చేయాలని కేంద్ర హోం శాఖ కోరిందన్నారు. తమ వర్గానికి చెందిన వారే అయినందున తిరిగి మయన్మార్ పంపించలేక వారికి మానవతాదృక్పథంలో ఆశ్రయం కల్పిస్తున్నట్లు తెలిపారు. కొందరు బంధువుల వద్ద, అద్దె ఇళ్లలో ఉంటుండగా ఎక్కువ మంది సహాయ శిబిరాల్లోనే తలదాచుకుంటున్నారని చెప్పారు.


సాక్షి
కరీంనగర్

సోమవారం । 31 । జూలై । 2023



రాజన్నకు మొక్కులు

వేములవాడ: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు గెరువు ఇవ్వడంతో రాజన్నను ఆదివారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.



కొనసాగుతున్న నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీలోకి ఆదివారం నాలుగు గేట్ల ద్వారా 10,284 క్యూసెక్కుల నీరు వెళ్తోంది. ప్రస్తుతం 20.56 టీఎంసీలు నిల్వ ఉంది.

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

శంకరపట్నం(మానకొండూర్): ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయడం లేదని మండలంలోని కేశవపట్నంలో ఆదివారం రైతులు ఆందోళనకు దిగారు. మూడు రోజులక్రితం ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య తలెత్తి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రైతులకు ఇబ్బందులు ఎదురుకావడంతో మరమ్మతుకు కావాల్సిన సామగ్రి కొనుగోలు చేసి తీసుకొచ్చారు. రిపేరు చేయమని ట్రాన్స్‌కో అధికారులకు ఫోన్‌చేస్తే స్పందించడం లేదని రైతులు ఆరోపించారు. ఆందోళనలో గోపి మల్లేశం, వెంకటయ్య, కొమురయ్య, గుర్రం సంపత్, బొజ్జ తిరుపతి, మధునయ్య, శ్రీనివాస్, చెరుకు వెంకటేశం పాల్గొన్నారు.

మళ్లీ తెగిన కుడిచెరువు దారి బ్రిడ్జి



బ్రిడ్జిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

చొప్పదండి: పట్టణంలోని కుడిచెరువు వైపు కట్టపైకి వెళ్లే పోచమ్మ గుడి దారి మధ్యలో నిర్మించిన మినీ బ్రిడ్జి మళ్లీ కూలిపోయింది. రెండు, మూడేళ్ల క్రితం కుడిచెరువు మత్తడి మూలంగా బ్రిడ్జి కూలిపోగా, వరద నీరు వెళ్లిపోయేలా బ్రిడ్జి నిర్మించారు. తాజాగా భారీ వర్షాలకు కుడి చెరువు మత్తడి దూకుతుండటంతో మళ్లీ కూలిపోగా, రైతుల రాకపోకలు స్తంభించిపోయాయి. భక్తులు పోచమ్మ గుడికి వెళ్లడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి కూలిపోయిన ప్రాంతాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ ఆదివారం పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేయిస్తామని వివరించారు.

సీపీఎస్ రద్దుకు నిర్ణయం తీసుకోవాలి



మాట్లాడుతున్న కమలాకర్

కరీంనగర్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేలా రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని సీపీఎస్ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దాముక కమలాకర్, చీటి భూపతిరావులు సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సంఘం కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో రెండు లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ రద్దుకు ఎదురుచూస్తున్నారని, గొడ్డలిపెట్టులా ఉన్న సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి కేంద్ర ఉత్తర్వులు సంఖ్య 57ను రాష్ట్రంలో అమలు చేసేలా చూడాలని కోరారు. కొత్త పెన్షన్‌తో ఎలాంటి సామాజిక భద్రత లేదని, పెన్షన్ సౌకర్యం లేకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 ఏళ్లు ఉద్యోగం చేసిన భవిష్యత్ అంధకారమేనని అన్నారు.

మేధావులు మేడిన్ ఎస్సారార్



ప్రభుత్వ ఉద్యోగులు.. రాజకీయ నాయకులు.. కవులు.. కళాకారులకు పుట్టినిల్లు కరీంనగర్‌లోని ఎస్సారార్ (శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ) కళాశాల. సాధారణ విద్యార్థిగా చేరి.. విద్యార్థి నాయకులుగా, రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసే కవులుగా సరిహద్దుల్లో రక్షణగా నిలుస్తున్న సైనికులుగా ఇక్కడి ఎన్‌సీసీ కెడెట్లే అధికం. బడుగు బలహీనవర్గాలకు సేవ చేస్తున్న వారిలో ఇక్కడి నుంచే వెళ్లిన ఎన్ఎస్ఎస్ అభ్యర్థులూ ఉన్నారు. ఇలా అన్ని రంగాల్లో తన విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలిపిన ఎస్సారార్ కాలేజీ సగర్వంగా తలెత్తుకు నిలబడింది. కరీంనగర్ నగర నడిబొడ్డున 26 ఎకరాల విస్తీర్ణంలో నిల్చొని విద్యాకుసుమాలను సమాజానికి అందిస్తోంది.



కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు (ఫైల్)

- విద్యార్థిగా చేరి.. ఉత్తములుగా అవతరించి
- విద్యార్థి నాయకుల నుంచి రాజకీయ నేతలుగా ఎదిగి..
- కవులు, కళాకారుల పుట్టినిల్లు
- మినీ యూనివర్సిటీగా ఖ్యాతి
- 45 డిగ్రీ కోర్సులు, 11 పీజీ కోర్సులు
- 5 సర్టిఫికెట్ కోర్సులు, 1,620 సీట్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/కరీంనగర్ సిటీ: 'కరీంనగర్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసు సెలక్షన్స్ జరుగుతున్నాయి. అందులో ఎంపికైన అభ్యర్థుల్లో దాదాపు 70 శాతం మంది ఎస్సారార్‌కు చెందినవారే. ఇది గమనించిన ఓ అధికారి ఆరా తీయగా.. ఆ కాలేజీలో విద్యార్థులకు ఎన్‌సీసీలో ఇచ్చే కఠోర శిక్షణే కారణమని తెలిసింది'

- శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల.. డిగ్రీ, పీజీ చదువుకున్న ప్రతి వ్యక్తికీ ఈ కాలేజీ తెలుసంటే అతిశయోక్తి కాదు. ఇందులో చదువుకోవాలని ప్రతి విద్యార్థి కల. ఇక్కడ సాధారణ విద్యార్థులే ప్రవేశాలు పొందుతారు. చేరాక విద్యతోపాటు వికాసం, క్రమశిక్షణ(ఎన్‌సీసీ), నాయకత్వం, సామాజిక సేవ(ఎన్ఎస్ఎస్), పరిశోధనలు(ల్యాబ్), క్రీడలు, కళలు ఇలా అన్ని విధాలా తీర్చిదిద్దబడి బయటకొస్తారు.
- కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్న ఈ కాలేజీ 10 జిల్లాల విద్యార్థులకు వరంగా మారుతోంది. కవులు, కళాకారులు, నాయకులు, పోలీసులు, అధికారులు, ఉద్యోగులను సమాజానికి అందించిన ఈ కాలేజీ నాటి వైభవానికి నేటి ఆధునికతకు వారధిగా నిలుస్తోంది.
- శ్రీరాజరాజేశ్వర ఆలయం, వేములవాడ పేరున 1956లో ప్రైవే ట్ భాగస్వామ్యంలో కాలేజీని స్థాపించారు. మొదటి ప్రిన్సిపాల్‌గా ఏవీ గోపాల్‌రావు వ్యవహరించారు. 1959లో అప్పటి సర్కారు దీన్ని ప్రభుత్వ కాలేజీగా మార్చింది. మాజీ ప్రధాని పీవీ నర్సింహరావు ఈ కాలేజీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులుగా కొనసాగారు. 1959–91 వరకూ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత విశ్వనాథ సత్యనారాయణ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ప్రొఫెసర్ చలపతిరావు, ప్రొఫెసర్ కేవై ఎల్.నర్సింహరావు హయాంలో అభివృద్ధికి బాటలు పడ్డాయి. 2018 నుంచి ప్రొఫెసర్ రామకృష్ణ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. కాలేజీ పరిధిలో 2016 వరకు 15 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు ఉండగా.. ప్రస్తుతం నాలుగు ఉన్నాయి. ఈ కాలేజీలో ప్రస్తుతం 45 డిగ్రీకోర్సులు, 11 పీజీ కోర్సులు, 5 సర్టిఫికెట్ కోర్సులు అందిస్తూ కాకతీయ వర్సిటీ తర్వాత ఉత్తర తెలంగాణలోనే అతి పెద్ద కాలేజీగా గుర్తింపు తెచ్చుకుంది. 2022 మార్చిలో యూజీసీ, న్యూఢిల్లీ నుంచి అటానమస్ హోదా లభించింది. న్యాక్ 'ఏ' గ్రేడ్ హోదా 2027 వరకూ ఉంది. వీటితోపాటు ఐఎస్‌ఓ సర్టిఫికెట్ కూడా పొందింది.



అవార్డులు.. రివార్డులు

- దేశంలోనే ఎస్సారార్ కాలేజీ గ్రీన్ క్యాంపస్‌గా పేరుగాంచింది. గ్రీన్‌బిల్డింగ్ అవార్డును పొందింది.
- 64 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో యూనివర్సిటీ స్థాయిలో బంగారు పతకాలు సాధించారు.
- జిజ్ఞాస ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రస్థాయిలో విద్యార్థి పరిశోధన ప్రాజెక్టులో ఏడు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. 10 సార్లు వివిధ సందర్భాల్లో రాష్ట్రస్థాయి బహుమతులు గెలుచుకుంది.
- కాలేజీలో డాక్టర్ మహేశ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన సెమినార్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 120 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.
- అధ్యాపకులు రాజు, మల్లారెడ్డి, వరప్రసాద్ తోపాటు మరికొందరు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక బహుమతులు అందుకున్నారు.
- డాక్టర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలో 3 జాతీయ స్థాయి సదస్సులు నిర్వహించారు. దీనికి 10 జాతీయ, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నుంచి విద్యావేత్తలు హాజరయ్యారు.
- శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డాక్టర్ భిక్షపతి, డాక్టర్ సతీశ్‌కుమార్‌కు పీహెచ్‌డీ గైడ్‌షిప్ కల్పించారు.



గౌరవ వందనం సమర్పిస్తున్న ఎన్‌సీసీ కెడెట్లు (ఫైల్)

ఎన్నో సౌకర్యాలు

- కరీంనగర్ సిటీ మధ్యలో మినీ యూనివర్సిటీగా పిలిచే ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ, పీజీ కాలేజీ 26 ఎకరాల సువిశాల ప్రాంగణంలో విస్తరించి ఉంది.
- 45 డిగ్రీ కోర్సుల్లో 1,620 సీట్లు అందుబాటులో ఉండగా తాజాగా 'దోస్త్' మొదటిఫేజ్‌లో 1,016 సీట్లు భర్తీ అయ్యాయి.
- 108 తరగతి గదులు ఉండగా పూర్తిగా ఆధునీకరించిన బోటనీ, జువాలజీ, బయోటెక్నాలజీ, మైక్రో బయలాజీ తదితర 10 ల్యాబ్‌లున్నాయి.
- కాలేజీలో జిమ్, గ్రంథాలయంలో 53,450 పుస్తకాలు, 15 జర్నల్స్, 25 మ్యాగజైన్స్, 18 వార్త పత్రికలు కాలేజీకి చేరుతుంటాయి.
- ఎస్సారార్ వివిధ విభాగాల్లో 67 మంది(వాస్తవానికి 89) అధ్యాపకులు వివిధ విభాగాల్లోని అంశాలు బోధిస్తున్నారు. 42 మంది గెస్ట్‌లెక్చరర్లు, 25 మంది నాన్-టీచింగ్ స్టాఫ్ ఉన్నారు.



- అతిపెద్ద ఆడిటోరియం, మినీ ఆడిటోరియం కూడా అందుబాటులో ఉన్నాయి.
- ఎన్ఎస్ఎస్ ఐదు యూనిట్లలో 600 మంది విద్యార్థులు కెడెట్లుగా ఉన్నారు.
- ఎన్‌సీసీలో 160 మంది విద్యార్థులు ఉన్నారు. జాతీయస్థాయిలో పలు అవార్డులు, రివార్డులు పొందారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన పలు అడ్వెంచర్ క్యాంపుల్లో ఎస్సారార్ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాలుపంచుకున్నారు.
- ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఐక్యూఏసీ, ఇఫ్లూ బినెట్, మన టీవీ పాఠాలు, జిజ్ఞాస, మూక్స్, టాస్క్, స్వయం ఉపాధి వంటి పథకాలు అమలు చేస్తున్నారు.
- రెడ్డిల్యాబ్, మహేంద్ర వంటి కంపెనీలలో పరస్పరం ఒప్పందంతో విద్యార్థులను ఎంపిక చేస్తున్నారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి



అటానమస్ హోదాతో ఉన్న ఎస్సారార్ కాలేజీలో విద్యార్థులను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నాం. అధ్యాపకుల సహాయంతో నూతన విధానాలు అమలు చేస్తున్నాం. విద్యార్థుల ఆసక్తి మేరకు వారికి పలు సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తున్నాం. దోస్త్ మొదటి ఫేజ్‌లోనే రాష్ట్రంలోనే అత్యధిక సీట్లు భర్తీ అయ్యాయి. స్వయం ఉపాధి రంగాల్లో పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తూ ఉద్యోగాలు పొందేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ రామకృష్ణ, ప్రిన్సిపాల్, ఎస్సారార్ కాలేజీ(అటానమస్)

నాయకుడిగా జన్మనిచ్చింది



విద్యార్థి రాజకీయాల్లో ఓనమాలు నేర్పిన కాలేజీ ఎస్సారార్. విద్యతోపాటు నాయకత్వ లక్షణాలు కాలేజీలోనే అలవడ్డాయి. బీసీ రిజర్వేషన్ల కోసం జరిగిన దేశవ్యాప్త ఉద్యమంలో కాలేజీలో ఎన్ఎస్‌యూఐ తరఫున చురుగ్గా పాల్గొన్నాను. అదే నాకు గుర్తింపును తెచ్చింది. ఈరోజు సమాజ సేవ చేసే అదృష్టం లభించిందంటే ఎస్సారార్ కాలేజీనే కారణం.

– పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ

పుష్కలమైన వనరులున్న కాలేజీ



దేశంలో ఏ ప్రైవేటు కాలేజీకీ తీసిపోని అధునాతన సదుపాయాలు ఎస్సారార్ కాలేజీ సొంతం. తరగతి గదులు, మైదానం, గ్రంథాలయం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ల్యాబ్స్ ఒకటేమిటి.. అనంతమైన వనరులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. వాటిని సద్వినియోగం చేసుకుంటే విద్యార్థులు రత్నాల్లా రాటుదేలుతారు. ఎన్ని ప్రైవేటు కాలేజీలు వచ్చినా ప్రభుత్వ ఉద్యోగాల్లో అధికశాతం ఎస్సారార్ కాలేజీ విద్యార్థులే సాధించడం ఇందుకు నిదర్శనం.

– వారాల ఆనంద్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత

సీఎం దృష్టికి పాత పెన్షన్ విధానం సమస్య

- బీసీ సంక్షేమశాఖ మంత్రి కమలాకర్
- విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి కమలాకర్, వినోద్‌కుమార్, తదితరులు

కొత్తపల్లి(కరీంనగర్)/కరీంనగర్/రామడుగు: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ సహచర మంత్రులతో కలిసి కేబినెట్ సమావేశంలో సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు బీసీ సంక్షేమ,పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. 2003లో నోటిఫికేషన్ విడుదలై 2004 తర్వాత నియామకమైన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను 57/5 మెమో ప్రకారం పాత పెన్షన్ పరిధిలోకి తీసుకురావాలని కోరుతూ ఆదివారం కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ పాత పెన్షన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్‌తో కలిసి హాజరైన మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులు సంతోషంగా ఉన్నప్పుడే పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట పడుతుందన్నారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్‌పై సీఎం సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేసారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, ఉద్యోగ, ఉపాధ్యాయ పోరాట సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

పద్మశాలీల అభ్యున్నతికి సర్కారు కృషి

పద్మశాలీల అభ్యున్నతికి సర్కారు కట్టుబడి ఉందని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ సీతారాంపూర్‌లోని పద్మశాలి కల్యాణ మండపంలో ఏసీ డైనింగ్ హాల్‌ను మేయర్ సునీల్‌రావుతో కలిసి ప్రారంభించారు. హాస్టల్ నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పద్మశాలి వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు స్వర్గం మల్లేశం, దూడం లక్ష్మీరాజం, మెతుకు సత్యం, వి. రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని వినోద్‌కుమార్ అన్నారు. రామడుగు మండలంలోని మోతె శివారులో కొట్టుకుపోయిన రుద్రారం వెళ్లే దారిని పరిశీలించారు. మోతె వాగు వెంట దాదాపుగా 20ఎకరాల పంట పొలాలు కొట్టుకుపోయాయని రైతులు వివరించగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రవిశంకర్, తదితరులు వెంట ఉన్నారు.

శాంతినగర్‌లో డెంగీ భయం

- చలిజ్వరంతో ఒకరి మృతి
- ఎంజీఎంలో డెంగీ బాధితుడి చికిత్స
- సమ్మెలో పంచాయతీ సిబ్బంది
- గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తం



చింతకుంటలో డెంగీ బాధితుడి ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

కొత్తపల్లి: ఇటీవల కురిసిన వర్షాలతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయింది. పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. దోమలు విజృంభిస్తున్నాయి. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో కొత్తపల్లి మండలం చింతకుంట శాంతినగర్‌లో డెంగీ ఛాయలు భయపెడుతున్నాయి. జీపీ కార్మికులు సమ్మెకు దిగడంతో పారిశుధ్యం నిర్వహణ కరువైంది.

చలిజ్వరంతో ఒకరు మృతి

శాంతినగర్‌కు చెందిన యూసుఫ్(53) చలిజ్వరంతో మృతి చెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. శనివారం జ్వరం రాగా స్థానికంగా ఆర్ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించుకున్నాడు. ఆదివారం ఉదయం జిల్లా ఆస్పత్రికి వెళ్లాడు. బీపీ పరీక్ష చేసిన డాక్టర్లు ఆరోగ్యం బాగానే ఉందని మందులు ఇచ్చి పంపించారు. ఆస్పత్రి నుంచి బయలుదేరిన యూసుఫ్ ఇంటికి చేరుకోకుండానే మృతి చెందాడు. డెంగీతో బాధపడుతున్న వ్యక్తి ఇంటి సమీపంలోనే యూసుఫ్ ఇల్లు ఉండడంతో ఇతను డెంగీతో చనిపోయినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

ఎంజీఎంలో డెంగీ రోగి

శాంతినగర్‌కు చెందిన ఇమ్రాన్(18) గత 15రోజులుగా డెంగీతో బాధపడుతున్నాడు. తీవ్ర జ్వరం ఉండడంతో కరీంనగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పది రోజులపాటు చికిత్స అందించిన వైద్యులు డెంగీ అని నిర్ధారణ కావడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. ఆరురోజులుగా అక్కడే చికిత్స పొందుతున్న ఇమ్రాన్‌కు ప్లేట్‌లేట్లు పూర్తిగా తగ్గడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

ఎంపీడీవో, వైద్యాధికారి పరిశీలన

శాంతినగర్‌లో డెంగీ బాధితుడి ఇంటి పరిసరాలను మండల వైద్యాధికారి వంశీకృష్ణ, ఎంపీడీవో ఏ.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఎంపీటీసీ భూక్య తిరుపతినాయక్ ఆదివారం పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

డ్రైడే పాటించండి.. సెల్ఫీ పంపించండి

98499 06694
నంబరుకు వాట్సప్ చేయండి

- మేయర్ సునీల్‌రావు



ఓ ఇంట్లో డబ్బాల్లో నిలిచిన నీళ్లను పారబోస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: డ్రైడే పాటించడంతో సీజనల్ వ్యాధులను దూరం చేసుకోవచ్చని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా ప్రతీ ఆదివారం 10 గంటల 10నిమిషాలకు ప్రతి ఇంట్లో డ్రై డే కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన డ్రైడే కార్యక్రమాన్ని 33వ డివిజన్ భగత్‌నగర్‌లో ఆదివారం 10 గంటల 10 నిమిషాలకు లాంచనంగా ప్రారంభించారు. డివిజన్‌లో ఇంటిఇంటికి తిరిగి, ఇండ్ల ఆవరణలో పూలకుండీలు, వాడనిడబ్బాలు, టైర్లు, కూలర్లలో నిలిచిన వర్షపు నీళ్లను తొలగించారు. దోమల లార్వా పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై మహిళలకు అవగాహన కల్పించారు. డ్రై డే చేపట్టిన తరువాత ఒక సెల్ఫీ ఫొటోను నగరపాలకసంస్థకు చెందిన 98499 06694 వాట్సప్ నంబర్‌కు పంపించాలని సూచించారు. ఆ ఫొటోలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన స్క్రీన్లపై ప్రదర్శిస్తామని తెలిపారు.

ఆశలపై ఇసుక మేట

- జిల్లాలో 2,112 ఎకరాల్లో పంట నష్టం
- పంటల బీమా ఉన్నట్టా.. లేనట్టా?
- స్పష్టత లేక రైతుల్లో ఆందోళన
- ఎడతెరిపి లేని వానలతో తీవ్ర నష్టం

ఇటీవల పంట నష్టం ఇలా

జిల్లాలో మొత్తం గ్రామాలు: 313
నష్టం జరిగిన గ్రామాలు: 95
ప్రభావిత మండలాలు: 6
(సైదాపూర్, జమ్మికుంట, వీణవంక, హుజూరాబాద్, ఇల్లందకుంట, చిగురుమామిడి)
పంటనష్టం: 2,112ఎకరాలు
నష్టపోయిన రైతులు: 1,950
పత్తి: 286ఎకరాలు
మొక్కజొన్న: 31ఎకరాలు
వరి: 1,795ఎకరాలు



మొగ్ధుంపూర్‌లో పొలంలో ఇసుక మేటలు

కరీంనగర్ అర్బన్: అన్నదాతల ఆశలపై ఇసుక మేటలు వేసింది. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో 2,112 ఎకరాల్లో ఇసుక కమ్ముకోగా 1,950మంది రైతులు నష్టపోయారు. 95 గ్రామాల్లో పంట కొట్టుకుపోయింది. పత్తి, మొక్కజొన్న, వరి పంటలకు నష్టం వాటిల్లగా పంటల బీమాపై స్పష్టత లేకపోవడం అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది.

బీమా ఉన్నట్టా.. లేనట్టా

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి పంటల బీమా పథకం గతంలో అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు అందకుండా పోయింది. జిల్లాలో సహకార బ్యాంకుల్లో 60వేల మందికి పైగా రైతులు సభ్యులుగా ఉండగా 50వేల వరకు రైతులకు బ్యాంకు ఖాతాలున్నాయి. ఇవేకాకుండా స్టేట్ బ్యాంకు, ఆంధ్రా, సిండికెట్, ఎస్‌బిఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల్లో రైతులు రుణాలు పొంది ఉన్నారు. ఏటా రైతులు పంట రుణాలను రెన్యూవల్ చేస్తున్నారు. అవగాహన లేకపోవడంతో రెన్యూవల్ సమయంలో పంటల బీమా యోజన పథకానికి ప్రీమియం చెల్లించలేకపోతున్నారు. ప్రీమియం కట్టకపోతే పంటలకు నష్టం వాటిల్లిన రైతులు సాయం పొందలేరు. సాధారణంగా వరికి ఆగస్టు 31, పత్తికి ఆగస్టు 15, శనగ, పెసర, కంది, మొక్కజొన్న పంటలకు జూలై 31 గడువు. ఆ ప్రకటనే లేకపోవడం శోచనీయం.

పథకం తీరుతెన్నులిలా

వడగళ్లు, క్రిమికీటకాల వల్ల జరిగే పంట నష్టానికి బీమా వర్తిస్తుంది. మొక్కజొన్నకు ఎకరానికి రూ.25 వేల బీమా సౌకర్యాన్ని కల్పించగా ఇందులో రైతు 2శాతం అంటే రూ.500 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. వరికి ఎకరాకు రూ.34వేల బీమా వర్తిస్తుండగా ఇందుకోసం 2శాతం రూ.680 ప్రీమియం చెల్లించాలి. కందికి ఎకరాకు రూ.14వేల బీమా వర్తించే అవకాశముండగా 2శాతం రూ.280 ప్రీమియం చెల్లించాలి. పత్తికి ఎకరాకు రూ.35 వేలు వచ్చే అవకాశముండగా రూ.1170 ప్రీమియం చెల్లించాలి. దీనిపై అధికారులు అవగాహన కల్పించడం లేదు.

ఆదేశాలు రాలేదు

ఇటీవల జరిగిన పంట నష్టాన్ని ప్రభుత్వానికి నివేదించాం. పంటల బీమాకు సంబంధించి ఆదేశాలు రాలేదు. రాగానే పంటల బీమా పథకంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తాం.

– వాసిరెడ్డి శ్రీధర్, జిల్లా వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

రేపు జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్ సంఘం అధ్యక్షకార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. అండర్–14, 16, 18, 20 బాల బాలికలకు, మహిళలకు, పురుషులకు వేర్వేరుగా జావెలిన్‌త్రో, 100, 400 మీటర్ల విభాగంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను ఆగస్టు 7న హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువపత్రంతో 1న ఉదయం 9 గంటలకు అంబేద్కర్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని కోరారు.

ఆటోను ఢీకొన్న లారీ



నుజ్జునుజ్జయిన ఆటో

మానకొండూర్: ఆటోను ఓ లారీ ఢీకొన్న ఘటనలో ఆటోడ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం ఉదయం 5 గంటలకు లారీ హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వస్తోంది. మానకొండూర్ మండలంలోని ఖాదర్‌గూడెం స్టేజి సమీపంలో కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై కరీంనగర్ నుంచి బెల్లం బుట్టలతో హుజూరాబాద్ వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జవగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు 108 వాహనంలో కరీంనగర్ తరలించారు.

పొలంలో లారీ బోల్తా

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చిన్న పాపయ్యపల్లి గ్రామంలో ఆదివారం ఓ లారీ అదుపుతప్పి, వరి పొలంలో బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడగా స్థానికులు బయటికి తీసి, ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

మంత్రి హరీశ్‌రావు మాటలు బాధాకరం

- గౌరవ వేతనం అడిగితే కమీషన్ ఇస్తామంటారా?
- రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

కరీంనగర్ అర్బన్: గౌరవ వేతనం అడిగితే కమీషన్ పెంచుతామని మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు బాధాకరమని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రొడ్డ శ్రీనివాస్ అన్నారు. గత కొన్నేళ్లుగా వేతనం కావాలని పోరాడుతుంటే కంటితుడుపు మాటలు మాట్లాడతారా అని మండిపడ్డారు. ఆదివారం డీలర్ల సంఘం రాష్ట్ర ప్రతినిధులు మంత్రిని కలిశారని తెలిపారు. మంత్రివర్గ ఉప సంఘం ప్రతినిధిగా తమ సమస్యలను పరిష్కరిస్తారని ఆశించామని పేర్కొన్నారు. కానీ కమీషన్ రూ.120–రూ.130 ఇస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇన్ని రోజులు కనీస గౌరవ వేతనం ఇస్తామని చెప్తారని, పోనీ కమీషన్ అయినా రూ.200 ప్రకటిస్తారేమోనని ఆశగా ఎదురుచూశామన్నారు. రేషన్ డీలర్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, మానవీయ కోణంలో ఆలోచించి, సరైన నిర్ణయం ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం నాయకులు గాలి గట్టయ్య, రౌతు వెంకటేశ్, వీరేశం, ధర్మరాజు తదితరులున్నారు.

పాఠశాలల అభివృద్ధికి 'శాలసిద్ధి'

- పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలోని 31 స్కూళ్లు ఎంపిక
- 46 అంశాలపై పరిశీలన
- ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసిన కేంద్ర ప్రభుత్వం



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

కరీంనగర్: పాఠశాలల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. విద్యార్థుల సంఖ్య, మౌలిక వసతులు, ప్రమాణాలు, ఇతర సమస్యలు.. ఒక్కో పాఠశాల స్వరూపం తెలుసుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో శాలసిద్ధి వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. పాఠశాలలకు సంబంధించిన అన్ని వివరాలను అధికారులు ఒక్క క్లిక్‌తో తెలుసుకునేందుకు వెబ్‌సైట్‌ను వినియోగించుకోనున్నారు. గతంలో పాఠశాలలు పునఃప్రారంభం కాగానే ఉపాధ్యాయుల సహకారంతో ఏడు కేటగిరీల్లో 46 రకాల అంశాలపై సమాచారాన్ని ప్రభుత్వ అధికారులకు పంపేవారు. కొన్నేళ్లుగా ఏటా పాఠశాలల నమోదు ప్రక్రియ చేపడుతున్నా ఆశించిన స్థాయిలో పూర్తి సమాచారం రావడంలేదు. వివరాలు పూర్తి చేయడంలో ఉపాధ్యాయులు జాప్యం చేస్తున్నారు. దీంతో ఈ విద్యా సంవత్సరం వెబ్‌సైట్‌లో కొన్ని మార్పులతో వందశాతం నమోదు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేసింది. పైలట్ ప్రాజెక్టుగా జిల్లా నుంచి 31 పాఠశాలలను ఎంపిక చేసింది. కాగా దీని కోసం ఇప్పటికే ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయి శిక్షణ ఇచ్చారు. జిల్లాస్థాయిలో రెండు రోజుల పాటు సెయింట్ అల్ఫోన్స్ పాఠశాలలో 31 మంది హెచ్‌ఎంలు, 42 మంది ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయింది. పైలెట్ ప్రాజెక్టుగా 31 స్కూళ్ల ఎంపిక, వాటిలో అవసరమైన వసతుల కల్పన, నిధుల మంజూరుకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. శాలసిద్ధిలో పాఠశాలల ప్రమాణాలు, మూల్యాంకనం నమోదు చేయాల్సి ఉంటుంది. పాఠశాలల స్వరూపం, బలాలు, బలహీనతలు వెల్లడించే సమగ్ర దర్పణంగా దీన్ని పరిగణిస్తారు. ఈ విద్యాసంవత్సరం టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అనుసంధానంగా నమోదు చేపట్టనున్నారు. పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలోని కరీంనగర్ అర్బన్, రూరల్, కొత్తపల్లి, తిమ్మాపూర్, రామడుగు, మానకొండూర్ మండలాల్లోని 31 స్కూళ్లలో మొదటి విడతగా ఈ ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందులో 15 ప్రాథమిక పాఠశాలలు, 5 యూపీఎస్, 11 హైస్కూళ్లలో నమోదు ప్రక్రియ జరగనుంది. ఇది విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా 651 ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనున్నారు.

సేకరించే అంశాలు..

- ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు యూడైస్ కోడ్ ఆధారంగా శాలసిద్ధి వెబ్‌సైట్ వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది.
- ప్రధానంగా 46 ఉప అంశాలు ఏడు కేటగిరీల్లో పొందుపరుస్తారు. వనరులు, అవసరాల వినియోగం బోధన అభ్యాసన మదింపు, విద్యార్థుల ప్రగతి, వారి సాధన, పాఠశాల నాయకత్వం, సమ్మిళిత విద్య, ఆరోగ్యం తదితర అంశాలను నమోదు చేయాల్సి ఉంటుంది.
- ఈ ఏడింటిలో కలిపి 46 రకాల ఉప అంశాల వివరాలు నమోదు చేస్తారు. దీని ఆధారంగా జాతీయస్థాయిలో పాఠశాలల వివరాలు ఒక క్లిక్‌తో తెలుసుకునే వీలుంటుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి



పాఠశాలల సమగ్రాభివృద్ధికి శాలసిద్ధి దోహదపడే కార్యక్రమం. ఎంపికైన పాఠశాలల నుంచి ప్రధానోపాధ్యాయులు నిజమైన సమాచారాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. హెచ్‌ఎంలు సరైన అవగాహనతో ఉంటూ శాలసిద్ధిని పకడ్బందీగా నిర్వహించాలి. ఈ కార్యక్రమంలో ప్రతి ఉపాధ్యాయుడు పాలుపంచుకొని భాగస్వాములు కావాలి.

– జనార్దన్‌రావు, డీఈవో

- ఇందు కోసం జిల్లాస్థాయిలో రెండు రోజుల పాటు ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయింది. సంబంధిత ఉపాధ్యాయులు సేకరించిన వివరాలను ఆగస్టు 31లోపు శాలసిద్ధి వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు.
- ప్రస్తుతం పాఠశాల ఏ స్థాయిలో ఉంది, అత్యున్నత స్థాయికి వెళ్లాలంటే ఎలాంటి కార్యాచరణ అమలు చేయాలనేది నిర్ధారించుకోవాలి. దీనికి గాను పాఠశాల సిబ్బంది ఒక విజన్ స్టేట్‌మెంట్స్ తయారు చేసుకొని దాన్ని సాధించడానికి మిషన్ స్టేట్‌మెంట్స్ తయారు చేసుకోవాల్సి ఉంటుంది.
- అన్ని రకాల ప్రధాన అంశాలపై సమగ్ర అవగాహన పెంచుకొని పాఠశాలల సమగ్రాభివృద్ధి ప్రణాళిక చేయాల్సి ఉంటుంది. వీటన్నింటినీ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షిస్తారు.

ఆన్‌లైన్ వ్యాపారంలో మోసంపై కేసు

- రమేశ్‌చారికి రూ.13.50 లక్షలు ఇచ్చానని బాధితుడి ఫిర్యాదు

కరీంనగర్‌క్రైం: ఆన్‌లైన్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభం వస్తుందని నమ్మించి, మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. బాధితుడి వివరాల ప్రకారం.. జూలపల్లి మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన పాలకుర్తి సాగర్ కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఉంటూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2014లో తన ట్రావెల్స్ వద్దకు ధర్మారం మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన కటుకోజ్వల రమేశ్ చారి వచ్చాడు. తాను కేసీఆర్ సేవాదళ్ రాష్ట్ర సలహాదారుగా పని చేస్తున్నానని చెప్పి, పరిచయం చేసుకున్నాడు. ఒకసారి అతనికి సాగర్ కారు కిరాయి వెళ్లాడు. ఈ క్రమంలో రమేశ్‌చారి తాను హైదరాబాద్‌లోని ప్రగతి నగర్‌లో మన తెలంగాణ ఫుడ్ అండ్ ఎలక్ట్రానిక్ వస్తువులను ఆన్‌లైన్ బిజినెస్ చేస్తున్నానని చెప్పాడు. పెట్టిన పెట్టుబడికి 30 శాతం అదనంగా లాభం వస్తుందని చెప్పాడు. ఇది నమ్మిన సాగర్ 28 జూలై 2022న బంగారం, టీవీ, ఫోన్ల కోసం పలు దఫాలుగా రూ.13.50 లక్షలు ఇచ్చాడు. ఏ వస్తువు అయినా 120 రోజుల్లోపు కచ్చితంగా అందజేస్తామని చెప్పాడు. కానీ ఏడాదైనా రాకపోవడంతో అనుమానం వచ్చి, రమేశ్ చారికి ఫోన్ చేయగా కలవలేదు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా కొంతమంది బాధితులు అతని చేతిలో మోసపోయినట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. సిరిసిల్ల ప్రాంతంలో రమేశ్‌చారిపై కేసులు నమోదవుతున్నాయని తెలుసుకున్నాడు. తనను కూడా ఇలాగే మోసం చేశాడని నిర్ధారించుకొని, ఆదివారం కరీంనగర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సాగర్ తెలిపాడు.

పాత పెన్షన్ అమలుకు చొరవ చూపండి

- ఉపాధ్యాయ సంఘాల నాయకులు
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లికి వినతిపత్రం అందజేత



వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీఎస్టీయూ నాయకులు

కరీంనగర్: అర్హులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుకు చొరవ చూపాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లెపాటి వేణుగోపాల్ రావు కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి, వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన అర్హులకు పాత పెన్షన్ వర్తింపజేసేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ వెంటనే ప్రకటించి, పీఆర్‌సీ వేయాలని కోరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చొల్లేటి శ్రీనివాస్, పులిపాక కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి : టీఎస్టీయూ

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల వేతన సవరణ చేపట్టేందుకు వెంటనే పీఆర్‌సీని నియమించాలని, మధ్యంతర భృతి ప్రకటించాలని టీఎస్టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి, వినతిపత్రం అందించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి మాట్లాడుతూ.. గత పీఆర్‌సీలో 22 నెలల కాలం నష్టపోయామని, 01 జూలై 2023 నుంచి రెండో వేతన సవరణ చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు కమిటీ వేయకపోవడంతో తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. రావాల్సిన మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, పెండింగ్ బిల్లులు క్లియర్ చేయించాలని విన్నవించారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, ఉపాధ్యాయ నియామకాలు పూర్తయ్యే వరకు ఖాళీ పోస్టుల్లో విద్యావలంటీర్లను నియమించాలన్నారు. స్పందించిన ఆయన సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు వి.సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పరమేశ్వర్, సీతారాంరెడ్డి, రఘుకుమార్, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలవరపెడుతున్న 'కళ్ల కలక'

- కన్ను ఎర్రగా మారడం, కంటి నుంచి నీరు కారడం లక్షణాలు
- ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తున్న వ్యాధి
- వారం రోజులుగా పెరుగుతున్న బాధితుల సంఖ్య
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



వీణవంక: కరీంనగర్ జిల్లా ప్రజలకు కళకలక(కంజెక్టివిటీస్) వ్యాధి భయం పట్టుకుంది. వారం రోజులుగా ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తోంది. కన్ను ఎర్రగా మారడం, కంటి నుంచి నీరు రావడం, దురుద, కంటి నొప్పి, కంటి రెప్పలు అతుక్కుపోవడం, వాపు రావడం వంటివి దీని లక్షణాలు. కళ్ల కలక బ్యాక్టీరియా, వైరస్ వల్ల వస్తుంది. బ్యాక్టీరియా ద్వారా వచ్చినవారిలో ఐదు రోజుల్లో తగ్గిపోతుంది. అదే వైరస్ వల్ల వస్తే ఒకటి లేదా రెండు వారాల వరకు ఉంటుంది. అయితే ఈ వ్యాధి ప్రమాదకరం కాదని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

కళ్ల కలక అంటే...

దుమ్ము, ధూళి, చలి, వేడి నీళ్లు కంటిపై ప్రభావం చూపించినప్పుడు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. దీన్నే కళ్ల కలక అంటారు. ఇది ఈ మధ్య కాలంలో ఎప్పుడూ విస్తరించలేదు. ఇప్పుడు విద్యార్థులకు ఎక్కువగా వస్తోంది. చిన్నపిల్లలకు వస్తే కొంచెం ప్రమాదకరంగా ఉంటుందని వైద్యులు అంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- కళ్ల కలక వచ్చినవారు ఇంటి నుంచి బయటకు వెళ్లకపోవడం మంచిది. లేకుంటే ఇతరులకు వేగంగా వ్యాపిస్తుంది.
- బాధితుల వస్తువులను తాకడం, వాడటం చేయవద్దు. పొరపాటున ముట్టుకుంటే చేతులను శుభ్రం చేసుకోవాలి.
- కళ్ల కలక వచ్చిన వారికి వేసే డ్రాప్స్‌ను ఇతరులు వాడకూడదు.
- కళ్లద్దాలు వాడటం కొంతవరకు మేలు చేస్తుంది.
- వ్యాధి నివారణకు యాంటీబయోటిక్ ఐ డ్రాప్స్, లూబ్రికేటింగ్ ఐ డ్రాప్స్ వాడితే సరిపోతుంది.

సాధారణ కంటి జబ్బు



కళ్ల కలక అనేది సాధారణ కంటి జబ్బు. కానీ మొదట్లోనే దీన్ని నివారించాలి. ఇది ఒకిరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది. కళ్లను ఎప్పటికప్పుడు మంచినీటితో శుభ్రం చేసుకోవాలి. వైరస్ ద్వారా సంక్రమిస్తే తగ్గేందుకు వారం రోజులు పడుతుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అత్యవసరమైతే అందుబాటులో ఉన్న కంటి వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ ఊడుగుల సురేశ్, జనరల్ ఫిజీషియన్, ఐఎంఏ జమ్మికుంట, హుజూరాబాద్ ప్రధాన కార్యదర్శి

'అల్ఫోర్స్' అధినేతకు సన్మానం



నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కరీంనగర్: అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత ఊట్కూరి నరేందర్ రెడ్డి ప్రతిష్టాత్మక ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు అందుకున్న విషయం విధితమే. ఈ సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లోని వావిలాలపల్లి అల్ఫోర్స్ జూనియర్ కళాశాల మెయిన్ క్యాంపస్‌లో ఆయనను ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకొని, జిల్లా కీర్తిని చాటాలని సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సంయుక్త కార్యదర్శి దారం జగన్నాథరెడ్డి, సప్తగిరికాలనీ, శ్రీనగర్ కాలనీ అధ్యక్షుడు చెన్నాడి రాజేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు.

'ఔట్‌సోర్సింగ్ జేపీఎస్‌లను క్రమబద్ధీకరించేలా చూస్తాం'

కరీంనగర్ అర్బన్: ఔట్‌సోర్సింగ్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించేలా చూస్తామని టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో ఉమ్మడి జిల్లాలోని ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘం రాష్ట్ర నాయకత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. త్వరలో కార్యదర్శుల సమస్య కూడా కొలిక్కి వస్తుందన్నారు. ఔట్‌సోర్సింగ్ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా మార్చేలా చర్యలుంటాయని చెప్పారు. త్వరలో పీఆర్‌సీ వేయించి, ఐఆర్ సాధించుకుంటామని వివరించారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్‌ను పునరుద్ధరించుకుంటామని అన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, సహాధ్యక్షుడు రాగి శ్రీనివాస్, ఔట్‌సోర్సింగ్ నాయకులు అజయ్, విక్రమ్, రవీందర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అడవిపంది దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

మంథని: మండలంలోని సూరయ్యపల్లి శివారులో ఎంపీటీసీ మాజీ సభ్యుడు భీముని వెంకటస్వామిపై అడవిపంది దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం గ్రామ సమీపంలోని పొలం వద్దకు వెళ్లిన స్వామిపై ఒక్కసారిగా అడవి పంది దాడి చేసింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతనికి స్థానిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి, కరీంనగర్ తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
ADMISSIONS

■ సాయి ప్రైవేట్ ఐటిఐ జగిత్యాల ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, మెకానికల్ డీజిల్ లో అడ్మిషన్లు ప్రారంభమైనవి. దరఖాస్తుకు ఆన్‌లైన్‌లో చివరి తేది: 31-07-2023 ఏదైనా బీటెక్/ డిప్లమా & MCA చేసినవారు Instructor Job కొరకు బయోడేటా సమర్పించగలరు. సం॥ 8106371128 [K-1185631]

SERVICES
OLD AGE HOME

■ త్రివేణి హోంకేర్, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకోవడానికి, వంట, ఇంటి పనికి వర్కర్స్‌ను మీ ఇంటికే పంపబడును. ఫోన్ :9160900023, 9160900024. [H-189313]

WANTED

■ ఓల్డ్ రికార్డ్ చూసి న్యూ రికార్డ్ రాయుటకు స్త్రీ/పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. ప్రతిరోజు ఆదాయం. వివరాలకు సంప్ర॥ 7036253618. [W-189112]

■ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 72074 45296 [V-6195]

■ కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. మీ అర్హతకు తగిన విధంగా సంపాదించుకునే అవకాశం. పార్ట్ టైం 8000. ఫుల్ టైం: 20000/- 7993700904, 9014504770, 8977743043. [W-1002992]

■ ప్రముఖ సంస్థకు మాయొక్క మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ వారం వారం అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. 88854 86421. [M-1221471]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

సస్యరక్షణ చర్యలే పంటలకు రక్ష

- అత్యధిక వర్షపాతం నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరి
- డీఏవో శ్రీధర్



డీఏవో శ్రీధర్



కరీంనగర్ అర్బన్: ఏ పంటలో చూసినా వర్షపు నీరే. ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో వాన కురవడంతో పంట చేలల్లో వరద నీరు చేరింది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించడమే ముందున్న మార్గమని జిల్లా వ్యవసాయ అధికారి వాసిరెడ్డి శ్రీధర్ అంటున్నారు. 179 శాతం వర్షపాతం నమోదైందని, ఇది పంటలకు ప్రతికూలమని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో ఇప్పటివరకు 1,91,930 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. పత్తి, మొక్కజొన్న, వరి పంటల్లో అంతర కృషి చేయాలని సూచిస్తున్నారు.

పత్తి: 20 నుంచి 40 రోజుల దశలో పత్తి పంట ఉన్నందున నిలిచిన నీటిని కాలువల ద్వారా బయటకు పంపాలి. వర్షాలు తగ్గిన తర్వాత అంతర కృషి కుదరకపోతే వెడల్పాకు కలుపు అధికంగా ఉంటే పైరిథయోబ్యాక్ సోడియం 250 ఎంఎల్, గడ్డిజాతి కలుపు ఉంటే క్విజోఫాఫ్ ఇథైల్ 400 ఎం.ఎల్, రెండు రకాల కలుపు ఉంటే పై రెండు మందులను కలిపి 500 ఎంఎల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వర్షాలు తగ్గాక ఎకరాకు 25 నుంచి 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్‌ను పైపాటుగా వేయాలి. వేరుకుళ్లు ఉంటే కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బండిజమ్ 1గ్రాము లీటరు నీటికి కలిపి తెగులు సోకిన మొక్కల మొదళ్ల చుట్టూ పోయాలి.

మొక్కజొన్న: నీరు నిల్వ ఉంటే కాలువ ద్వారా బయటకు తీయాలి. కలుపు నివారణకు వెడల్పాకు ఉంటే ఇథైల్ ఎస్టర్ లీటర్, సోడియం సాల్ట్ 600 గ్రాములు ఎకరానికి 200 లీటర్లలో కలిపి పిచికారీ చేసుకోవాలి. వెడల్పాకు, గడ్డిజాతి ఉంటే మీసోట్రియోన్+అట్రాజిన్ 1400 ఎంఎల్ లేదా టెంబోట్రియాన్ 150 ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి, పిచికారీ చేయాలి. తుంగ కలుపు ఉంటే హాలోసల్ఫ్యూరాన్ మిథైల్ 30 గ్రాములు+అట్రాజిన్ 500 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి, వాడాలి.

వరి: ఇప్పటివరకు నార్లు పోసుకోని రైతులు దమ్ము చేసిన పొలంలో మొలకెత్తిన విత్తనాన్ని వెదజల్లడం ద్వారా లేదా డ్రమ్‌సీడర్ ద్వారా వేసుకోవాలి. 7 నుంచి 10 రోజుల ముందుగా కోతకు వస్తుంది. నారు ఖర్చు తగ్గుతుంది. ఇక నారుమళ్లలో నిలిచిన నీటిని తొలగించి, అగ్గి తెగులు ఆశించే అవకాశమున్నందున ట్రైసైక్లజోల్+మాంకోజెబ్ మిశ్రమాన్ని 2.5 గ్రాములను లీటరు నీటికి కలిపి, పిచికారీ చేయాలి. నారు తీయడాని కి 5 నుంచి 7 రోజుల ముందు ఒక ఎకరానికి సరిపడే నారుమడికి 800 గ్రా కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకతో కలిపి చల్లుకోవడం వల్ల ఉల్లికోడు, మొగిపురుగు తాకిడి తగ్గుతుంది. నారు ముదిరితే కుదుళ్ల సంఖ్యను పెంచి, కుదురుకు 6 నుంచి 8 మొక్కల చొప్పున దగ్గరగా నాటుకోవాలి.

అమరుల ఆశయసాధనకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మృత్యుంజయం

కరీంనగర్: తెలంగాణ అమరులైన ఆశయసాధనకు ప్రజలు ఉద్యమించాలని తెలంగాణ అమరుల ఆశయాల సాధన జాయింట్ యాక్షన్ కమిటీ(టీఏఏఎస్ జేఏసీ) రాష్ట్ర చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఉద్యమకారుల సదస్సులో మాట్లాడారు. తొలి, మలిదశ ఉద్యమాల తర్వాత సాధించుకున్న తెలంగాణ ఆశించినట్లు లేకపోవడమే కాకుండా పెనం పైనుంచి పొయ్యిలో పడినట్లు పరిస్థితి ఉందన్నారు. కనీసం రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసినవారి కుటుంబాలను పట్టించుకునేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ అక్రమ సంపాదనే ధ్యేయంగా కుటుంబసభ్యుల ఎదుగుదలనే తెలంగాణ ఎదుగుదలగా భావించి, ఇష్టారీతిన పాలన చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గద్దెదింపాల్సిన అవసరముందన్నారు. వివిధ పార్టీల, ప్రజా, కుల సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటమల్లయ్య, జోజి రెడ్డి, నరేష్, శంకర్, సుదర్శన్, శ్రీనివాస్, అనిల్, కుమారస్వామి, మల్లేశం, ప్రవీణ్‌రావు, లోకేశ్, రమేశ్, మధు, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొవ్వొత్తులతో ర్యాలీ



క్యాండిల్‌ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్‌ నేతలు

కరీంనగర్‌టౌన్‌: మణిపూర్‌లో శాంతియుత పరిస్థితులు నెలకొల్పడంలో మౌనం వహిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ వైఖరికి నిరసనగా ఏఐసీసీ సేవాదళ్‌ పిలుపు మేరకు ఉత్తర తెలంగాణ సేవాదళ్‌ ఇంచార్జ్‌ మస్తాక్‌ అహ్మద్‌ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఇందిరాచౌక్‌ నుంచి బస్టాండ్‌ సర్కిల్‌ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, నగర అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు వెన్న రాజమల్లయ్య, సమద్‌ నవాబ్‌, చెర్ల పద్మ, శ్రీమతి శకుంతల దేవి, దన్న సింగ్‌, అబ్దుల్‌ రెహమాన్‌, ఖమరుద్దీన్‌, బొబ్బిలి విక్టర్‌, ముక్క భాస్కర్‌, రాచకొండ ప్రభాకర్‌, కుర్ర పోచయ్య, షహన్నా, పోరండ్ల రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

మన్‌ కీ బాత్‌ వీక్షణ



కరీంనగర్‌టౌన్‌: ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్‌ కార్యక్రమాన్ని ఆదివారం కరీంనగర్‌లోని పార్లమెంట్‌ కార్యాలయంలో బీజేపీ శ్రేణులు వీక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని మన్‌ కీ బాత్‌ ప్రోగ్రాంకు విశ్వవ్యాప్తంగా విశేష ఆదరణ లభిస్తుందన్నారు. ప్రతినెలా చివరి ఆదివారం ప్రసారమయ్యే మన్‌ కీ బాత్‌లో పలు అంశాలు, ప్రధాని తన ఆలోచనలను ప్రజానీకంతో పంచుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్‌ కన్వీనర్‌ బోయినపల్లి ప్రవీణ్‌రావు, జిల్లా కార్యదర్శి రామానుజం, మీడియా సెల్‌ జిల్లా కన్వీనర్‌ లోకేశ్‌, నాయకులు రమణారెడ్డి, నాగసముద్రం ప్రవీణ్‌, లక్ష్మారెడ్డి, శివరాజ్‌, శ్రీనివాస్‌, రఘు, సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా నగరంలోని 59వ డివిజన్‌ సుష్మాస్వరాజ్‌ చౌరస్తాలో రేడియో ద్వారా ప్రధాని ప్రసంగాన్ని ప్రజలందరికీ వినిపించారు. రెడ్డిడ్డి శ్రీనివాస్‌(బాలు) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆంజనేయులు, కల్లె శ్రీనివాస్‌, మధు, వీరయ్య, రాజమల్లయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వీట్లు పంపిణీ



స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్‌: బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కరీంనగర్‌ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ఆదివారం నగరంలోని మల్కాపూర్‌ రోడ్డులో గల సెయింట్‌ జాన్‌ పాఠశాల ఎదుట బీజేపీ నగర పశ్చిమ జోన్‌ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు బండ రమణారెడ్డి, మామిడి రమేశ్‌, ఎడమ సత్యనారాయణరెడ్డి, దాసరి రమణారెడ్డి, సంజీవ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎలగందులలో జోరుగా అక్రమ నిర్మాణాలు

- పల్లె ప్రకృతి వనం ధ్వంసం చేసి మరీ భూ చదును
- ప్రజాప్రతినిధుల సహకారం.. అడ్డుకోవడంలో అధికారుల వైఫల్యం
- 'ప్రజావాణి'లో విన్నవించినా.. దృష్టిసారించని వైనం



ఎలగందులలోని పల్లె ప్రకృతి వనంలో చెట్లు తొలగించి చదును చేసిన స్థలం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ, అసైన్డ్‌ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ×స్థానిక× ప్రజాప్రతినిధుల అండదండలతో యథేచ్ఛగా కొనసా..గుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. గ్రామస్తులు ఎన్నిసార్లు విన్నవించినా ఉన్నతాధికారులు సైతం ఆ ఆక్రమణ వైపు దృష్టి సారించడం లేదన్న అపవాదు మూటగట్టుకుంటున్నారు. దీంతో అక్రమ నిర్మాణాల జోరు ఆగడం లేదు. అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేసేందుకు వెళ్లిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై ఓ ×స్థానిక× నేత చిర్రుబుర్రులాడటమే గాక రాజకీయ పలుకుబడి ఉపయోగించి అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ప్రజల విజ్ఞప్తికి అడపాదడపా అక్రమ నిర్మాణాలను ఆపుతున్నప్పటికీ అధికారులపై సైతం ఒత్తిడి తెస్తూ యథేచ్ఛగా పనులు కానిచ్చేస్తున్నారు. ఓ నేత కనుసన్నల్లోనే పంచాయతీ సిబ్బంది సైతం నడస్తుండటంతో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడటం లేదన్న చర్చ గ్రామంలో జోరందుకుంది. ఏకంగా పల్లె ప్రకృతి వనంలోని చెట్లను ధ్వంసం చేసి భూ ఆక్రమణకు పాల్పడుతున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ×ప్రజావాణి×లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేకపోవడం నిరాశకు లోనుచేస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజావసరాలకు ఉపయోగపడే విధంగా భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సర్వేనంబర్‌ 28లో..

కొత్తపల్లి మండలం ఎలగందులలోని 28 సర్వేనంబర్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా సా..గుతున్నాయి. సుమారు 72 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం గతంలో లబ్ధిదారులకు అసైన్డ్‌ చేస్తూ పట్టాలు ఇచ్చింది. పేదరికాన్ని గుర్తించి జీవనోపాధి కోసం భూమిని కేటాయిస్తే కొందరు ప్రభుత్వ నిబంధనలు దుర్వినియోగం చేస్తూ క్రమవిక్రయాలు చేపట్టారు. అసైన్డ్‌ భూముల్లో క్రయవిక్రయాలు చేపట్టద్దన్న నిబంధనలు తుంగలో తొక్కుతూ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. అయితే ఇటీవల భూముల విలువ విపరీతంగా పెరగడం.. రియల్‌ వ్యాపారం తారాస్థాయి చేరడం.. గ్రానైట్‌ వ్యాపారం విస్తరించడంతో ఎలగందుల భూములకు విపరీతమైన డిమాండ్‌ ఏర్పడింది. దీనిని ఆసరా చేసుకున్న కొంతమంది రియల్‌ వ్యాపారులు అసైన్డ్‌ భూమా..?, ప్రభుత్వ భూమా..?, శిఖం భూములా అని చూడకుండా కొనుగోళ్లు చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అదేవిధంగా ఈ అసైన్డ్‌ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్న నిబంధనలున్నప్పటికీ చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుంటూ అక్రమ నిర్మాణాలకు తెరలేపుతున్నారు. వీటిని నియంత్రించాలిన్న పంచాయతీ సిబ్బంది పట్టించుకోకపోగా.. రెవెన్యూ ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగాగా సాగుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించైనా అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పల్లె ప్రకృతి వనం చెట్ల ధ్వంసం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనం చెట్లను సైతం అక్రమార్కులు వదలకపోగా.. పెరిగిన చెట్లను ధ్వంసం చేసి భూమి చదును చేపట్టి అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు. ఎలగందులలోని సర్వేనం.28లో పల్లె ప్రకృతి వనం మొక్కల పెంపకానికి 20 గుంటల స్థలం కేటాయించారు. సుమారు 1,800 మొక్కలు ఈజీఎస్‌ ద్వారా నాటి పంచాయతీకి బాధ్యతలు అప్పజెప్పారు. పంచాయతీ సిబ్బంది కళ్లుగప్పి పల్లె ప్రకృతి వనం చెట్లను ధ్వంసం చేసి భూమిని చదును చేసి అందులో బేస్మెంట్‌ నిర్మించేందుకు బండరాయిని వేశారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలకు తావిస్తోంది.

ప్రభుత్వ భూమి కాపాడండి

కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. భూములను ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కాపాడండి. ఎలగందులలోని 28 సర్వేనంబర్‌లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పల్లె ప్రకృతి వనంలోని చెట్లను ధ్వంసం చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయమై ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం. ఉన్నతాధికారులు స్పందించి అక్రమార్కులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

– కడార్ల రతన్‌ కుమార్‌, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు

నోటీసులిచ్చాం

ఎలగందుల గ్రామంలోని సర్వేనంబర్‌ 28లో చేపట్టిన అక్రమ నిర్మాణాలకు నోటీసులిచ్చాం. ఇందులోని నిర్మాణాలకు ఇంటి నంబర్లు గాని, ఇంటి నిర్మాణ అనుమతులు గాని తన హయాంలో ఇవ్వలేదు. అదేవిధంగా పల్లె ప్రకృతి వనంలోని చెట్లు ధ్వంసం చేసిన విషయమై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకంటాం.

– విజయలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి, ఎలగందుల

అక్రమ నిర్మాణాల నిలిపివేత

ఎలగందుల గ్రామంలోని సర్వేనంబర్‌ 28లో గల అసైన్డ్‌ భూములోని అక్రమ నిర్మాణాలను నిలిపివేస్తున్నాం. గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు వస్తుండటంతో ఆర్‌ఐ పర్యవేక్షణలో నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. నిర్మాణాలు కొనసాగితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– నల్ల వెంకట్‌రెడ్డి, తహసీల్దార్‌, కొత్తపల్లి

మున్నూరుకాపు కమ్యూనిటీ హాల్‌కు నిధులు



మంత్రిని సన్మానిస్తున్న సభ్యులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంటలో మున్నూరు కాపు కమ్యూనిటీ హాల్‌ నిర్మాణానికి ఆర్థిక సాయం అందిస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ హామీ ఇచ్చారు. చింతకుంట మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకోగా.. కరీంనగర్‌లో మర్యాదపూర్వకంగా మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయాలని కోరగా.. అందుకు స్పందించి ఆర్థిక సాయం చేస్తానని తెలిపారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పట్టెం శ్రీనివాస్‌, దాసరి రవి, ఉపాధ్యక్షుడు డి.సంతోశ్‌కుమార్‌, సంయుక్త కార్యదర్శి ఆకుల అనిల్‌కుమార్‌, కోశాధికారి పి.రాజయ్య, సభ్యులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆకలి తీర్చింది కాంగ్రెస్‌ పార్టీయే

కరీంనగర్‌టౌన్‌: దేశంలో ఆకలి చావులు అరికట్టి, పేద ప్రజలకీ కడుపునిండా అన్నం పెట్టిన పార్టీ కాంగ్రెస్‌ పార్టీయేనని కాంగ్రెస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల సుజిత్‌కుమార్‌ అన్నారు. ఆదివారం నగరంలోని జ్యోతినగర్‌ కొత్త లేబర్‌ అడ్డా వద్ద దినసరి వేతన కార్మికులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడారు. జవహర్‌ లాల్‌ నెహ్రూ నీటిపారుదల రంగాన్ని అభివృద్ధి చేసి దేశంలో వ్యవసాయ విప్లవానికి బాటలు వేశారని తెలిపారు. నగరంలోని పేద ప్రజలకు ఇందిరా, రాజీవ్‌ పేరిట పక్కా ఇళ్లు, భూములు ఇచ్చారని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం, జాతీయ ఆహార భద్రత చట్టం తెచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు కొరివి అరుణ్‌, పెద్దిగారి తిరుపతి, పొన్నం మధు, ఫిరోజ్‌, దిలీప్‌, నాగరాజు అబ్దుల్‌ నవాజ్‌, వాసు, ప్రసాద్‌, మల్లికార్జున్‌, భరత్‌ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయనడం విడ్డూరం'



మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్‌: అనవసరంగా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మేయర్‌ సునీల్‌రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్‌ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారీ వర్షాలతో నగరంలోని చాలా ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరాయని తెలిసి వెళ్లి పరిశీలించి మీడియా ద్వారా తెలియజేస్తే కావాలని కాంగ్రెస్‌ నాయకులు విమర్శిస్తున్నారని మాట్లాడటాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. కేబుల్‌ బ్రిడ్జి అప్రోచ్‌ రోడ్డు కుంగలేదని అనడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా చిత్తశుద్ధి ఉంటే నాణ్యతపై నమ్మకం ఉంటే విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయాలని డిమాండ్‌ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఎండీ తాజ్‌, కొరివి అరుణ్‌కుమార్‌, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, దండి రవీందర్‌, కుర్ర పోచయ్య, ఎండీ చాంద్‌, దన్న సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

24వ డివిజన్‌లో గడప గడపకూ కాంగ్రెస్‌

కరీంనగర్‌టౌన్‌: నగరంలోని 24వ డివిజన్‌లో గడప గడపకూ కాంగ్రెస్‌ కార్యక్రమం ద్వారా ప్రజలను కలుసుకుంటూ కాంగ్రెస్‌ పథకాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్‌ నగర అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి నాయకులు కుర్ర పోచయ్య, సర్వర్‌(చోటు), గుండాటి శ్రీనివాస్‌, కొరివి అరుణ్‌ కుమార్‌, దండి రవీందర్‌, ముస్తాక్‌, ముల్కల కవిత తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ



కరెంట్‌ రాదు.. గోసతీరదు

కరీంనగర్‌ మండలం నల్లగుంటపల్లిలో తాగునీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలరోజుల క్రితం రక్షిత తాగునీటి బావి విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ కాలిపోగా కొత్తది బిగించడంలో అధికారులు జాప్యం చేయడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. వారానికోసారి వస్తున్న మిషన్‌ భగీరథ నీరు సరిపోకపోవడంతో చేతిపంపును ఆశ్రయిస్తున్నామని మహిళలు తెలిపారు. అధికారులెవ్వరూ నీటి సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. - కరీంనగర్‌రూరల్‌

'వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడంలో నంబర్‌ వన్‌'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌రావు

కరీంనగర్‌టౌన్‌: చేసిన తప్పులను వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడంలో బీఆర్‌ఎస్‌ నంబర్‌ వన్‌ స్థానంలో ఉంటుందని బీజేపీ కరీంనగర్‌ పార్లమెంట్‌ కన్వీనర్‌ బోయినపల్లి ప్రవీణ్‌ అన్నారు. ఆదివారం ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా కల్పించి అభివృద్ధి పనుల కోసం వందల కోట్ల నిధులు కేటాయిస్తుంటే, ప్రణాళిక లేని పనులతో నగరాన్ని అస్తవ్యస్తంగా మారుస్తున్నారని అన్నారు. రూ.224 కోట్లతో నిర్మించి కేబుల్‌ బ్రిడ్జి వద్ద అప్రోచ్‌ రోడ్డు, సైడ్‌వాల్‌ నిర్మాణాల పగుళ్లు, ఫుట్‌పాత్‌ నిర్మాణాల పరిస్థితులే ఇందుకు నిదర్శనంగా నిలుస్తాయని తెలిపారు. నగరంలో జరుగుతున్న పనుల్లో లోపాలను సరిదిద్దుకొని సుందరంగా తీర్చిదిద్దేందుకు బీఆర్‌ఎస్‌ నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు దుబాల శ్రీనివాస్‌, రామానుజం, బండ రమణారెడ్డి, నాగసముద్రం ప్రవీణ్‌, కటకం లోకేష్‌, నరహరి లక్ష్మారెడ్డి, పాదం శివరాజ్‌, అవదుర్తి శ్రీనివాస్‌, పుప్పల రఘు తదితరులు పాల్గొన్నారు.

పందులు తరలిస్తున్న ఆటో అడ్డగింత



పందులు తరలిస్తున్న ఆటోను అడ్డుకుంటున్న శాంతినగర్‌వాసులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో పందుల లోడ్‌తో వచ్చిన ఆటోను స్థానికులు అడ్డుకున్నారు. కరీంనగర్‌ నుంచి పందులను శాంతినగర్‌లో వదిలేందుకు వచ్చిన ఆటోను ఎంపీటీసీ భూక్య తిరుపతినాయక్‌ ఆధ్వర్యంలో స్థానికులు అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌ రెడ్డితో ఎస్సై చంద్రశేఖర్‌ ఫోన్‌లో మాట్లాడారు. వారం రోజుల్లో పందులన్నింటినీ తరలించాలని యజమానులకు నోటీసులు జారీ చేయనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. తదనంతరం పందులు తరలించకపోతే చట్టప్రకారం తీసుకోనున్నట్లు ఎస్సై స్పష్టం చేశారు. ఇప్పటికే శాంతినగర్‌లో శానిటేషన్‌ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి స్థానికులు రోగాల బారిన పడుతున్నారని, ఈ పందుల వల్ల మరికొంత మంది వ్యాధుల బారిన పడే ప్రమాదముందని ఇక్కడ పందులను వదలరాదంటూ ఆటో డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లలోకి ప్రవేశించి వంట పాత్రలను చిందరవందర చేస్తున్నాయని, గ్రామ పంచాయతీ పాలకమండలి సభ్యులు తక్షణమే చొరవ చూపి చింతకుంటలోని పందులన్నింటినీ వెంటనే ఖాళీ చేయించాలని, లేనిపక్షంలో ఇళ్లు ఖాళీ చేసి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే శాంతినగర్‌లో విషజ్వరంతో ఒకరు చనిపోగా..మరొకరు డెంగీతో వరంగల్‌ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు.

నష్టాన్ని మిగిల్చిన వర్షాలు



"ఈ ఫొటోలో పొలంలో ఇసుకమేటలతో కనిపిస్తున్న రైతు కరీంనగర్‌ మండలం ఎలబోతారానికి చెందిన కట్ల గౌతంరెడ్డి. 13 ఎకరాల్లో వరి నాట్లేయగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సమీపంలోని పేరి చెరువు వరదనీళ్లన్నీ పొలంలోకి చేరాయి. 4 ఎకరాల్లో ఇసుకమేటలు వేయడంతో సుమారు రూ.80వేల వరకు నష్టపోయాడు. ఇసుకను తొలగించి మళ్లీ వరినాట్లేయాలంటే వేలల్లో ఖర్చు అవుతుందని ఆవేదన చెందుతున్నాడు. ఈ పరిస్థితి గౌతంరెడ్డి ఒక్కడిదే కాదు వాగులు, చెరువుల పరీవాహక ప్రాంతాల్లో వరిసాగు చేసిన రైతులందరిది."



చెర్లభూత్కూర్‌లో ఓ రైతు పొలంలో ఇసుక, రాళ్లు

కరీంనగర్‌రూరల్‌: కరీంనగర్‌ మండలంలో భారీ వర్షాలు రైతాంగానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. రెండు రోజుల నుంచి వరుణుడు కొంత విరామం ఇవ్వడంతో వరద ప్రవాహం తగ్గడంతో చెర్లభూత్కూర్‌ శివారులోని కల్వర్టు మీద నుంచి రాకపోకలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయి. నగునూరు పాతవంతెన వద్ద ఆరెపల్లి వాగు వరద ఉధృతికి రోడ్డు తెగిపోయింది. వంతెనకు ఇరువైపుల బీటీ కొట్టుకుపోయి కంకర, బండరాళ్లు తేలాయి. ఇరుకుల్ల, మానేరువాగులు ఉధృతంగా ప్రవహించడంతో పరీవాహక ప్రాంతాలైన నగునూర, గోపాల్‌పూర్‌, ఇరుకుల్ల, దుర్శేడ్‌, మొగ్దుంపూర్‌, నల్లగుంటపల్లి, బొమ్మకల్‌, చేగుర్తి, మందులపల్లె తదితర గ్రామాల్లోని వరిపొలాల్లో ఇసుకమేటలు వేశాయి. పొలాల్లో పెద్ద ఎత్తున పేరుకపోయిన ఇసుక తొలగింపు, పెద్ద పెద్ద గండ్లను ఎలా పూడ్చుకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 100 ఎకరాల్లో వరిపొలాలు దెబ్బతిని ఎకరానికి రూ.20వేల చొప్పున నష్టం జరిగింది. నష్టపోయిన పంటల వివరాలను సేకరించాల్సిన వ్యవసాయాధికారులు ఎన్నికల విధులు, రైతుబీమా నమోదులో బిజీగా ఉన్నారు. ఏవో సత్యం శనివారం కొన్ని గ్రామాల్లో మొక్కుబడిగా పర్యటించి నష్టం వివరాలు సేకరించారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో పర్యటించి పూర్తిస్థాయిలో పంట నష్టం వివరాలు సేకరించాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఇరుకుల్లవాగు వరద ఉధృతికి కింద పడిన ట్రాన్స్‌ఫార్మర్‌



చెర్లభూత్కూర్‌లో వరదకు దెబ్బతిన్న కల్వర్టు



నగునూరు పాతరోడ్డు తెగిపోవడంతో వంతెన వద్ద తేలిన బండలు



రేకుర్తి బ్రిడ్జి మూసివేత

కరీంనగర్‌ శివారు రేకుర్తిలోని పురాతన వంతెనను మూసివేశారు. వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు కొత్తపల్లి చెరువు నుంచి వరద నీటి ప్రవాహం వంతెన కింది భాగాన్ని తాకుతూ ప్రవహించడంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆ వంతెనపై నుంచి వాహనాలను నిలిపివేశారు. కరీంనగర్‌ నుంచి జగిత్యాల వైపు.. అటు నుంచి కరీంనగర్‌ వైపు వచ్చే వాహనాలు వంతెనపై నుంచి వెళ్లకుండా ఇరువైపుల పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. రహదారిపై గత మూడు రోజులుగా వరద ఉధృతి తగ్గినప్పటికీ పక్క వంతెనపై నుంచే వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నారు. అంతేగాకుండా ఈ పురాతన వంతెనపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారైంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. – కొత్తపల్లి

విద్యారంగాన్ని విస్మరించొద్దు



మాట్లాడుతున్న కుతాటి ప్రతాప్‌

హుజూరాబాద్‌: విద్యా రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణాప్రతాప్‌ అన్నారు. ఆదివారం పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. విద్యాసంస్థల్లో ఉన్న లోపాలను ప్రభుత్వానికి ఎత్తిచూపుతున్న విద్యార్థులు, నాయకులను, మీడియాను పాఠశాలల్లోకి అనుమతించొద్దంటూ విద్యాశాఖ ప్రిన్సిపాల్‌ శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం శ్రీకాంత్‌, జిల్లా కోశాధికారి కెమ్మసారపు రవితేజ, జిల్లా నాయకులు లోకిని శివకుమార్‌,మోహన్‌,తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్‌ జిల్లా:
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్‌ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్‌, ACO - 7997958214
కరీంనగర్‌: రాజశేఖర్‌ - 9618304759
చొప్పదండి: ముండయ్య - 7997958217
మానకొండూర్‌: మహేశ్‌ - 9573106760
హుజూరాబాద్‌: ప్రశాంత్‌ - 7331119941
టోల్‌ ఫ్రీ నం.: 1800 425 9899

క్లుప్తంగా...

అగ్నిగుండంలో దూకి.. వ్యక్తి ప్రాణాలు కాపాడి!

- అన్నమయ్య జిల్లాలో ఓ వలంటీర్ సాహసం


చికిత్స పొందుతున్న కల్లూరి బాషా


గాయాలపాలైన వలంటీర్ సురేష్

రైల్వేకోడూరు: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలంలోని ఓ.కొత్తపల్లిలో శనివారం రాత్రి పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో కల్లూరి బాషా అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పడిపోయాడు. అక్కడే ఉన్న వలంటీర్ చావల సురేష్ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా గుండంలో దిగి బాషా ప్రాణాలు కాపాడాడు. ఈ సంఘటనలో బాషా వీపు భాగం బాగా కాలిపోవడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. వలంటీర్ కాళ్లు కాలిపోవడంతో కోడూరులో చికిత్స పొంది ఇంటికి చేరుకున్నాడు. పీర్లచావిడి అగ్నిగుండం వద్ద జరిగిన ఈ సంఘటనను వందలాది మంది చూస్తున్నారే తప్ప బాషా ప్రాణాలను కాపాడేందుకు ఎవ్వరూ ముందుకు రాలేకపోయారు. కానీ వలంటీర్ సురేష్ సాహసం చేసి గుండంలో పడిపోయిన బాషా ప్రాణాలు కాపాడి అందరి మన్ననలు పొందాడు.

రొట్టె పట్టగా.. కోర్కె తీరగా..!

- కొనసాగుతున్న రొట్టెల పండగ



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద నిర్వహించే రొట్టెల పండగ ఆదివారం వేడుకగా కొనసాగింది. కోర్కెల రొట్టెలను పట్టుకునేందుకు లక్షలాదిగా రావడంతో రొట్టెలు మార్చుకునే భక్తులతో స్వర్ణాల చెరువు జనసంద్రమైంది. అక్కడ స్నానమాచరించి కోర్కెల రొట్టెలను పట్టుకున్నారు. అర్ధ రాత్రి తర్వాత దర్గా ప్రాంగణంలో గంధ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంధాన్ని షహీదుల సమాధులకు సమర్పించి భక్తులకు పంచిపెట్టారు. రొట్టెల పండగకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు వచ్చారు.

భూగోళం.. ఇక మండే అగ్నిగోళం

గ్లోబల్ వార్మింగ్ యుగం ముగిసింది

- బాయిలింగ్ యుగం మొదలైంది.. ప్రపంచానికి ఐక్యరాజ్యసమితి హెచ్చరిక
- జూలైలో ప్రపంచవ్యాప్తంగా రికార్డు ఉష్ణోగ్రతలు నమోదు
- 1.20 లక్షల సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- హీట్‌వేవ్‌ను ఎదుర్కొన్న ఐరోపా దేశాలు.. ఉష్ణోగ్రతల కట్టడికి ఐరాస చర్యలు



సాక్షి, అమరావతి: భూగోళం మండే అగ్నిగోళంగా మారుతోంది. శీతల దేశాల్లో సూర్యుడు సెగలు పుట్టిస్తున్నాడు. ఎండల ధాటికి ఓ వైపు అడవులు దగ్ధమైపోతుండగా.. మరోవైపు మంచు కరిగిపోయి వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. గ్లోబల్ వార్మింగ్ యుగం ముగిసిపోయిందని.. ఇక గ్లోబల్ బాయిల్ యుగం వచ్చేసిందని ఐక్యరాజ్యసమితి సైతం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇందుకు తగ్గట్టుగానే ఈ ఏడాది జూలైలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని యూరోపియన్ కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్, ప్రపంచ వాతావరణ సంస్థ వెల్లడించాయి. సాధారణంగా జూలైలో ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 16 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యేదని.. కానీ, ఈ ఏడాది దాదాపు 17 డిగ్రీలకు పెరిగిందని వెల్లడించాయి. 1.20 లక్షల సంవత్సరాల్లో భూమి ఇంత వేడిని ఎప్పుడూ చూడలేదని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. దక్షిణ అర్ధగోళంలో విపరీత వేడి కారణంగా మంచు కరిగి వరదలు విధ్వంసం సృష్టిస్తున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అలాగే చైనా, దక్షిణ కొరియా, బ్రెజిల్, అమెరికా ఈశాన్య ప్రాంతాలు, జపాన్, భారత్, పాకిస్తాన్‌లో ఆకస్మిక వరదలు సంభవిస్తాయని వారు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా ఎడారి ప్రాంతాల్లో పగటిపూటతో పోలిస్తే రాత్రి సమయాల్లో వాతావరణం కాస్త చల్లబడుతుంది. కానీ, కాలిఫోర్నియాలోని 'డెత్ వ్యాలీ'లో రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. అక్కడ జూలై నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యా యని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అలాగే వాయవ్య చైనాలోనూ రికార్డు స్థాయిలో 52.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు ఉత్తరార్ధ గోళంలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది వేసవిలో వడగాడ్పులు వీచాయి. ఫలితంగా అంటార్కిటికాలో కూడా పెద్ద ఎత్తున మంచు కరిగిపోయింది. అలాగే ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, పోలాండ్ దేశాలను వడగాడ్పులు ఉక్కిరిబిక్కిరి చేశాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

పొంచి ఉన్న కరువు ముప్పు..!

దక్షిణ ఐరోపా, ఉత్తర ఆఫ్రికా, ఆసియా దేశాలు వసంత కాలం చివరి నుంచి అత్యధిక వేడిని ఎదుర్కొన్నాయని యూరోపియన్ కోపర్నికస్ నివేదిక చెబుతోంది. అమెరికాలోని దక్షిణ రాష్ట్రాల్లో క్రమం తప్పకుండా 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించింది. గ్రీస్, ఇటలీ, క్రొయేషియా, అల్జీరియా, కెనడాలో కార్చిచ్చులు చెలరేగి అడవులను దహించాయి. నాడాలో ఏకంగా నాలుగు వారాల్లో 46 వేల చదరపు మైళ్ల అడవులు బూడిదయ్యాయి. 60 శాతం దేశాల్లోని అడవుల్లో మంటలు చెలరేగాయని నివేదిక తెలిపింది. వీటి ఫలితంగా 1950తో పోలిస్తే ప్రపంచ భూభాగంలో దాదాపు మూడో వంతు ఏటా కరువు సంభవిస్తుందని.. ఇది 10 లక్షల మందిని తీవ్ర ఆకలిలోకి నెడుతుందని శాస్త్రవేత్తల నివేదికలు హెచ్చరిస్తున్నాయి. ఈ ఏడాది చివరితో పాటు 2024లో ఎల్‌నినో ప్రభావం గరిష్ట స్థాయికి చేరుకుంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఫలితంగా బ్రిటన్, ఐర్లాండ్, బాల్టిక్ సముద్రం, జపాన్ సముద్రం, పసిఫిక్, పశ్చిమ హిందూ సముద్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. కాగా, ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ మేర కట్టడి చేసేందుకు ప్రపంచ దేశాలతో కలిసి ఐక్యరాజ్యసమితి చర్యలు చేపడుతోంది.

కోటికి చేరువలో 'జగనన్న సురక్ష'

నేటితో ముగియనున్న కార్యక్రమం

సాక్షి, అమరావతి: ఏపీలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 1.38 కోట్ల కుటుంబాలను ఇంటి వద్ద కలుసుకోవడం ద్వారా పెండింగ్ సమస్యలు లేకుండా అధికార యంత్రాంగం ప్రతి ఇంటినీ జల్లెడ పట్టింది. జూన్ 23వ తేదీన సీఎం జగన్ మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం నేటితో (జూలై 31వ తేదీ) ముగియనుంది. రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా శనివారం నాటికే 15,002 సచివాలయాల వద్ద మండల స్థాయి అధికారుల స్థాయిలో ప్రత్యేక వినతుల పరిష్కార క్యాంపులు పూర్తయ్యాయి. సోమవారం మిగిలిన 2 సచివాలయాల వద్ద క్యాంపులు కొనసాగుతాయని సచివాలయాల శాఖ అధి కారులు వెల్లడించారు. విద్యాసంస్థల్లో అడ్మిషన్లు జరుగుతున్న తరుణంలో విద్యార్థులకు అవసర మయ్యే ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలతో పాటు మొత్తం 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఈ క్యాంపుల ద్వారా ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా ఉచితంగా అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 59 లక్షల కుటుంబాలకు చెందిన దాదాపు కోటి మందికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూర్చారు. 99.80 లక్షల టోకెన్లు జారీ కాగా క్యాంపులు జరిగిన రోజు అధికారుల వద్దకు 95.96 లక్షల వినతులు ప్రస్తావనకు వచ్చాయి. ఇందులో 92.97 లక్షల వినతులను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలినవి వివిధ దశల్లో పరిశీలన కొనసాగుతోంది.

29 ఏళ్లుగా వేధిస్తున్నారు..



- మాజీమంత్రి నారాయణపై రాయదుర్గం పీఎస్‌లో కృష్ణప్రియ పొంగూరు ఫిర్యాదు
- బావ నారాయణ, భర్త మణి అరాచకాలకు పాల్పడ్డారు
- పెళ్లి అయిన రెండో రోజు నుంచే నారాయణ సాధింపు
- లొంగకపోవడంతో వేధింపులు
- నారాయణపై మరోసారి ఆయన మరదలు తీవ్ర ఆరోపణలు

గచ్చిబౌలి (హైదరాబాద్): ఏపీ మాజీమంత్రి పొంగూరు నారాయణపై ఆయన తమ్ముడు సుబ్రహ్మణ్యం భార్య కృష్ణప్రియ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 29 ఏళ్లుగా నారాయణ, భర్త సుబ్రహ్మణ్యం అలియాస్ మణి తనను మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నారని ఆదివారం ఉదయం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న తాను ఎదుర్కొన్న అనుభవాలను పోస్టు చేశానని, రాజకీయంగా వారికి ఇబ్బంది కలుగుతోందని భావించి తన ఇన్‌స్టాగామ్ అకౌంట్‌ను మూసివేశారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం గచ్చిబౌలిలోని బాంబూస్ మీనాక్షి విల్లాస్ ఎదుట కృష్ణప్రియ మీడియాతో మాట్లాడారు. ఆమె ఏమన్నారంటే.. పెళ్లైన రెండో రోజు నుంచే బావ నారాయణ లైంగిక వేధింపులు మొదలుపెట్టాడు. ఆయనకు లొంగకపోవడంతో 29 ఏళ్లుగా ఆయన పెట్టే బాధలు భరిస్తున్నాను. ఆయన స్త్రీలోలుడు. నారాయణ విద్యా సంస్థల్లో పనిచేసే కొందరు మహిళలు ఆయన దగ్గరకు వెళ్లాల్సిందే. సోదరి వరుసైన వారు స్నానం చేస్తున్నప్పుడు బాత్‌రూమ్‌లోకి తొంగి చూసేవాడు. ఈ విషయం మొదట్లో వాళ్ల వాళ్లే చెప్పారు. నేను లొంగకపోవడంతో వేధింపులు ప్రారంభించాడు. నాకు మానసిక సమస్య ఉన్నట్లుగా నా భర్త తప్పుడు సర్టిఫికెట్లు చూపించి యూట్యూబ్ వేదికగా ప్రచారం చేయడం చాలా బాధేసింది. నారాయణ మెడికల్ కాలేజీలో పనిచేసే డాక్టర్ శేషమ్మ నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకురావడం వారికి పెద్ద సమస్య కాదు. అలాగే, నారాయణ పిల్లలకు మానసిక సమస్యలు ఉన్నాయి. డాక్టర్ విరించి వారికి చికిత్స చేస్తున్నారు. విరించి నుంచి కూడా సర్టిఫికెట్ తేవడం పెద్ద కష్టమేమీ కాదు. ఒకరోజు మా నాన్నపై అరుస్తుంటే గుంటూరులో ఓ డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. నిద్రలేమితో నిద్రమాత్రలు వేసుకుంటున్నట్లు డాక్టర్‌కు చెప్పాను. మానసిక ఒత్తిడితోనే నిద్రలేమి సమస్య ఉండవచ్చని డాక్టర్ చెప్పారు. నేను ఇటీవల ఏఐజీ ఆస్పత్రిలో చేరిన విషయం నిజమే. ఇక రక్త సంబంధం ఉంది కాబట్టే నారాయణకు నా భర్త పెట్‌గా మారాడు.

కేసు నమోదు చేయలేదు : సీఐ

మరోవైపు.. కృష్ణప్రియ ఫిర్యాదును పరిశీలిస్తున్నామని, ఇప్పటివరకు ఎలాంటి కేసు నమోదు చేయలేదని రాయదుర్గం సీఐ మహేష్ తెలిపారు.

మానసిక స్థితి బాగోలేదంటూ వీడియోలు

- కృష్ణప్రియపై వీడియో విడుదల చేసిన ఆమె భర్త సుబ్రహ్మణ్యం
- నారాయణ పన్నాగంపై నెటిజన్లు, మహిళా సంఘాల మండిపాటు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ మాజీమంత్రి పొంగూరు నారాయణ చీకటి బాగోతాన్ని బయటపెట్టి సంచలనం సృష్టించిన అతని మరదలు కృష్ణప్రియ మానసిక పరిస్థితి బాగోలేదంటూ ఆమె భర్త సుబ్రహ్మణ్యం తాజాగా విడుదల చేసిన ఓ వీడియో వైరల్‌గా మారింది. నారాయణ వికృత చేష్టలను సోషల్ మీడియా వేదికగా ప్రియ గత నాలుగు రోజులుగా వెలుగులోకి తెస్తున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై మహిళా సంఘాలు మండిపడుతున్నాయి. రాజకీయ వర్గాలు కూడా నారాయణ చేష్టలను అసహ్యించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పరువుపోయిన నారాయణ కృష్ణప్రియపై ఓ పథకం ప్రకారం ఆమె మానసిక స్థితి బాగోలేదని ముద్రవేయించేలా చేశారు. ఇందులో భాగంగా.. కృష్ణప్రియ భర్త అయిన తన సోదరుడు సుబ్రమణ్యంతోనే ఆమె మానసికస్థితి బాగోలేదని, అందుకే అలా మాట్లాడుతోందని.. తన భార్య మాటలు ఎవరూ పట్టించుకోవద్దంటూ వీడియో రిలీజ్ చేయించి సోషల్ మీడియాలో విడుదల చేశారు. కానీ, నారాయణ పన్నాగంపై నెటిజన్లు, మహిళా సంఘాల నేతలు మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే.. పెళ్లయిన నాటి నుంచి కృష్ణప్రియను మానసికంగా, శారీరకంగా వేధించడంవల్లే ఆమె మానసిక పరిస్థితి సరిగా లేకుండాపోయిందని ఆమె కుటుంబసభ్యులు చెబుతున్నారు.

నారాయణపై చర్యలు తీసుకోవాలి..

మహిళలను వేధించే వారు ఏ స్థాయిలో ఉన్న వ్యక్తులైనా సరే వారిపై చర్యలు తీసుకోవాల్సిందే. నారాయణ తన సోదరుడి భార్యను మానసికంగా, శారీరకంగా వేధించడం బాధాకరం. ఎందరికో విద్యాబుద్ధులు నేర్పే గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న వ్యక్తి మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం సిగ్గుచేటు. నారాయణపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.

– పాల జ్యోతి, మహిళా సంఘం నాయకురాలు, నెల్లూరు

హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి


నినాదాలు చేస్తున్న ఆదివాసీ పెద్దలు

- ఆగస్టు 9న కేస్లాపూర్‌లో భారీ బహిరంగసభ
- ఆదివాసీ తొమ్మిది తెగల ఉమ్మడి జిల్లా సమన్వయకర్త సిడాం భీంరావ్

ఇంద్రవెల్లి: హక్కుల సాధన కోసం ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించాలని ఆదివాసీ తొమ్మిది తెగల ఉమ్మడి జిల్లా సమన్వయకర్త సిడాం భీంరావ్ పిలుపునిచ్చారు. మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాలు, రాయిసెంటర్ సార్‌మెడీలు, గ్రామాల పటేళ్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ముందుగా ఆదివాసీ సమస్యలు, హక్కులపై పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న కేస్లాపూర్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతీనెల నాల్గో శనివారం రాయిసెంటర్ పెద్దలతో కలెక్టర్, ఐటీడీఏ పీవో సమావేశమై ఆదివాసీ సమస్యలపై చర్చించాలన్నారు. తుడుందెబ్బ జిల్లా కమిటీ, ఇంద్రవెల్లి మండల కమిటీలను రద్దు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భీంరావుతో పాటు పలువురు మాట్లాడారు. ఆదివాసీల హక్కులను కాలరాస్తున్న లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సుప్రీంకోర్టులో వేసిన కేసు ఆగస్టు 11న విచారణకు వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం ముత్నూర్ గ్రామానికి చేరుకొని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఎంపీ సోయం బాపూరావ్‌పై లంబాడాలు విమర్శలు చేస్తే ఆదివాసీ సమాజం ఊరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శులు ముక్తిరాజు, కోడెం వెంకటేశ్వర్లు, కోడప నగేష్, జిల్లా గౌరవ అధ్యక్షుడు అర్క ఖమ్ము, ఆదివాసీల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొంది వెంకటరమణ, ఉపాధ్యక్షుడు అనక దేవేందర్, జిల్లా అధ్యక్షులు కనక రామారావ్, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ వీరమల్లు, రిటైర్డ్ అదనపు ఎస్పీలు సీతారాములు, సెడ్మకి గోద్రు, జిల్లా సార్‌మెడీ మెస్రం దుర్గు, సార్‌మెడీలు మెస్రం వెంకట్‌రావ్, తుమ్రం జుగాదిరావ్, మెస్రం చిన్ను, మెస్రం సుదర్శన్, ఆదివాసీ సంఘాల నాయకులు నాగ్‌నాథ్, తోడసం నాగోరావ్, పెందోర్ మానిక్‌రావ్, రాందాస్ ఉన్నారు.

జోడేఘాట్‌ను సందర్శించిన జాన్‌వెస్లీ


భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న జాన్‌వెస్లీ

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని కుమురం భీం పోరాట గ్రామమైన జోడేఘాట్‌ను ఆదివారం పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ జాన్‌వెస్లీ సందర్శించారు. భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుమురం భీం మ్యూజియంను పరిశీలించారు. ఆదివాసీల ఆభరణాలను తిలకించారు. భీం జీవిత చరిత్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివగూడలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మాడెల్ గృహాలను పరిశీలించారు. ఆయన వెంట సెర్ప్ ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీవో మహేందర్, ఎంపీవో సుదర్శన్, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర మోసగాడి అరెస్ట్

- మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరుతో మోసం
- రూ.కోట్లు దండుకున్న రమేశ్‌చారి
- ఐదేళ్ల క్రితం పీడీయాక్టు
- అయినా మారని తీరు
- రాజన్నసిరిసిల్ల జిల్లాలో 11 కేసులు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: రెండు తెలుగు రాష్ట్రాల్లో మల్టీ లెవల్ బిజినెస్ పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసి మోసానికి పాల్పడ్డ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్‌కు చెందిన కట్టుకోజుల రమేశ్ అలియాస్ రమేశ్‌చారిని సిరిసిల్ల పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. సైబర్ మోసాల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న అంతర్‌రాష్ట్ర మోసగాడీని అరెస్ట్ చేయడంతోపాటు బ్యాంక్ అకౌంట్స్ సీజ్ చేసినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 19 కేసులుండగా, సిరిసిల్లలో 11 కేసులు నమోదయ్యాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదివారం వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్‌కు చెందిన కట్టుకోజుల రమేశ్ అలియాస్ రమేశ్‌చారి ఆన్‌లైన్‌లో తక్కువ ధరలకు ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారం ఇప్పిస్తానంటూ డబ్బుల వసూలుకు పాల్పడ్డాడు. మన తెలంగాణ ఫుడ్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ ప్రొడక్ట్స్ పేరిట 2022లో మల్టీ లెవల్ బిజినెస్‌ను ప్రారంభించాడు. జిల్లాలో 2023లో రమేశ్‌చారిపై 11 కేసులు, 2018లో జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట జిల్లాల్లో మరో 8 కేసులు నమోదయ్యాయి. ఇతనిపై గతంలో పీడీ యాక్టు నమోదు చేయగా జైలు జీవితం గడిపి బయటకు వచ్చాడు.

ఫేస్‌బుక్ ఆధారంగా ఫేక్ దందా

ప్రైవేటు టీచర్‌గా పనిచేసే రమేశ్‌చారి అదనంగా ఫుడ్‌ప్రాసెసింగ్ వర్క్ చేస్తుండేవాడు. ఆ డబ్బులు సరిపోకపోవడంతో ఈజీ మనీ కోసం ఆన్‌లైన్‌లో వివిధ వస్తువులను ఆఫర్‌లో తక్కువ ధరకు కొనుగోలు చేసి తన ఫేస్‌బుక్ ఐడీ, వివిధ సోషల్ మీడియా వేదికలుగా అతి తక్కువ ధరకు విక్రయిస్తానని నమ్మబలికేవాడు. ఇలా తన మోసాలకు తెరలేపాడు.

నేరం చేసిందిలా..

రమేశ్‌చారి ఒక వెబ్‌సైట్ ఓపెన్‌చేసి ఫేస్‌బుక్‌లో ఒక ఐడీ ఏర్పాటు చేసుకుని.. 83329 24133, 87900 97813 నంబర్లతో లింక్ చేసి బిజినెస్‌ను మొదలుపెట్టాడు. వస్తువులు కావాలన్న వారికి మొదట్లో తక్కువ ధరకు సరఫరా చేసి వారి నమ్మకాన్ని పొందేవాడు. మరిన్నీ వస్తువులు కావాలన్నప్పుడు డబ్బులు వసూలు చేసి వస్తువులు పంపించకపోగా, డబ్బులు సైతం తిరిగిచ్చేవాడు కాదు. ఇదే కాకుండా తన వద్ద గోల్డ్‌స్మిత్ కార్డు ఉందని.. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని పెద్ద మొత్తంలో డబ్బులు వసూలుకు పాల్పడ్డాడు.

పట్టుబడిందిలా..

రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన ఆదర్శ్‌గౌడ్ ఫిర్యాదుతో ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా సీఐ సదన్‌కుమార్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్సై జునైద్ ప్రత్యేక బృందంగా ఏర్పాడి దర్యాప్తు ప్రారంభించారు. రమేశచారి హైదరాబాద్‌లో ఉన్నాడని తెలిసి అతని అనుచరుడు ద్వారా పట్టుకునేందుకు ప్రయత్నించారు. జిల్లాలో ఉన్న లింకులతో మళ్లీ డబ్బులు ఇస్తామని ఆశచూపి నిందితున్ని శనివారం అదుపులోకి తీసుకున్నారు. సమావేశంలో డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ సదన్‌కుమార్, ఎస్సై శేఖర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వమే ఆదుకోవాలి

- టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వమే ఆదుకోవాలని టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రీజినల్ సమావేశాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని తిరుమల గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్‌రెడ్డి మాట్లాడుతూ.. యాజమాన్యం నిరంకుశంగా వ్యవరిస్తూ కార్మిక చట్టాలను పక్కనపెట్టి అత్యవసర సమయంలో సెలవు కూడా ఇవ్వకుండా ఉద్యోగులను వేధిస్తోందని ఆరోపించారు. 8 గంటలకు బదులు 12 గంటలు పని చేయించుకుంటోందని విమర్శించారు. ఉద్యోగులు దాచుకున్న సీసీఎస్ డబ్బులు రూ.11వేలను యాజమాన్యం వాడుకుందని ఆరోపించారు. ఈ డబ్బులను తక్షణమే సీసీఎస్‌కు అప్పగించి ఉద్యోగులకు రావాల్సిన రెండు పీఆర్సీలను వెంటనే అమలు చేయాలని కోరారు. సీఎం కేసీఆర్ చొరవ తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ యూనియన్ ఆదిలాబాద్ రీజియన్ కార్యదర్శిగా నిర్మల్ డిపోకు చెందిన ఆర్.గంగాధర్‌ను ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏఆర్ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు కమలాకర్ గౌడ్, కోశాధికారి రాఘవరెడ్డి, సలహాదారు యాదయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎల్.రమేశ్, ఆదిలాబాద్ రీజియన్‌లోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్, భైంసా, ఉట్నూర్ డిపోల ఉద్యోగులు పాల్గొన్నారు.


గంగాధర్‌కు నియామకపత్రం ఇస్తున్న సభ్యులు

ఆదివాసీ దినోత్సవం అధికారికంగా నిర్వహించాలి

- పద్మశ్రీ కనక రాజు, ఆదివాసీ సంఘాల డిమాండ్

నార్నూర్(జైనూర్): ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని పద్మశ్రీ కనక రాజు, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెస్రం మోతిరాం డిమాండ్ చేశారు. ఆదివారం జైనూర్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి ప్రకటించిన అంతర్జాతీయ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఆగస్టు 1న అన్ని తెగల ఆదివాసీలతో పాటు జైనూర్, సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల ఆదివాసీలతో ఆత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధనతో పాటు ప్రపంచ ఆదివాసీ దినోత్సవంపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో రాయిసెంటర్ సార్‌మెడి జుగ్నాక దేవురావ్, సర్పంచులు మెస్రం నాగోరావు, ఆత్రం జాలీంషా, నాయకులు కనక వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కనక రాజు

మార్గదర్శనం చేసే బాల సాహిత్యం రావాలి

- బాల సాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్
- 'బాలగేయ సారస్వతం' ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న కవులు

కరీంనగర్ కల్చరల్: పిల్లలు ఏం నేర్చుకోవాలి, ఏది నేర్చుకోకూడదు, ఏది మంచి, ఏది చెడు తదితర విషయాలను తెలియజేసి, మార్గదర్శనం చేసే బాల సాహిత్యం రావాలని తెలంగాణ రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కార గ్రహీత, బాలసాహితీవేత్త డాక్టర్ కందేపి రాణీప్రసాద్ అన్నారు. ఆదివారం భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన బాలగేయ సారస్వతం అనే బాలగేయాల సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలసాహిత్య కుటుంబంలోకి సంకలనంలోని 116 కవులను స్వాగతిస్తూ, బాలల ఎదుగుదలలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న మహిళలు బాల సాహిత్య రచనలు చేయాలని ఆకాంక్షించారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ-గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ హైదరాబాద్ వారు ప్రచురించిన 2023 బాపు డైరీని ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా హాజరైన అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. లయతో కూడిన మాత్రాయుక్తమైన గేయాలు పిల్లలను ఆకర్షిస్తాయని, బాలల్లో మంచి విలువలను పెంపొందించేలా బాల గేయాలు రాయాలన్నారు. వస్తువు ఎంపికలో ప్రస్తుత పరిస్థితులను, బాలల అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. పెండోట వెంకటేశ్వర్లు, గంగుల శ్రీకర్, డాక్టర్ వాసరవేణి పర్శరాములు, స్తంభంకాడి గంగాధర్, గంప ఉమాపతి, సామల కిరణ్, సంకెపల్లి నాగేంద్రశర్మ, గుండు కోటేశ్వరరావు, బొమ్మకంటి కిషన్, మానుపాటి రాజయ్య, నారోజు వెంకటరమణ, ఈర్ల సమ్మయ్య, పెంచాల రంగారావు, వెల్మల జయపాల్ రెడ్డి, విలాసాగరం రవీందర్, పి.సునీత, భవానీశర్మ, మాంకాళి సుగుణ, మాసం సీమ, కోట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ కవులకు సినారె పురస్కారాలు



వేణుశ్రీ, హరిదాసులకు పురస్కారాలు అందిస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్: జడ్చర్లకు చెందిన మహాకవి సినారె కళాపీఠం ఆధ్వర్యంలో సినారె 192వ జయంతి సందర్భంగా ఆదివారం జడ్చర్లలో కరీంనగర్‌కు చెందిన ఇద్దరు కవులకు పురస్కారాలు అందజేశారు. స్వేచ్ఛా కవి సుదర్శనం వేణుశ్రీకి ప్రత్యేక సినారె సాహిత్య పురస్కారం, పరిశోధకుడు, కవి డాక్టర్ మచ్చ హరిదాసుకు కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి సినారె సాహిత్య పురస్కారాన్ని అతిథులు సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి, సంగీత నాటక అకాడమీ తొలి అధ్యక్షుడు బాదిని శివకుమార్, పట్టణ జాతీయ సాహిత్య పరిషత్ కార్యదర్శి కిరణ్మయి, తేజ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, పీఠం అధ్యక్షుడు మల్లెవేడి శ్రీరాములు చేతులమీదుగా అందజేశారు. ఇద్దరికీ ఉమ్మడి జిల్లాకు చెందిన పలు వురుకవులు, రచయితలు అభినందనలు తెలిపారు.

మంచిమాట

గెలవాలి అని మనం దృఢంగా నిర్ణయించుకోవాలి; మనం మన స్ఫూర్తిగా గెలుపును కోరుకోవాలి; మనం గెలిచేందుకు త్రికరణ శుద్ధిగా పూనుకోవాలి; మనం గెలవాలి. మనకు మనుగడ ఉంది అని అంటే అది గెలుస్తూ ఉండేందుకే అని తెలుసుకోవాలి. ఎన్ని అవరోధాలు ఉన్నా, ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా, ఎంత వ్యతిరేకత పైనపడినా మనం గెలవాలి అని నిలవాలి; మనం గెలుస్తూ మెరుస్తూ ఉండాలి.



గెలుపు.. గమనం.. మలుపు

'యమే వైష వృణుతే తేన లభ్యస్తైష ఆత్మా వివృణుతే తనూమ్ స్వామ్' అని కఠోపనిషత్ చెబుతోంది. అంటే అతడి చేత ఏదైతే కోరుకోబడి అడగబడిందో దానివల్ల అతడు పొందబడతాడు; అతడికి ఆ ఆత్మ తన సహజ ప్రకృతిని తెరుస్తుంది అని అర్థం. ఈ సత్యాన్నే తెలియజేస్తూ 'అడుగుడీ మీకియ్యబడును; వెదకుడీ మీకు దొరకును; తట్టుడీ మీకు తియ్యబడును' అని చెప్పింది మత్తయి సువార్త. మనం గెలుపును కోరుకుని ప్రయత్నిస్తే మనకు గెలుపు తన తలుపును తెరుస్తుంది. మనం గెలుపును పొందాలనుకుని ఉద్యుక్తులం ఐతే మనం గెలుపు చేత పొందబడతాం.

మనం ఉన్న ఈ ప్రపంచం ఒక పద్మవ్యూహం. కానీ మనలో ఎవరూ అభిమన్యుడు కారాదు. ప్రతివ్యక్తీ అర్జునుడే అవాలి; అర్జునుడి తీరే మనకు ఆదర్శం కావాలి; మనకు మార్గదర్శకం కావాలి. తాను ఏ స్థితిలో ఉన్నా, శాపవశాత్తు తన స్థితే మారి తాను పేడిగా మారిపోయినా అర్జునుడు గెలుపునే కోరుకుని, గెలిచేందుకు పూనుకుని గెలుపు తలుపును తట్టాడు. గెలుపు తలుపు తెరుచుకోబడి ఆ గెలుపుచేత పొందబడ్డాడు; అర్జునుడు విజయుడుగా పేరు పొందాడు.

గెలుపు అనేది లక్ష్యమా? కాదు, కాదు. గెలుపు లక్ష్యంగా కాదు మనకు లక్షణంగా ఉండాలి. మనుగడ ఉన్నంతవరకూ మనం గెలుపు కోసమే, గెలుపుతోనే రోజుల్ని గడుపుతూ ఉండాలి. రోజు అనేది రావడమే ఒక గెలుపు. అదిగో ఆ రోజు రావడమే మనకు ప్రేరణ. రోజు లాగా మనుగడ ఆసాంతమూ మనకు గెలుపు అనేది వస్తూనే ఉండాలి. రోజు ఒకసారి మాత్రమే వచ్చేదే ఐతే కాల గమనమూ, ప్రపంచ గమనమూ ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకుందాం. అలా జరిగితే కాలానికి, ప్రపంచానికి గమనమే ఉండదు కదా? రోజు అనేది వస్తూ ఉండడమే గమనం జరుగుతోంది అన్నదానికి ఋజువు. మనకు గెలుపు వస్తూ ఉండడమే మనుగడ గమనాన్ని నిర్ధారణ చేస్తుంది. పొందే ప్రతి గెలుపు మనిషికి ఒక మలుపు. మలుపులు తిరుగుతూ పయనం సాగాలి. గెలుపులతో సాగడమే మనుగడకు సార్థకత.

మనుగడ అన్నది ఒక సాగే తీగ అయితే ఆ తీగకు గెలుపుల పూలు పూస్తూ ఉండాలి. మనుగడ గెలుపుల పూలు పూచే ఒక వల్లరి కావాలి లేదా మనుగడ గెలుపుల పుష్పగుచ్ఛం కావాలి. గెలుపుల పూల పరిమళానికి ఆకృతిగా మనిషి మంచి మాట కెక్కాలి.

'గెలుపును పొందాలని తలపోద్దాం; గెలుపును పొందుదాం. గెలుస్తూ ఉన్నవాళ్లమై తల ఎత్తుకుని మనుగడ చేద్దాం; మన తలలకు విలువను పొదువుకుందాం. గెలుపు మనకు అభిరుచి కావాలి; గెలుపును మనం చవి చూస్తూ ఉండాలి; మనం మనుగడకు చవిని చేకూర్చుకోవాలి'.

100% – నేను గెలిచాను.
90% – నేను గెలుస్తాను.
80% – నేను గెలవగలను.
70% – నేను గెలవగలను అని అనుకుంటున్నాను.
60% – నేను గెలవగలనేమో.
50% – నేను గెలవచ్చేమో అని అనుకుంటున్నాను.
40% – ఏది గెలుపు?
30% – నాకు గెలవాలని ఉంది.
20% – ఎలా గెలవాలో నాకు తెలియదు.
10% – నేను గెలవలేను.
0% – నేను గెలవను.

ఇది గెలుపునకు నిచ్చెన. మనిషి ఈ నిచ్చెనను ఎక్కాలి; తప్పకుండా ఈ నిచ్చెనను ఎక్కి తనను తాను మనిషిని అని నిరూపించుకోవాలి.

– రోచిష్మాన్

గురువాణి

తప్పులు చేయకపోతే...???

సర్వసాధారణంగా లోకంలో ..ఎవరయినా విజయం సాధిస్తే..దానికి వారు ఎంత కష్టపడిందీ పదేపదే చెప్పుకుని పొంగిపోతుంటారు. అది సహజం కూడా. కానీ అపజయం ఎదురయితే మాత్రం... 'మనం చేయాల్సింది చేశాం కానీ ఫలితం లేకపోయింది' అంటారు.. అంటే విజయం అయితే తన స్వంతం. అదే వైఫల్యం చెందితే అందరినీ కలుపుకుంటారు. తన వైఫల్యాన్ని అంగీకరించరు..ఇది కూడా ఎక్కువగా చూస్తుంటాం. కానీ విశ్వవిఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ విజేత, రామన్ ఎఫెక్ట్ సృష్టికర్త సర్ సివి రామన్ ఏమంటారంటే... ''ఎక్కడ నేను వైఫల్యం చెందానో దానికి యజమానిని నేను. నేనే కర్తను, నేనే భోక్తను, నేనే దానికి పూర్తిగా బాధ్యుణ్ణి. అసలు నేను వైఫల్యం చెందకపోతే .. నేను నేర్చుకోవడం ఎలా సాధ్యపడుతుంది!!!''– అని.

దిద్దుకుందామన్న స్పృహ లేకపోతే దోషం కానీ, దిద్దుకోవడానికి సిద్ధంగా ఉండి.. తాను పొందిన వైఫల్యాలను అనుభవంగా స్వీకరించి, అది నేర్పిన పాఠాలతో మరింత జాగ్రత్తగా తమ ప్రయత్నాలను కొనసాగిస్తానంటే... ఇక సమస్యే ముంది!!! నిజానికి అందరిలో ఉండాల్సిన లక్షణం అది.

సుందరకాండలో స్వామి హనుమ... ''నాలుగు అంగుళాలు కూడా వదలకుండా లంకా పట్టణమంతా గాలించేసాను. సీతమ్మ కనబడలేదు. అంటే సీతమ్మ ఇక్కడ లేదేమో.. సీతమ్మ క్షేమ సమాచారం లేకుండా నేను తిరిగి వెడితే..అక్కడ రాముడు



శరీరం వదిలేస్తాడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, కౌసల్య, సుమిత్ర, కైకేయి, కోసల రాజ్య ప్రజలు, వానర రాజ్యంలో ఉన్నవాళ్ళు...అందరూ హతాశులైపోతారు. నేను వెళ్ళి సీతమ్మ సమాచారం దొరకలేదని చెప్పి ఇంతమందిని బాధపెట్టడం కంటే ఈ సముద్రపు ఒడ్డున కూర్చుని ప్రాయోపవేశం చేస్తాను. శరీరం వదిలేస్తాను'' అన్నాడు... హనుమ అంత బలశాలి లంకంతా వెతికి సీతమ్మజాడ తెలియక పోతే... ఎంత నిరాశ, ఎంత నిస్పృహ ... అది కొద్దిసేపే... వెంటనే తన బాధ్యతలను గుర్తు చేసుకున్నాడు.. 'అసలు మనిషికి శోకం పొందకుండా ఉండడం, బాధ పడకుండా ఉండడం, వైఫల్యానికి బాధపడినా దాన్ని విడిచి మళ్లీ... దిద్దుకుని ఉత్సాహం పొంది ఎక్కడ వైఫల్యం చెందాడో అక్కడ తిరిగి విజయం అందుకోవడానికి సాధన మొదలుపెట్టడం ముఖ్యం' అనుకున్నాడు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఎక్కడ వస్తువు పోగొట్టుకున్నామో అక్కడ వెతికితే ఫలితం... ఎక్కడ వైఫల్యం చెందామో అక్కడ విజయం సాధిస్తే అది ఇచ్చే తృప్తి, అది నేర్పిన పాఠం, అది నేర్పిన అనుభవం ఎప్పటికీ గుర్తుండిపోతాయి... అటువంటి పరిస్థితులు ఎదురయినప్పుడు మరింత స్ఫూర్తినిస్తాయి... అన్న వివేకం మనల్ని ముందుకు నడిపించడమే గాక మరిన్ని విజయాలను రుచి చూపిస్తుంది. అంతే తప్ప నేనేది చేసినా ఇంతే... అయినా నాకా శక్తి ఎక్కడిది.. అని నిరాశపడితే జీవితం ముందుకు కదలదు.

మేడమీద ఉన్న కిటికీలోంచి ఇద్దరు వ్యక్తులు బయటికి చూస్తే... ఒకడికి కింద ఉన్న బురదనేల, మురికి కనిపించి నిరాశపరిస్తే.. మరొకడికి ఆకాశంలో నక్షత్రాలు, చంద్రుడు, వెలుగులు కనిపించి మురిపిస్తాయి. వాళ్ళ దృక్పథాల్లోనే తేడా.. ఆశావాదం ఉన్న వాళ్లు జీవితంలో వృద్ధిలోకి వస్తారు... నిరాశావాదులు నిరాశను ప్రయత్నపూర్వకంగా వదిలించుకోవాలి. రామన్ చెప్పినట్లు వైఫల్యాలను మనసారా అంగీకరిస్తే... అది మనల్ని ఎన్నటికీ నిరాశపరచకపోగా... కొత్త శక్తినిస్తుంది.

తాత్త్వికథ

తల్లి ప్రేమ

కార్తీక మాస సాయంత్రం. రాగి రంగులో శేషాచలం కొండ మెరుస్తూ ఉంది. కొందరు భక్తులు కపిల తీర్థం జలధార కింద స్నానం చేస్తున్నారు. మరికొందరు కోనేరు దగ్గర మట్టి ప్రమిదలలో నేతిదీపాలు వెలిగిస్తున్నారు. అక్కడే మెట్ల మీద కూర్చున్న ఓ పండితుడు తన శిష్యుడితో కార్తీకమాసం విశిష్టత గురించి వివరిస్తున్నాడు.


ఇంతలో ఆకాశంలోకి చందమామ తొంగి చూడటం ప్రారంభించాడు. వెండి వెలుగులో ఉన్న అక్కడి వారంతా వెన్నెల స్నానం చేస్తున్నట్లుగా ఉంది.

ఆ చల్లటి వెన్నెలకు పరవశించిన పండితుడు, తన శిష్యుడితో ''చంద్రుడి వెలుగుకు మించింది ఈ ప్రపంచంలో ఏదీ లేదు'' అన్నాడు.

అక్కడే దీపం వెలిగిస్తున్న ఓ మహిళ, పండితుడి మాటలు విని సరుక్కున తల తిప్పి చూసింది. ''అదేం మాట?'' అని చెప్పి తన పని తాను చేసుకుంటూ ఉంది.

పండితుడు లేచి ఆమె దగ్గరికి వెళ్ళి ''వెన్నెల మెరుపును మించింది ఏమైనా ఉంటే చెప్పమ్మా?'' అని ప్రశ్నించాడు.

ఇంట్లో చాలా పనులున్నాయని ఆ మహిళ కుటుంబ సభ్యులు ఆమెను అక్కడినుంచి ఇంటికి తీసుకెళ్ళిపోయారు.



మరుసటిరోజు కూడా ఆ పండితుడు తన శిష్యుడితోటి కపిలతీర్థం జలధార చూడటానికి వచ్చి అక్కడే కూర్చున్నాడు. పాలమీగడ పాయలుపాయలుగా వర్షిస్తున్నట్లుగా ఉంది జలధార.

ఆరోజు కూడా ఆ మహిళ అక్కడికి వచ్చింది. ఆమె చంకలో నెలల బిడ్డ ఉన్నాడు. భక్తిగా దేవుడికి మొక్కి దీపారాధన చేస్తోంది.

ఆమె పూజ అయ్యేంతవరకు ఆగిన పండితుడు ''ఏవమ్మా, నిన్న నేను చంద్రుడి వెలుగుకు మించింది లేదని చెబితే నువ్వు ఒప్పుకోలేదు. కారణం తెలియలేదు. నేను ఎన్నో గ్రంథాలు చదివాను. పెద్దల ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చాలా విన్నాను. నేనెక్కడా చంద్రుడికి మించిన వెలుగు, అంతటి మెరుపు ఉంటాయని చదవలేదు, వినలేదు. నువ్వు చెబితే తెలుసుకుందామని ఉంది'' అని అడిగాడు.

ఆ మహిళ చిరునవ్వు నవ్వుతూ తన చేతిలోని బిడ్డకు కోనేరులోని చందమామను చూపింది. ఆ పిల్లవాడు ముసిముసినవ్వులు నవ్వినాడు.

ఆ పిల్లవాడి చేతితో, నీటిలో కనిపించే చందమామను తాకించింది. అలలు అలలుగా చందమామ పక్కకి వెళ్ళిపోయాడు. చందమామను పట్టుకోవాలని ఆ పిల్లవాడు నీళ్ళమీద ధబీధబీమని కొట్టినాడు. చందమామ దొరకలేదు. ''అదుగో... పైకి పాయె చందమామ'' అంటూ ఆకాశంలోని చందమామను చూపింది. ఆ బిడ్డ బోసినవ్వుతో కేరింతలు కొట్టినాడు. బిడ్డ కాలి వెండి గొలుసులు చిన్నగా మోగాయి.

అప్పుడు ఆ మహిళ తన బిడ్డ నవ్వును పండితుడికి చూపిస్తూ ''ఈ ప్రపంచంలో నా బిడ్డ మెరుపు ఎవరికైనా వస్తుందా?'' అని అడిగింది.

ఆమె మాటలకు ఆశ్చర్య పోయాడు ఆ పండితుడు.

''నిజమే... తల్లి ప్రేమ అలాంటిది. ఏ తల్లికైనా తన బిడ్డ ముఖంలోని మెరుపు, వెలుగుతో సమానమైనవి ఏవీ ఉండవు కదా...' అనుకుని చిన్నగా అక్కడి నుంచి తన శిష్యుడిని వెంటబెట్టుకుని కదిలాడు.

వెనుకనే ఆ మహిళ బిడ్డనెత్తుకుని ఆకాశం వైపు చూపిస్తూ ''చందమామ రావే... జాబిల్లి రావే...'' అని పాడే పాట తెరలు తెరలుగా వినిపిస్తోంది.

– ఆర్.సి.కృష్ణ స్వామి రాజు

సినిమా



● రజనీకాంత్

ఇక్కడ నేనే కింగ్!

రజనీకాంత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'జైలర్'. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 10న రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని 'హుకుమ్..' అంటూ సాగే పాట తెలుగు వెర్షన్ లిరికల్ వీడియోను హీరో వెంకటేష్ ఆదివారం షేర్ చేశారు. ''హే ఇక్కడ నేనే కింగ్.. నేను పెట్టినవే రూల్స్.. ఆ రూల్స్‌ని నేను అప్పుడప్పుడు ఇష్టానికి మారుస్తుంటాను. అది విని గప్‌చుప్‌గా ఫాలో అవ్వాలి, అది వదిలేసి ఏదైనా పిచ్చిపనులు చేయాలని చూశావో నిన్ను కండకండాలుగా నరికి విసిరిపారేస్తాను.. హుకుమ్.. టైగర్‌గా హుకుమ్..' అంటూ మొదలై, 'ఉరుముకి మెరుపుకి పుట్టాడురా.. పిడుగును పిడికిట పట్టాడు రా.. అడుగడుగున గుడి కట్టాలిరా... తర తర తరముల సూపర్ స్టార్ రా..' అంటూ సాగుతుందీ పాట. అనిరుధ్ రవిచంద్రన్ స్వరాలందించిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందిం



● ఎస్‌కేఎన్, వైష్ణవి చైతన్య, చిరంజీవి, విరాజ్ అశ్విన్, ఆనంద్ దేవరకొండ, సాయి రాజేష్

ఇండస్ట్రీకి కొత్త తరం రావాలి – చిరంజీవి

''సినిమా అభిమానులంటే ఒక రకమైన దురభిప్రాయం ఉన్నటువంటి సమయం నుంచి నేను ఈ పరిశ్రమను చూస్తున్నాను. ఈ హీరో ఫ్యాన్స్ ఆ హీరోని తిట్టుకోవడం, ఆ హీరో ఫ్యాన్స్ ఈ హీరోని తిట్టుకోవడం... ఈ క్రమంలో చదువులపై అశ్రద్ధ వహించి, జీవితంలో పైకి రావాలనే తపన లేకుండా ఉంటారని.. ఇలా సమాజంలో అభిమానుల గురించి దురభిప్రాయం ఉండేది. అలాంటివి నా చెవిన పడ్డాయి. అలాంటి సమయంలో నేను ఇండస్ట్రీలో నిలదొక్కుకుని నాకంటూ అభిమానులు ఏర్పడితే.. నా అభిమానులను చూసి, సమాజం గర్వపడేలా వారిని తీర్చిదిద్దాలని ఆ రోజు నేను నిర్ణయించుకున్నాను. అందులో భాగంగానే బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ వంటి మంచి సామాజిక కార్యక్రమాలు చేశాను. నా పిలుపు మేరకు వచ్చిన నా అభిమానుల గురించి వారి తల్లిదండ్రులు, సమాజం గర్వించేలా మాట్లాడటం చూస్తుంటే.. నా అభిమానులను చూసి నాకు ఎప్పుడూ గర్వంగానే ఉంటుంది'' అన్నారు చిరంజీవి. ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బేబి'. మాస్‌మూవీ మేకర్స్ పతాకంపై సాయిరాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ చిత్రం జూలై 14న విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 'బేబీ'విజయోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి మాట్లాడుతూ– ''పాత తరంతోనే ఇండస్ట్రీ ఉంటే అది వెనకబడిపోతుంది. కొత్త తరం రావాలి. అప్పుడే మన పరిశ్రమ నిరంతరం ముందుకు సాగిపోతూ ఉంటుంది. రాజమౌళివంటి దిగ్గజ దర్శకులు ఉన్నారు కాబట్టే మన తెలుగు సినిమాలు అంతర్జాతీయ స్థాయికి, ఆస్కార్ స్థాయికి వెళ్తున్నాయి. ఇది మనందరం గర్వించదగ్గ విషయం. వాళ్లను యువ దర్శకులు స్ఫూర్తిగా తీసుకుని కొత్త కంటెంట్‌తో రాగలిగితే అంతకు మించిన ప్రత్యుపకారం ఇండస్ట్రీకి మరొకటి ఉండదు. ఎస్‌కేఎన్, సాయి రాజేష్, మారుతి.. ఇలా నా అభిమానులను చూస్తుంటే నాకు ఎనలేని సంతోషం కలుగుతుంది. నా అభిమానులు చేసిన 'బేబి' ప్రయత్నం ప్రజాశీస్సులు పొంది, ఇంతటి విజయాన్ని సాధించింది. ఈ ఆనందంలో భాగం కావాలనే నేను ఇక్కడికి వచ్చాను. 'బేబి' ఎడ్యుకేషనల్ ఫిల్మ్‌లా అనిపించింది. చాలామంది యువత సోషల్ మీడియా ఆకర్షణలో పడిపోయి, సెల్ ఫోన్‌కు ఎడిక్ట్ అవుతున్నారు. యువతే కాదు..వారి తల్లిదండ్రులు కూడా ఈ మూవీని చూసి, ఇప్పుడున్న పరిస్థితులకు అన్వయించుకుని జాగ్రత్తలు తీసుకోవాలి'' అన్నారు. ''చిరంజీవిగారిని స్ఫూర్తిగా తీసుకుని ఇండస్ట్రీకి వచ్చిన మాకు, ఆయన మా సినిమా సక్సెస్‌మీట్‌కు రావడం సంతోషంగా ఉంది'' అని 'బేబి' చిత్రయూనిట్ పేర్కొంది.

స్టార్ట్ యాక్షన్



● ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ మూవీలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో 'దేవర' లోని ఓ యాక్షన్ షెడ్యూల్ పూర్తయింది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ షూటింగ్ ఆగస్టు తొలివారంలో ప్రారంభం అవుతుందనీ, ఓ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తారని టాక్. ఈ ఫైట్ ఇంట్రవెల్ సమయంలో వస్తుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా. స్టంట్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్స్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేయనున్నట్లు టాక్. అలాగే ఈ సినిమాలోని ప్రధాన తారాగణం అయిన సైఫ్ అలీఖాన్, జాన్వీకపూర్‌లతో పాటు, కొందరు కీలక పాత్రధారులపై ఈ షెడ్యూల్‌లోనే కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారట కొరటాల. 'దేవర' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది.



● శ్రీలీల

పోటీ లేదులే..



● 'కింగ్ ఆఫ్ కోత'లో ఓ దృశ్యం

'కొత్త ఊరిలో తోపు మనమే.. పోటీ లేదులే... కొట్టలేరులే..' అంటూ సాగే పాట 'కింగ్ ఆఫ్ కోత' చిత్రం లోనిది. దుల్కర్ సల్మాన్ హీరోగా అభిలాష్ జోషి దర్శకత్వంలో రూపొందిన మలయాళ యాక్షన్ చిత్రం 'కింగ్ ఆఫ్ కోత'. జీ స్టూడియోస్, వేఫేరర్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టులో విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'హల్లా మచారే' పాట తెలుగు వెర్షన్ లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందించగా, కృష్ణ కాంత్ సాహిత్యం సమకూర్చారు. ఎల్వీ రేవంత్, సింధూజ శ్రీనివాసన్ పాడారు.

స్పెషల్ ఆఫర్?

యంగ్ బ్యూటీ శ్రీలీలకు 'పుష్ప: ది రూల్' సినిమాలో యాక్ట్ చేసే ఓ స్పెషల్ ఆఫర్ వచ్చిందట. కథ రీత్యా ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్‌కు స్కోప్ ఉందట. ఈ పాటలో శ్రీలీల అయితే బాగుంటుందని సుకుమార్ అండ్ కో ఆమెను సంప్రదించారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. మరి.. ఈ స్పెషల్ ఆఫర్‌కు శ్రీలీల ఊ అంటారా..? ఊహూ అంటారా? అనేది తెలియాలంటే కొంత సమయం వేచి ఉండక తప్పదు. ఇక 'పుష్ప' చిత్రం తొలిపార్టు 'పుష్ప: ది రైజ్' లోని స్పెషల్ సాంగ్ 'ఊ అంటావా మావ.. ఊహూ అంటావా మావ..' పాటకు సమంత అదిరిపోయే స్టెప్పులు వేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'పుష్ప:ది రూల్'ను మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇందులో రష్మికా మందన్నా హీరోయిన్. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.



రిటైర్ అయిపోతే మంచిది

– కంగనా రనౌత్

'కరణ్ జోహార్.. ఫస్ట్ నువ్వు రిటైర్ అయిపో.. ప్రతిభ ఉన్న కొత్త వాళ్లకు అవకాశాలు కల్పించు.. వారు అద్భుతాలు సృష్టిస్తారు' అంటూ బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్ అన్నారు. రణవీర్ సింగ్, ఆలియా భట్ జంటగా కరణ్ జోహార్ దర్శకత్వం వహించిన 'రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ' ఈ నెల 28న విడుదలైంది. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కరణ్ జోహార్‌పై మండిపడ్డారు కంగనా రనౌత్. ''భారతీయ ప్రేక్షకులు మూడు గంటల సినిమాలో ఎన్నో వింతలు చూస్తున్నారు. కొందరు అద్భుతాలు సృష్టిస్తుంటే ఈ నెపోటిజం గ్యాంగ్ మాత్రం రూ.250 కోట్ల బడ్జెట్‌తో డైలీ సీరియల్స్ తీస్తున్నారు. 1990లలో తాను తీసిన చిత్రాలనే కాపీ కొట్టి రూ.250 కోట్ల బడ్జెట్‌తో సినిమా చేసినందుకు కరణ్ సిగ్గుపడాలి.. డబ్బులు ఎందుకు వృథా చేస్తున్నావ్? ప్రతిభ ఉన్న ఎంతో మంది యువత సరైన వనరులు లేక సినిమాలు తీయలేకపోతున్నారు. అలాంటి వాళ్లకి అవకాశం కల్పిస్తే కొత్త కథలతో మూవీస్ తీసి విప్లవాత్మక మార్పు తీసుకొస్తారు'' అన్నారామె. అలాగే రణ్‌వీర్ సింగ్‌ని ఉద్దేశించి–''డ్రెస్సింగ్ విషయంలో కరణ్‌ను ఫాలో కావొద్దు. ధర్మేంద్ర, వినోద్ ఖన్నా వంటి పెద్దలను స్ఫూర్తిగా తీసుకో. దక్షిణాది నటులను చూసి తెలుసుకో.. వాళ్ల లుక్‌లో ఓ డిగ్నిటీ, ఇంటిగ్రిటీ ఉంటాయి'' అన్నారు కంగనా.

టీఎఫ్‌సీసీ అధ్యక్షునిగా 'దిల్' రాజు



● 'దిల్' రాజు

తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి (టీఎఫ్‌సీసీ) నూతన అధ్యక్షునిగా నిర్మాత 'దిల్' రాజు ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని ఫిలించాంబర్ వద్ద ఆదివారం టీఎఫ్‌సీసీ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. 2023–2025 సంవత్సరాలకు (రెండేళ్లు) నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో నిర్మాతలు 'దిల్' రాజు, సి.కల్యాణ్ ప్యానల్స్ పోటీ పడ్డాయి. 'టీఎఫ్‌సీసీ'లోని నాలుగు విభాగాలకు చెందిన వారిలో 48 మంది సభ్యులు వేసే ఓట్లలో మేజిక్ ఫిగర్ 25 ఓట్లు దక్కించుకున్న వారు విజేతలవుతారు. ఈ క్రమంలో 'దిల్' రాజుకు 31 ఓట్లు వచ్చాయి. సి.కల్యాణ్‌కి 17 ఓట్లు వచ్చాయి. దీంతో అధ్యక్షుడిగా 'దిల్' రాజు విజయం సాధించారు. 'టీఎఫ్‌సీసీ' ఉపాధ్యక్షులుగా ముత్యాల రాందాసు, కొల్లి రామకృష్ణ, శ్రీనివాస్, కార్యదర్శిగా దామోదర ప్రసాద్ , కోశాధికారిగా ప్రసన్నకుమార్‌లను ఎన్నుకున్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు ఎన్నికలు జరిగాయి. సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగ్గా రాత్రి తుది ఫలితాలు వెలువడ్డాయి.

ఎన్నికల అనంతరం 'దిల్' రాజు మాట్లాడుతూ–''ఈ ఎన్నికలు రాజకీయ ఎన్నికలు కావు. సినిమా అన్నది వ్యాపారం. మా మధ్య పోటీ అన్నది ఈ ఒక్కరోజు మాత్రమే, రేపటి నుంచి అంతా కలిసి పనిచేస్తాం'' అన్నారు. ''ఈ ఎన్నికల్లో ఎగ్జిబిటర్లు 'దిల్' రాజుకు అమ్ముడు పోయారు.. అయినా నా మద్దతు 'దిల్' రాజుకి ఉంటుంది'' అని సి.కల్యాణ్ అన్నారు. ఇదిలా ఉంటే.. టీఎఫ్‌సీసీలోని 4 విభాగాల్లో (ప్రొడ్యూసర్స్, డిస్ట్రిబ్యూటర్స్, స్టూడియో, ఎగ్జిబిటర్స్) 2262 మంది సభ్యులకుగాను 1339 మంది ఓటు వినియోగించుకున్నారు. ప్రొడ్యూసర్స్ విభాగం అధ్యక్షుడిగా శివలెంక కృష్ణప్రసాద్, డిస్ట్రిబ్యూటర్స్ విభాగం అధ్యక్షుడిగా మిక్కిలినేని సుధాకర్, స్టూడియో విభాగం అధ్యక్షుడిగా ఈవీఎస్ చారి, ఎగ్జిబిటర్స్ విభాగం అధ్యక్షుడిగా టీఎస్ రాంప్రసాద్ ఎన్నికయ్యారు.



సిద్ధాంత గొగోయ్‌కు స్వర్ణం

ఆసియా యూత్, జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో పురుషుల 61 కేజీల విభాగంలో భారత లిఫ్టర్ సిద్ధాంత గొగోయ్ పసిడి పతకం సాధించాడు. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ఈ పోటీల్లో ఆదివారం సిద్ధాంత మొత్తం 265 కేజీలు (స్నాచ్‌లో 116+క్లీన్ అండ్ జెర్క్‌లో 149) బరువెత్తి విజేతగా నిలిచాడు. ఈ విభాగంలో భారత్‌కే చెందిన శంకర్ లాపుంగ్ (256 కేజీలు) కాంస్య పతకం గెల్చుకున్నాడు. మహిళల జూనియర్ 49 కేజీల విభాగంలో జ్ఞానేశ్వరి యాదవ్, మహిళల యూత్ 49 కేజీల విభాగంలో కోయల్ రజత పతకాలు సాధించారు.

అమన్-ప్రగతి జోడీకి పసిడి పతకం





ప్రపంచ విశ్వ విద్యాలయాల క్రీడల్లో భారత్‌కు నాలుగో స్వర్ణ పతకం లభించింది. ఆదివారం జరిగిన ఆర్చరీ ఈవెంట్‌లో కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో అమన్ సైని-ప్రగతి (భారత్) జోడీ పసిడి పతకం సాధించింది. ఫైనల్లో అమన్ సైని-ప్రగతి ద్వయం 157-156తో సువా చో-సెయుంగ్‌హున్ పార్క్ (కొరియా) జోడీపై గెలిచింది. కాంపౌండ్ పురుషుల టీమ్ విభాగంలో భారత్‌కు కాంస్యం, మహిళల టీమ్ విభాగంలో భారత్‌కు రజత పతకం లభించాయి.

వెర్‌స్టాపెన్ జోరు

సీజన్‌లో వరుసగా ఎనిమిదో విజయం

స్పా-ఫ్రాంకోర్‌చాంప్స్ (బెల్జియం): ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ తనకు ఎదురేలేదన్నట్లు దూసుకుపోతున్నాడు. ఆదివారం జరిగిన బెల్జియం గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ చాంపియన్‌గా నిలిచాడు. 44 ల్యాప్‌ల రేసును ఆరో స్థానం నుంచి ప్రారంభించిన వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంటా 22 నిమిషాల 30.450 సెకన్లలో ముగించి వరుసగా ఎనిమిదో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ సీజన్‌లో 12 రేసులు జరగ్గా వెర్‌స్టాపెన్ పది రేసుల్లో నెగ్గాడు. మరో రెండు రేసుల్లో రెడ్‌బుల్ జట్టుకే చెందిన సెర్జియో పెరెజ్ విజేతగా నిలిచాడు. శనివారం జరిగిన క్వాలిఫయింగ్‌లో వెర్‌స్టాపెన్ పోల్ పొజిషన్ సాధించినా... నిబంధనలకు విరుద్ధంగా కొత్త గేర్ బాక్స్ మార్చినందుకు అతనిపై ఐదు గ్రిడ్‌ల పెనాల్టీని విధించారు. దాంతో ఆదివారం జరిగిన ప్రధాన రేసును వెర్‌స్టాపెన్ ఆరో స్థానం నుంచి మొదలుపెట్టాడు. పెరెజ్ రెండో స్థానంలో, చార్లెస్ లెక్‌లెర్క్ (ఫెరారీ) మూడో స్థానంలో నిలిచారు. సీజన్‌లోని తదుపరి రేసు డచ్ గ్రాండ్‌ప్రి ఆగస్టు 27న జరుగుతుంది.





విజేత భారత్

బార్సిలోనా: స్పెయిన్ హాకీ సమాఖ్య శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన మూడు దేశాల మహిళల టోర్నీలో భారత జట్టు విజేతగా నిలిచింది. డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగిన ఈ టోర్నీలో భారత జట్టు రెండు మ్యాచ్‌ల్లో గెలిచి, రెండు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని ఎనిమిది పాయింట్లతో అజేయంగా నిలిచి టైటిల్ సాధించింది. ఆదివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 3-0తో స్పెయిన్‌పై గెలిచింది. భారత్ తరఫున వందన కటారియా (22వ ని.లో), మోనిక (48వ ని.లో), ఉదిత (58వ ని.లో) ఒక్కో గోల్ చేశారు.

పురుషుల జట్టుకు కాంస్యం

ఇదే టోర్నీ పురుషుల విభాగంలో భారత జట్టు కాంస్య పతకాన్ని దక్కించుకుంది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 2-1 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్‌పై గెలిచింది. భారత్ తరఫున హర్మన్‌ప్రీత్ సింగ్ (15వ ని.లో), దిల్‌ప్రీత్ సింగ్ (50వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... నెదర్లాండ్స్ జట్టుకు థియరీ బ్రింక్‌మన్ (25వ ని.లో) ఏకైక గోల్ అందించాడు.

హర్ష భరతకోటి శుభారంభం



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ హర్ష భరతకోటి శుభారంభం చేశాడు. లెవాన్ పాంట్సులయ (జార్జియా)తో ఆదివారం జరిగిన తొలి రౌండ్ తొలి గేమ్‌లో హర్ష 40 ఎత్తుల్లో గెలిచాడు. గ్రెగరీ కైదనోవ్ (అమెరికా)తో జరిగిన తొలి రౌండ్ తొలి గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ 38 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. భారత గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్, దొమ్మరాజు గుకేశ్, విదిత్, నిహాల్ సరీన్, ప్రజ్ఞానందలకు నేరుగా రెండో రౌండ్‌కు 'బై' కేటాయించారు.

మహిళల విభాగంలో మరీనా బ్రునెల్లో (ఇటలీ)తో జరిగిన తొలి రౌండ్ తొలి గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ అమ్మాయి నూతక్కి ప్రియాంక 27 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక, వైశాలిలకు నేరుగా రెండో రౌండ్‌కు 'బై' లభించింది.

బౌలింగ్‌లోనూ తడబాటే!

- రెండో వన్డేలో భారత్ ఓటమి
- విండీస్‌ను గెలిపించిన హోప్, కార్టీ
- 1-1తో సిరీస్ సమం



బ్రిడ్జ్‌టౌన్: స్వదేశంలో త్వరలో జరిగే వన్డే ప్రపంచకప్‌కు ముందు కరీబియన్ పర్యటనకు వచ్చిన భారత జట్టు టెస్టు సిరీస్ గెలిచేంత వరకు బాగానే ఉంది. కానీ కప్ సన్నాహకమైన కీలక వన్డే సిరీస్‌లో టీమిండియా ఆట ఏమాత్రం బాగోలేదు. తొలి వన్డేలో అర్థంలేని ప్రయోగాలను రెండో వన్డేలోనూ చేసింది. మొదటి మ్యాచ్‌లో గెలిచేందుకు కష్టపడింది. కానీ రెండో మ్యాచ్‌లో టీమిండియా ఎంత కష్టపడినా నెగ్గలేకపోయింది. తమ కెరీర్‌లో ఆఖరి వన్డే ప్రపంచకప్ అనుకుంటున్న కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ కోహ్లిలకు ప్రతీ మ్యాచ్ కీలకం కాగా... వీళ్లిద్దరు విశ్రాంతి తీసుకున్న వైనం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కానేకాదు. అందుకేనేమో మెగా టోర్నీకి అర్హత సాధించలేకపోయిన వెస్టిండీస్ జట్టు చేతిలో టీమిండియా అపహాస్యం కావాల్సి వచ్చింది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ఈ రెండో వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో విండీస్ చేతిలో పరాజయం చవిచూసింది. హార్దిక్ పాండ్యా సారథ్యంలోని భారత్ 40.5 ఓవర్లలో 181 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు ఇషాన్ కిషన్ (55 బంతుల్లో 55; 6 ఫోర్లు, 1 సిక్స్), శుబ్‌మన్ గిల్ (49 బంతుల్లో 34; 5 ఫోర్లు) మాత్రమే బాగా ఆడారు. తర్వాత పసలేని బౌలింగ్‌పై సులువైన లక్ష్యాన్ని వెస్టిండీస్ 36.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసి ఛేదించింది. కెప్టెన్ షై హోప్ (80 బంతుల్లో 63 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కీసీ కార్టీ (65 బంతుల్లో 48 నాటౌట్; 4 ఫోర్లు) విండీస్‌ను గెలిపించారు. భారత బౌలర్లలో శార్దుల్ ఠాకూర్ 3 వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్‌కు వికెట్ దక్కింది. నిర్ణాయక వన్డే రేపు టరోబాలో జరుగుతుంది.

శార్దుల్ రాణించినా...

భారత బౌలర్లలో శార్దుల్ ఠాకూర్ తన పేస్‌తో నిప్పులు చెరిగాడు. ఇన్నింగ్స్ 9వ ఓవర్లో జోరుమీదున్న ఓపెనర్లు మేయర్స్ (28 బంతుల్లో 36; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బ్రాండన్ కింగ్ (23 బంతుల్లో 15; 3 ఫోర్లు)లను అవుట్ చేశాడు. కాసేపటికే వన్‌డౌన్‌లో వచ్చిన అతనెజ్ (6)కూ శార్దుల్ క్రీజులో నిలిచే అవకాశమివ్వలేదు. 72 పరుగులకే టాపార్డర్ వికెట్లన్నీ పడ్డాయి. వంద పరుగుల్లోపు మరో వికెట్ హెట్‌మైర్ (9) రూపంలో పడింది. కుల్దీప్‌కు ఈ వికెట్ దక్కింది. 17 ఓవర్లలో విండీస్ స్కోరు 91/4. ఈ దశలో భారత్‌కు గెలిచే అవకాశం కనిపించింది. కానీ కెప్టెన్ షై హోప్, కార్టీతో కలిసి ప్రత్యర్థి జట్టుకు ఆ చాన్సు ఇవ్వకుండా క్రీజ్‌లో పాతుకుపోయాడు. ఈ క్రమంలో హోప్ 70 బంతుల్లో అర్ధసెంచరీ సాధించగా... ఇద్దరు కలిసి అబేధ్యమైన ఐదో వికెట్‌కు 91 పరుగులు చేశారు. ఈ మ్యాచ్ విచిత్రమేంటంటే... భారత్ 90 పరుగుల వద్ద తొలి వికెట్‌ను కోల్పోయి 181 పరుగులకు ఆలౌటైంది. కానీ అదే విండీస్ 91 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోయాక మళ్లీ వికెట్‌నే చేజార్చుకోలేదు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: 181; **వెస్టిండీస్ ఇన్నింగ్స్:** బ్రాండన్ కింగ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) శార్దుల్ 15; మేయర్స్ (సి) ఉమ్రాన్ (బి) శార్దుల్ 36; అతనెజ్ (సి) ఇషాన్ (బి) శార్దుల్ 6; షై హోప్ (నాటౌట్) 63; హెట్‌మైర్ (బి) కుల్దీప్ 9; కార్టీ (నాటౌట్) 48; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (36.4 ఓవర్లలో 4 వికెట్లకు) 182.** **వికెట్ల పతనం:** 1-53, 2-54, 3-72, 4-91. **బౌలింగ్:** హార్దిక్ పాండ్యా 6.4-0-38-0, ముకేశ్ 3-0-17-0, ఉమ్రాన్ మాలిక్ 3-0-27-0, శార్దుల్ ఠాకూర్ 8-0-42-3, కుల్దీప్ యాదవ్ 8-0-30-1, జడేజా 6-0-24-0, అక్షర్ పటేల్ 2-1-4-0.

ఎదురులేని సౌత్‌జోన్



పుదుచ్చేరి: దేవధర్ ట్రోఫీ దేశవాళీ జోనల్ వన్డే క్రికెట్ టోర్నీలో సౌత్‌జోన్ జట్టు వరుసగా నాలుగో విజయం సాధించింది. ఈస్ట్‌జోన్ జట్టుతో ఆదివారం జరిగిన నాలుగో లీగ్ మ్యాచ్‌లో సౌత్‌జోన్ ఐదు వికెట్ల తేడాతో గెలిచి 16 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ముందుగా ఈస్ట్‌జోన్ 46 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌటైంది. విరాట్ సింగ్ (49; 4 ఫోర్లు, 1 సిక్స్), శుభ్రాన్షు సేనాపతి (44; 5 ఫోర్లు), ఆకాశ్‌దీప్ (44; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), ముక్తార్ హుస్సేన్ (33; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. సౌత్‌జోన్ బౌలర్లు సాయికిశోర్ (3/45), వాసుకి కౌశిక్ (3/37), విద్వత్ కావేరప్ప (2/40) ప్రత్యర్థి జట్టును కట్టడి చేశారు. అనంతరం సౌత్‌జోన్ 44.2 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 230 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (88 బంతుల్లో 84; 6 ఫోర్లు, 1 సిక్స్), సాయి సుదర్శన్ (67 బంతుల్లో 53; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించి సౌత్‌జోన్ విజయంలో కీలకపాత్ర పోషించారు. ఇతర మ్యాచ్‌ల్లో సెంట్రల్ జోన్ ఎనిమిది వికెట్ల తేడాతో నార్త్‌ఈస్ట్ జోన్ జట్టుపై, వెస్ట్ జోన్ ఆరు వికెట్ల తేడాతో నార్త్‌జోన్‌పై విజయం సాధించాయి.

ఆసీస్ లక్ష్యం 384: ప్రస్తుతం 135/0



లండన్: ఈసారి యాషెస్ సిరీస్ మునుపెన్నడు లేని విధంగా పోటాపోటీగా జరుగుతోంది. ఇప్పుడు ఆఖరి మజిలీ కూడా రసవత్తరంగా మారింది. అయితే ఆటలో అరటిపండులా... రసపట్టుపై వాన చినుకులు అంతరాయం కలిగించాయి. ఆదివారం నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోరు 389/9తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన మరో ఇంగ్లండ్ 6 పరుగులు చేసి ఆలౌటైంది. అండర్సన్ (8)ను అవుట్ చేసి మర్ఫీ (4/110) కూడా స్టార్క్ (4/100)తో సమంగా నిలిచాడు. అనంతరం 384 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా వర్షంతో ఆట నిలిచే సమయానికి 38 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 135 పరుగులు చేసింది. ఓపెనర్లు వార్నర్ (58 బ్యాటింగ్; 9 ఫోర్లు), ఉస్మాన్ ఖ్వాజా (69 బ్యాటింగ్; 8 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. మ్యాచ్ చివరిరోజు సోమవారం ఆసీస్ నెగ్గాలంటే మరో 249 పరుగులు చేయాలి. ఇంగ్లండ్ గెలవాలంటే పది వికెట్లు తీయాలి. లంచ్ బ్రేక్ దాకా 75/0 స్కోరు చేసిన ఆసీస్ రెండో సెషన్‌లోనూ అదే ఆటను కొనసాగించడంతో ఖ్వాజా, వార్నర్ అర్ధ సెంచరీలు పూర్తయ్యాయి. తర్వాత కాసేపటికే వర్షం ముంచెత్తింది. దీంతో ఈ సెషన్‌లో కేవలం 14 ఓవర్ల ఆటే సాధ్యపడింది. ప్రస్తుతం ఆసీస్ 2-1తో ఆధిక్యంలో ఉంది. గత యాషెస్ సాధించడంతో ఈ మ్యాచ్‌తో సంబంధం లేకుండానే సిరీస్‌ను నిలబెట్టుకుంది.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌ఐఏసీఎల్‌లో 450 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలో ఉన్న న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఎన్ఐఏసీఎల్).. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐఏసీఎల్ శాఖల్లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్-1) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 450
» **పోస్టుల వివరాలు:** రిస్క్ ఇంజనీర్-36, ఆటో మొబైల్ ఇంజనీర్లు-96, లీగల్-70, అకౌంట్స్-30, హెల్త్-75, ఐటీ-23, జనరలిస్ట్స్-120.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేట్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.80,000 చెల్లిస్తారు.
» **వయసు:** 01.08.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రాథమిక రాతపరీక్ష, ప్రధాన రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.08.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.08.2023
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.newindia.co.in

కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో జూనియర్ ఇంజనీర్ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలు/శాఖల్లో గ్రూప్-బి(నాన్ గెజిటెడ్) జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** కేంద్ర జల సంఘం, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, విద్యుత్ రీసెర్చ్ స్టేషన్, మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీస్, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, ఫరక్కా బ్యారేజ్ ప్రాజెక్టు, నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, డైరెక్టరేట్ ఆఫ్ క్వాలిటీ అస్యూరెన్స్, పోర్ట్స్, షిప్పింగ్-వాటర్‌వేస్ తదితర సంస్థల్లో సంబంధిత విభాగంలో పనిచేసే అవకాశం లభిస్తుంది.
» **అర్హత:** డిప్లొమా(సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్) తత్సమానం లేదా డిగ్రీ(సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్) చదివినవారు అర్హులు.
» **వయసు:** పోస్టులకు అనుగుణంగా 18 నుంచి 32 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. వివిధ కేటగిరీల వారికి గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
» **వేతనం:** సెవెన్త్ పే స్కేలు ప్రకారం-.35,400 నుంచి రూ.1,12,400 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** పేపర్-1, పేపర్-2 రాతపరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** పరీక్ష రెండు అంచెల్లో ఉంటుంది. పేపర్-1, పేపర్-2 ఉంటాయి.
» పేపర్-1 ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది. ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పేపర్-2(డిస్క్రిప్టివ్) ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. పేపర్-1 పరీక్ష 200 ప్రశ్నలు-200 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి రెండు గంటలు.
» పేపర్-2 మొత్తం 300 మార్కులకు జరుగుతుంది. ఈ పరీక్ష పెన్ అండ్ పేపర్ విధానంలో డిస్క్రిప్టివ్ పద్ధతిలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.08.2023.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ,విశాఖపట్నం, విజయనగరం
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** అక్టోబర్ 2023.
» **వెబ్‌సైట్:** https://ssc.nic.in

ఐపీపీబీ, న్యూఢిల్లీలో 132 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్(ఐపీపీబీ)..కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 132
» **అర్హత:** ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.30,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్/గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 26.07.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.08.2023
» **వెబ్‌సైట్:** www.ippbonline.com

డా.వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ, విజయవాడలో పీజీ, ఎండీఎస్ కోర్సుల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య, దంత వైద్య కళాశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికిసంబంధించి అందుబాటులో ఉన్న పీజీ (ఎండీ/ఎంఎస్), ఎండీఎస్ కన్వీనర్ కోటా సీట్ల ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది.

» **అర్హత:** ఎంబీబీఎస్/బీడీఎస్ డిగ్రీతో పాటు నీట్ పీజీ-2023/నీట్ ఎండీఎస్-2023 ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.07.2023
» **వెబ్‌సైట్:** drysr.uhsap.in

ఎస్ఐ కొలువుల పిలుపు

» ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్ దళాల్లో 1,876 ఎస్ఐ ఉద్యోగాలు
» నియామక ప్రకటన విడుదల చేసిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్
» ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో దరఖాస్తుకు అర్హత
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ

పోలీస్ ఉద్యోగ అభ్యర్థులకు శుభవార్త! జాతీయ స్థాయిలో.. కీలకమైన విభాగాల్లో.. సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ) కొలువు సొంతం చేసుకునే అవకాశం వచ్చింది! స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. ఢిల్లీ పోలీస్ విభాగంతోపాటు సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్)లో.. మొత్తం 1,876 ఎస్ఐ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏదైనా డిగ్రీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. గ్రూప్-బి(నాన్-గెజిటెడ్), గ్రూప్-సి హోదాల్లో కొలువు సొంతమవుతుంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..



మొత్తం 1,876 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజా నోటిఫికేషన్ ద్వారా ఢిల్లీ పోలీస్ విభాగంతోపాటు, కేంద్ర హోంశాఖ పరిధిలోని సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌లో మొత్తం 1,876 ఉద్యోగాలను భర్తీ చేయనుంది. ఇందుకోసం రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్‌లు నిర్వహించనుంది.

అర్హతలు

- ఆగస్ట్ 15, 2023 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలి. ▪ **వయసు:** ఆగస్ట్ 1, 2023 నాటికి 20-25 ఏళ్లు ఉండాలి. ఎస్‌సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.
- ప్రారంభ వేతన శ్రేణి రూ.35,400-రూ.1,12,400గా ఉంటుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్ ఎస్ఐ పోస్టులకు మూడు దశల్లో ఎంపిక ప్రక్రియను నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష(పేపర్-1), ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్/ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, రాత పరీక్ష (పేపర్-2).

రాత పరీక్ష పేపర్-1

- పేపర్-1 పరీక్ష మొత్తం 200 మార్కులకు నాలుగు విభాగాల్లో(జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్) జరుగుతుంది. ఒక్కో విభాగం నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 200 మార్కులు ఉంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహిస్తారు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును తగ్గిస్తారు.

రెండో దశ.. ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

- తొలిదశ రాత పరీక్షలో నిర్దేశిత కటాఫ్ మార్కులు సాధించిన వారికి రెండో దశలో ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో అర్హత సాధించేందుకు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- పురుష అభ్యర్థుల కనీస ఎత్తు 170 సెంటీ మీటర్లు ఉండాలి. అదే విధంగా ఛాతీ విస్తీర్ణం 80 సెంటీ మీటర్లు ఉండాలి(శ్వాస పీల్చినప్పుడు 85 సెంటీ మీటర్లకు విస్తరించాలి). మహిళా అభ్యర్థుల కనీస ఎత్తు 157 సెంటీ మీటర్లు ఉండాలి.

ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్

- ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌లో నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగిన అభ్యర్థులకు తర్వాత దశలో ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్(పీఈటీ) పేరుతో పలు ఈవెంట్స్‌లో పోటీ నిర్వహిస్తారు.
- **పరుగు పందెం:** పురుష అభ్యర్థులు 100 మీటర్ల పరుగును 16 సెకన్లలో, మహిళా అభ్యర్థులు 18 సెకన్లలో పూర్తి చేయాలి. దీంతోపాటు పురుష అభ్యర్థులు 1.6 కిలో మీటర్ల దూరాన్ని 6.5 నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు 800 మీటర్ల పరుగును నాలుగు నిమిషాల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.
- **లాంగ్ జంప్:** పురుష అభ్యర్థులు 3.65 మీటర్ల దూరం,మహిళా అభ్యర్థులకు 2.7 మీటర్ల దూరం
- **హై జంప్:** పురుష అభ్యర్థులకు 1.2 మీటర్ల ఎత్తు, మహిళలు 0.9 మీటర్ల ఎత్తు.
- **షాట్‌పుట్:** పురుషులకు మాత్రమే ఈ ఈవెంట్ నిర్వహిస్తారు. అభ్యర్థులు 16 ఎల్‌బీ (7.26 కిలోగ్రామ్‌ల)ను 4.5 మీటర్ల దూరం విసరాల్సి ఉంటుంది.
- లాంగ్ జంప్, హై జంప్, షాట్‌పుట్ ఈవెంట్లలో నిర్దేశిత లక్ష్యాలను కనీసం మూడు ప్రయత్నాల్లో పూర్తి చేయాలి.

పేపర్-2 రాత పరీక్ష

ఫిజికల్ ఈవెంట్స్‌లో అర్హత సాధించిన వారికి పేపర్-2 పేరుతో రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌పై మొత్తం 200 ప్రశ్నలతో 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష కూడా పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పరీక్షకు లభించే సమయం రెండు గంటలు.

కొలువు ఖరారు

పేపర్-2 పరీక్షలోనూ మెరుగైన ప్రతిభ కనబరిచి తుది జాబితాలో నిలిస్తే.. ఎస్ఐ కొలువు ఖాయమైనట్లే! ఢిల్లీ పోలీస్ విభాగానికి ఎంపికైన వారికి గ్రూప్-సి హోదా, సీఏపీఎఫ్ దళాలకు ఎంపికైన వారికి గ్రూప్-బి(నాన్-గెజిటెడ్) హోదా కల్పిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న విభాగం ప్రాథమ్యతలు, వారు పొందిన మార్కులు ఆధారంగా ఆయా విభాగాలకు కేటాయిస్తారు.

శిక్షణలో ఉత్తీర్ణత తప్పనిసరి

నియామకాలు ఖరారు చేసుకుని శిక్షణకు ఎంపికైన అభ్యర్థులు ఏడు ఫిజికల్ ఈవెంట్స్‌కు సంబంధించిన టెస్ట్‌లలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. వెర్టికల్ బోర్డ్‌పై జంపింగ్, రోప్ జంపింగ్, టార్జాన్ స్వింగ్, హారిజంటల్ బోర్డ్‌పై జంపింగ్, పార్లెల్ రోప్, మంకీ క్రాల్, వెర్టికల్ రోప్ ఈ వెంట్స్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. అప్పుడే వారిని ఆయా దళాల్లో కొలువులకు పంపుతారు

సన్నద్ధత పక్కాగా

ఎంపిక ప్రక్రియలో కీలకమైన రాత పరీక్షలకు అభ్యర్థులు పక్కా ప్రణాళికతో సన్నద్ధత సాగించాల్సి ఉంటుంది. ముఖ్యంగా పేపర్-1, పేపర్-2లలో కనీస అర్హత మార్కుల నిబంధన ఉంది. అన్ రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు, ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ కేటగిరీ అభ్యర్థులు 25% మార్కులు, ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 20% మార్కులు పొందాల్సి ఉంటుంది. అప్పుడే సదరు అభ్యర్థులను తదుపరి దశకు పరిగణనలోకి తీసుకుంటారు.

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

ఈ విభాగంలో రాణించేందుకు వెర్బల్, నాన్-వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. ముఖ్యంగా స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్

అభ్యర్థుల్లోని సామాజిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే విభాగం ఇది. భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో రాణించాలంటే.. ప్యూర్ మ్యాథ్స్ తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్, కాంప్రహెన్షన్

ఈ విభాగంలో రాణించడానికి.. బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్,సినానిమ్స్,మిస్-స్పెల్ట్ వర్డ్స్,ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూటషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టుతోపాటు, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు అవసరం. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర వ్యాసాలు చదివి.. అందులోని ముఖ్యాంశాలతో సొంత శైలిలో పరీక్షలో నిర్దేశించిన మాదిరిగా క్రోడీకరించడానికి సాధన చేయాలి.

ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్

ఫిజికల్ ఈవెంట్స్‌లో రాణించడానికి.. అభ్యర్థులు రాత పరీక్ష ప్రిపరేషన్ దశ నుంచే ఆ దిశగా కృషి చేయాలి. ప్రతిరోజు కనీసం రెండు గంటలు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో పేర్కొన్న అంశాలపై శిక్షణ పొందాలి. ఈ ఫిజికల్ ప్రాక్టీస్ ఉదయం వేళల్లో చేస్తే శారీరక అలసటకు దూరంగా ఉండొచ్చు. ఇలా దరఖాస్తు సమయం నుంచే సన్నద్ధత పొందితే విజయావకాశాలు మెరుగవుతాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 15.08.2023
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** ఆగస్ట్ 16, 17 తేదీల్లో
- **పేపర్-1 రాత పరీక్ష:** అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, కర్నూలు, రాజమండ్రి, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, చీరాల, విజయనగరం, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://ssc.nic.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
107	14
66,160	19,646

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	14,316	△	267
డోజోన్స్	35,459	△	177
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,694	△	2
డాక్స్	16,470	△	64
షాంఘై	3,276	△	59
నికాయ్	32,759	▽	132

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

భారతి సిమెంట్
అత్యుత్తమ నాణ్యతకు హామీ.
అల్ట్రాఫాస్ట్
ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్

ఫారిన్ టూర్.. ఫారెక్స్ కార్డ్ బెటర్!

భారత్ నుంచి విదేశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగార్థులు, పర్యాటకుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. గతంతో పోలిస్తే **విదేశీ ప్రయాణం** ఎంతో సౌకర్యంగా మారింది. విమానాశ్రయాలు, విమాన సర్వీసుల నెట్‌వర్క్ విస్తృతం అయింది. ఎక్కడి **నుంచి ఎక్కడికైనా** వేగంగా, సులభంగా ప్రయాణించే వెసులుబాటు దక్కింది. మరి విదేశాలకు వెళ్లే వారు తమ వెంట ఆయా **దేశానికి చెందిన** కరెన్సీని కూడా తీసుకెళుతుంటారు. ఈ అవసరాన్ని తప్పించేదే ఫారెక్స్ కార్డ్. ఏ దేశానికి వెళితే ఆ దేశ కరెన్సీ రూపంలో ఈ కార్డ్ ద్వారా చెల్లింపులు చేసుకోవచ్చు. ఫారెక్స్ కార్డ్ ఉంటే కరెన్సీ నోట్లు పాకెట్‌లో లేకపోయినా ఇబ్బంది పడే పరిస్థితి రాదు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా ఇది చెల్లుతుంది. డెబిట్, క్రెడిట్ కార్డ్ కంటే ఫారెక్స్ కార్డ్ వల్ల ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. ఈ ఫారెక్స్ కార్డుతో ప్రయోజనాలు? ఎలా పనిచేస్తుంది? ఇందులో ఎన్ని రకాలు? చార్జీలు తదితర విషయాలను తెలియజేసే కథనమే ఇది!



ఈ కార్డ్‌తో సౌకర్యంగా చెల్లింపులు • ఏటీఎం నుంచి నగదు ఉపసంహరణ కూడా..
ఒకేసారి ఎన్నో దేశాల కరెన్సీ లోడింగ్ • క్రెడిట్ కార్డ్ కంటే చార్జీలు తక్కువ
అన్ని దేశాల్లోనూ ఆమోదనీయం • కరెన్సీ తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు

ఫారెక్స్ కార్డ్ అంటే..?

ఇదొక ప్రీపెయిడ్ కార్డ్. మీరు వెళ్లాలనుకునే దేశ కరెన్సీ మారకంలో డిపాజిట్ చేసుకుని, వినియోగించుకునే సాధనం. ఈ కార్డ్‌తో విదేశాల్లో చెల్లింపులు చేయడమే కాకుండా, ఏటీఎం నుంచి ఆ దేశ కరెన్సీని ఉపసంహరించుకోవచ్చు. ఈ కార్డ్ ఉంటే వెంట భౌతిక రూపంలో కరెన్సీని తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు.

ఫారెక్స్ కార్డుల్లో రకాలు...

విదేశాలకు వెళ్లే వారికి క్రెడిట్, డెబిట్ కార్డ్‌లతో పోలిస్తే ఫారెక్స్ కార్డ్ ఎంతో ఉపయోగకరం అని చెప్పుకోవాలి. పర్యాటకుల అవసరాలకు అనుగుణంగా ఈ కార్డుల్లో పలు రకాలు ఉన్నాయి. సింగిల్ కరెన్సీ ఫారెక్స్ కార్డ్ ఇందులో ఒకటి. ఏదైనా ఒక దేశ కరెన్సీనే ఇందులో లోడ్ చేసుకోవచ్చు. మల్టీ కరెన్సీ ఫారెక్స్ కార్డ్ రెండో రకం. ఇందులో ఒకటికి మించిన దేశాల కరెన్సీలను లోడ్ చేసుకోవచ్చు. వివిధ దేశాలకు వెళ్లే వారికి మల్టీ కరెన్సీ ఫారెక్స్ కార్డ్ ఉపయోగకరం. దాదాపు ప్రముఖ బ్యాంకులన్నీ కూడా ఫారెక్స్ కార్డ్‌లను ఆఫర్ చేస్తున్నాయి.

ప్రయోజనాలు/సదుపాయాలు

విదేశాల్లో చెల్లింపులు సురక్షితంగా చేసేందుకు ఫారెక్స్ కార్డ్ అనుకూలం. క్రెడిట్ కార్డ్‌కు మాదిరే అన్ని రకాల సదుపాయాలు కూడా వీటిల్లో ఉంటాయి. ఇది ప్రీపెయిడ్ కార్డ్ కావడంతో, ముందుగానే బ్యాంక్ ఖాతా నుంచి లోడ్ చేసుకోవాలి. ఫలితంగా విదేశాల్లో వినియోగంపై స్వీయ నియంత్రణ ఉంటుంది. కావాల్సినంతే లోడ్ చేసుకోవచ్చు. అంతే మేర ఖర్చు చేసుకోవచ్చు. ఫారెక్స్ కార్డ్‌ను దాదాపు అన్ని చోట్లా ఆమోదిస్తారు కనుక సౌకర్యవంతగా ఉంటుంది. దీంతో ఏటీఎంలు లేదంటే ఇతర ప్రత్యామ్నాయ చెల్లింపుల సాధనాల కోసం చూసుకోవాల్సిన అవసరం రాదు. ముఖ్యంగా కరెన్సీని తీసుకెళ్లే అవసరాన్ని తప్పిస్తుంది. దీంతో నగదుతో పోలిస్తే సౌకర్యం, సురక్షితంగా ఉంటుంది. అంతేకాదు కరెన్సీ విలువల్లో అస్థిరతల ప్రభావం కూడా ఉండదు. లోడ్ చేసిన రోజు విలువే స్థిరంగా కొనసాగుతుంది. దాంతో రోజువారీ కరెన్సీ మారకం హెచ్చుతగ్గుల సమస్య ఉండదు. క్రెడిట్, డెబిట్ కార్డు చార్జీలతో పోలిస్తే ఫారెక్స్ కార్డ్ చౌక ఆప్షన్. క్రెడిట్ లేదా డెబిట్ కార్డ్‌ను ఉపయోగించిన ప్రతి సందర్భంలోనూ కరెన్సీ మారకం చార్జీ పడుతుంది. ఎందుకంటే ఏ దేశంలో ఉంటే ఆ దేశ కరెన్సీలోకి రూపాయిలను మార్చుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఈ మారకం చార్జీని కరెన్సీ మార్కప్ చార్జీగా పేర్కొంటారు. కార్డ్, బ్యాంక్ ఆధారంగా ఈ చార్జీ 2–5 శాతం మధ్య ఉంటుంది. ఫారెక్స్ కార్డుల్లో ఎన్నో సదుపాయాలు ఉండడంతో, సంప్రదాయ చెల్లింపు సాధనాలతో పోలిస్తే ఇవి ఆకర్షణీయమైనవని చెప్పుకోవచ్చు. మల్టీ కరెన్సీ ఫారెక్స్ కార్డ్ ఉంటే, ఒకేసారి ఒక దేశం తర్వాత మరో దేశానికి వెళ్లేట్టు అయితే ఉపయోగకరంగా ఉంటుంది. కావాల్సిన ప్రతిసారీ బ్యాంకుల్లో కరెన్సీని మార్చుకోవడం కంటే ఫారెక్స్ కార్డు తీసుకెళ్లడమే సౌకర్యం. బ్యాంకులకు సైతం ఫారెక్స్ కార్డులతో తక్కువ వ్యయం అవుతుంది. దీంతో అవి ఫారెక్స్ కార్డుదారులకు ఆ ప్రయోజనాలను అందిస్తుంటాయి. భౌతిక కరెన్సీతో పోలిస్తే ఫారెక్స్ కార్డులో లోడ్ చేసుకోవడం వల్ల మరింత మెరుగైన మారకం రేటు సాధ్యపడుతుంది. ఈ కార్డ్ పొందేందుకు ఆయా బ్యాంక్ ఖాతాదారు కావాల్సిన అవసరం లేదు. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాల్సిన అవసరం కూడా లేదు. ఇది ప్రీపెయిడ్ కార్డ్ కనుక, బ్యాంక్‌లు సులభంగా మంజూరు చేస్తుంటాయి. మార్కెట్లో వివిధ బ్యాంకులు ఎన్నో ఫీచర్లతో వీటిని ఆఫర్ చేస్తున్నాయి. వీటి గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాత, తమకు అనుకూలమైనది తీసుకోవచ్చు. ఒకవేళ ఫారెక్స్ కార్డ్‌ను ఎక్కడైనా కోల్పోతే, వెంటనే బ్యాంక్ లేదా ఎన్‌బీఎఫ్‌సీకి కాల్ చేసి చెబితే మిగిలిన బ్యాలన్స్ దుర్వినియోగం కాకుండా ఫ్రీజ్ చేసేస్తారు. విదేశాల్లోని పీవోఎస్ మెషీన్ల వద్ద ఫారెక్స్ కార్డులను స్వైప్ చేస్తే ఎలాంటి చార్జీలు పడవు. కానీ అదే డెబిట్, క్రెడిట్ కార్డులను స్వైప్ చేసిన ప్రతిసారీ ఎంతో కొంత చార్జీ పడుతుంది. పైగా ఇతర సాధనాలతో పోలిస్తే ఫారెక్స్ కార్డులకు అంతర్జాతీయంగా ఎక్కువ ఆమోదం ఉంటుంది. అంతేకాదు విదేశాల్లో ఆన్‌లైన్ కొనుగోళ్లకు సైతం ఫారెక్స్ కార్డులతో చెల్లింపులు చేసుకోవచ్చు. క్రెడిట్ కార్డ్‌పై విదేశాల్లో ఖర్చు చేస్తే సకాలంలో చెల్లింపులు చేయకపోతే, భారీ వడ్డీ, లేట్ పేమెంట్ ఫీజులు పడతాయి. ఫారెక్స్ కార్డ్ ప్రీపెయిడ్ కార్డ్ కావడంతో ఈ సమస్య ఉండదు.

- ఒకేసారి ఒకటికి మించిన దేశాలను పర్యటించే వారు, ఆయా దేశాల కరెన్సీని వెంట తీసుకెళ్లే ఇబ్బంది లేకుండా, మల్టీ కరెన్సీ ఫారెక్స్ కార్డ్ ఎంపిక చేసుకోవడం నయం.
- కార్డ్‌లో బ్యాలన్స్ మిగిలి ఉంటే, స్వదేశానికి వచ్చిన తర్వాత ఆ మొత్తాన్ని తిరిగి నగదుగా మార్చుకోవచ్చు.
- విదేశీ పర్యటన ముగించి స్వదేశానికి వచ్చిన తర్వాత.. తిరిగి విదేశానికి వెళ్లేంత వరకు కార్డ్‌ను డీయాక్టివేట్ చేసుకోవచ్చు. మళ్లీ విదేశీ యాత్రకు ముందు యాక్టివేట్ చేసుకోవచ్చు. దీంతో వినియోగం లేకపోయినా చార్జీలు, పెనాల్టీలు పడవు. మెయింటెనెన్స్ చార్జీలు కూడా ఉండవు.
- ఫారెక్స్ కార్డ్‌లపై డీల్స్, డిస్కౌంట్లు వస్తుంటాయి.
- ఫారెక్స్ కార్డుల్లో చాలా వరకు లాక్ట్ ఇన్ ఎక్స్ఛేంజ్ రేట్ అనే ఫీచర్‌తో వస్తాయి. అంటే కరెన్సీ రేటులో అస్థిరతలను ఈ సదుపాయంతో అధిగమించొచ్చు. ఉదాహరణకు కార్డులో డాలర్లు లోడ్ చేసుకుంటే, ఆ రోజు ఉన్న విలువ ప్రకారమే లాక్ అవుతుంది. దాని విలువ బ్యాలన్స్ ముగిసే వరకు స్థిరంగా కొనసాగుతుంది.
- ఫారెక్స్ కార్డ్ లేకుండా వెళితే, విదేశాల్లో అవసరమైన చోట కరెన్సీని మార్చుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఇందుకోసం శ్రమపడాల్సి రావచ్చు. ఫారెక్స్ కార్డ్ అయితే ఉన్న చోట నుంచే కోరుకున్న మారకం రేటులో లోడ్ చేసుకోవచ్చు.
- అంతర్జాతీయ ఈ కామర్స్ పోర్టళ్లపై ఫారెక్స్ కార్డ్‌తో చెల్లింపులు చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లోనూ వర్తకులు ఈ కార్డ్‌ను ఆమోదిస్తారు. విమాన టికెట్ బుకింగ్‌లు, హోటల్ బుకింగ్, డైనింగ్, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ షాపింగ్‌కు వాడుకోవచ్చు.
- ఫారెక్స్ కార్డ్‌తో ఏ దేశంలో ఏటీఎం నుంచి అయినా ఆ దేశ కరెన్సీని విత్‌డ్రా చేసుకోవచ్చు. ఏటీఎం లొకేషన్ ఆధారంగా ఏ దేశంలో ఉన్నారనేది కార్డ్ నెట్‌వర్క్ గుర్తిస్తుంది. సంబంధిత దేశ కరెన్సీని అందిస్తుంది.
- ఫారెక్స్ కార్డ్‌లలో ఎంబెడెడ్ చిప్ టెక్నాలజీ ఉంటుంది. సున్నితమైన సమాచారం ఎన్‌క్రిప్టెడ్‌గా ఉండటంతో మోసాల రిస్క్ చాలా తక్కువ.
- ఇవి కనీసం ఐదేళ్ల ఎక్స్‌పైరీ తేదీతో వస్తాయి.
- ఒక దేశానికి వెళుతూ కొంత బ్యాలన్స్‌ను లోడ్ చేసుకున్న తర్వాత, చివరికి మిగులు ఉందనుకోండి.. ఆ తర్వాత ఆ బ్యాలన్స్‌ను ఏ దేశంలో అయినా వినియోగించుకోవచ్చు.
- మల్టీ కరెన్సీ ఫారెక్స్ కార్డ్‌ల్లో 16–22 దేశాల కరెన్సీలను లోడ్ చేసుకోవచ్చు.

ఫీజులు/చార్జీలు..



కార్డ్ జారీ చేసే సంస్థ ఆధారంగా ఫీజులు, చార్జీలు వేర్వేరుగా ఉంటాయి. సింగిల్ కరెన్సీ కార్డ్‌తో పోలిస్తే మల్టీ కరెన్సీ కార్డ్ చార్జీలు కొంచెం ఎక్కువగా ఉంటాయి. కార్డు కోసం దరఖాస్తు చేసినప్పుడు ఇష్యూయన్స్ చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. ఇది రూ.100–500 మధ్య ఉంటుంది. రీలోడ్, రెన్యువల్ చార్జీలు కూడా చెల్లించుకోవాలి. కార్డులో కరెన్సీని లోడ్ చేసిన ప్రతిసారీ రీలోడ్ చార్జీ పడుతుంది. అదనపు కార్డ్ కావాలంటే యాడాన్ కార్డ్ తీసుకోవచ్చు. దీనికి విడిగా ఫీజు పడుతుంది. కార్డులో బ్యాలన్స్‌ను నగదు రూపంలో తీసుకున్న సందర్భంలోనూ చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. విదేశాల్లో కార్డ్ నుంచి నగదు తీసుకున్న ప్రతి సారీ చార్జీ విధిస్తారు. కార్డ్ బ్యాలన్స్ చెక్ చేసుకున్నా కూడా చార్జీ పడుతుంది. మీరు చెల్లింపులు చేసిన కరెన్సీ, కార్డ్‌లో లోడ్ అయి ఉన్న కరెన్సీ వేర్వేరు అయితే అప్పుడు క్రాస్ కరెన్సీ చార్జీ చెల్లించాల్సి వస్తుంది. ఇది 3.5 శాతం వరకు ఉంటుంది. అదే మల్టిపుల్ కరెన్సీ కార్డులో ఈ సమస్య ఉండదు. కార్డ్‌ను కోల్పోయి, తిరిగి తీసుకుంటే అప్పుడు కూడా చార్జీ పడుతుంది.

వీటిని గుర్తు పెట్టుకోవాలి..



- ప్రతి లావాదేవీ అనంతరం కార్డ్ బ్యాలన్స్ చెక్ చేసుకోవాలి.
- ఫారెక్స్ కార్డ్ ఎక్కడైనా పోగొట్టుకుంటే లేదా చోరీకి గురైనా వెంటనే బ్యాకప్ కార్డ్ తీసుకోవాలి.
- ప్రతీ పర్యటనకు ముందు ఏటీఎంకు వెళ్లి పిన్ మార్చుకోవాలి.
- ఫారెక్స్ కార్డ్‌ను విదేశాల్లో ఇల్లు, కారు, రూమ్ రెంటల్స్‌కు వినియోగించుకోవద్దు.
- కార్డ్‌లో లోడ్ చేసిన కరెన్సీ కాకుండా, మరో కరెన్సీలో చెల్లింపులు చేయకుండా ఉండడమే మంచిది. దీనివల్ల అనవసర వ్యయాలను నివారించుకోవచ్చు.
- టోల్ చార్జీలు చెల్లించేందుకు సైతం ఫారెక్స్ కార్డ్‌ను వాడుకోవద్దు.
- కొన్ని బ్యాంక్‌లు తక్కువ మార్కప్, లోడింగ్ చార్జీతో క్రెడిట్ కార్డులను ఆఫర్ చేస్తున్నాయి. వీటిపై రివార్డులను పరిగణనలోకి తీసుకున్నప్పుడు ఇవి కూడా ఆకర్షణీయంగానే కనిపిస్తాయి. కానీ, అన్నీ తెలుసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.

దరఖాస్తుకు ముందు..




ఫారెక్స్ కార్డ్ తీసుకునే ముందు వివిధ బ్యాంకులు ఆఫర్ చేస్తున్న పలు రకాల కార్డ్‌లు, వాటిల్లోని ఫీచర్లను పూర్తిగా తెలుసుకోవాలి. చార్జీల గురించి అడిగి తెలుసుకోవాలి. బ్యాంక్‌లు, పెద్ద ఆర్థిక సంస్థలు, ప్రముఖ ట్రావెల్ ఏజెన్సీల నుంచి ఈ కార్డ్ తీసుకోవచ్చు. బ్యాంకు శాఖకు వెళ్లి లేదంటే ఆన్‌లైన్ నుంచి అయినా కార్డ్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దాదాపు అన్ని సంస్థలు ఒకటికి మించిన కార్డ్‌లను వివిధ రకాల ఫీచర్లతో ఆఫర్ చేస్తున్నాయి. కార్డ్ తీసుకునేందుకు కొన్ని రకాల డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుతోపాటు పాస్‌పోర్ట్ కాపీ (స్వయంగా అటెస్ట్ చేసింది), వీసా కాపీ, ఎయిర్‌లైన్ టికెట్ కాపీ, పాన్ కార్డ్ కాపీ ఇవ్వాల్సి వస్తుంది. డెబిట్ కార్డ్ మాదిరే ఫారెక్స్ కార్డుకు అనుబంధంగా పిన్ వస్తుంది. దీన్ని మొదటిసారి మార్చుకోవాలి. కార్డు జారీ చేసిన బ్యాంక్ ఏటీఎంకు వెళ్లి బ్యాలన్స్ చెక్ చేసుకోవచ్చు. ఇంటర్నెట్ బ్యాంకింగ్ నుంచి కూడా ఈ సదుపాయం ఉంది. ప్రతి లావాదేవీ అనంతరం వచ్చే ఎస్‌ఎంఎస్‌ను చూసి తెలుసుకోవచ్చు.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ఫలితాలు ఆకర్షణీయం

నికర లాభంలో 61 శాతం వృద్ధి

ముంబై: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ జూన్ త్రైమాసికానికి మెరుగైన ఫలితాలను ప్రకటించింది. నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 61 శాతం వృద్ధితో రూ.765 కోట్లకు దూసుకుపోయింది. క్రితం ఏడాది ఇదే కాలానికి నికర లాభం రూ.474 కోట్లుగానే ఉంది. నికర వడ్డీ ఆదాయం 36 శాతం వృద్ధితో రూ.3,745 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో వడ్డీ ఆదాయం రూ.2,571 కోట్లుగా ఉంది. నిర్వహణ లాభం 45 శాతం వృద్ధితో రూ.1,427 కోట్లకు పెరిగినట్టు బ్యాంక్ తెలిపింది. రుణ ఆస్తుల నాణ్యత కూడా మెరుగుపడింది. స్థూల ఎన్‌పీఏలు 2.17 శాతానికి తగ్గాయి. ఇవి క్రితం ఏడాది ఇదే త్రైమాసికం చివరికి 3.36%గా ఉంటే, ఈ ఏడాది మార్చి చివరికి 2.51 శాతంగా ఉండడం గమనార్హం. నికర ఎన్‌పీఏలు 0.70 శాతానికి పరిమితమయ్యాయి. ''46.5% కాసా రేషియోతో బలమైన ఫ్రాంచైజీని నిర్మిస్తున్నాం. బలమైన బ్రాండ్, విలువలు, కస్టమర్ అనుకూలమైన ఉత్పత్తులు, డిజిటల్ ఆవిష్కరణలతో మా రిటైల్ డిపాజిట్లు చక్కగా వృద్ధి చెందుతున్నాయి''అని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఎండీ, సీఈవో వి.వైద్యనాథన్ తెలిపారు. ఫండెడ్ అసెట్స్ (రాబడినిచ్చే ఆస్తులు) 25% వృద్ధితో రూ.1,71,578 కోట్లకు పెరిగాయి. మొత్తం రుణ ఆస్తుల్లో ఇన్‌ఫ్రా రుణాలు 2.2 శాతానికి తగ్గాయి.

ఎన్‌టీపీసీ లాభం రూ.4,907 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ విద్యుదుత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.4,907 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.3,978 కోట్లతో పోలిస్తే 23 శాతం వృద్ధి చెందింది. ఆదాయం మాత్రం రూ.43,561 కోట్ల నుంచి రూ.43,390 కోట్లకు తగ్గింది. జూన్ క్వార్టర్‌లో 103.98 బిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఉత్పత్తి 104.42 బిలియన్ యూనిట్లుగా ఉంది. కోల్ ప్లాంట్లలో లోడ్ ఫ్యాక్టర్ 77.43 శాతంగా ఉంది.

హావెల్స్ ఇండియా | కీనోట్ క్యాపిటల్ | కొనొచ్చు


సాక్షి ప్లస్



ప్రస్తుత ధర: రూ. 1,324 టార్గెట్: రూ. 1,553

ఎందుకంటే: దేశీ కన్జూమర్ ఎలక్ట్రికల్స్, అప్లయెన్సెస్ విభాగంలో కార్యకలాపాలు విస్తరించిన హావెల్స్ ఇండియా విభిన్న ప్రొడక్టులను రూపొందించి విక్రయిస్తోంది. స్విచ్‌గేర్లు, లైటింగ్, తత్సంబంధ ఉత్పత్తులు, కేబుళ్లు, వైర్లు, ఫ్యాన్లు, హోమ్ అప్లయెన్సెస్, వాషింగ్ మెషీన్లు, వాటర్ హీటర్లు, ఎయిర్ కండిషనర్లు తదితరాలను రూపొందిస్తోంది. ప్రొడక్టులలో 90 శాతంవరకూ దేశవ్యాప్తంగా కంపెనీకి గల 15 సొంత యూనిట్లలోనే తయారు చేస్తోంది. కంపెనీ సుప్రసిద్ధ హావెల్స్‌సహా.. ఇతర ప్రధాన బ్రాండ్లు క్రాబ్‌ట్రీ, స్టాండర్డ్, ఆర్‌ఈవో, లాయిడ్‌లను కలిగి ఉంది. పంపిణీలో దేశవ్యాప్తంగా 17,000కుపైగా ప్రత్యక్ష డీలర్లతోపాటు.. 2,20,000కుపైగా రిటైలర్లతో భారీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకుంది. స్విచ్‌గేర్ ప్రొడక్టుల ద్వారా ఎగుమతి మార్కెట్లలో పట్టు సాధించిన కంపెనీ ఆపై నెమ్మదిగా కేబుళ్లు, వైర్లు, లైటింగ్, ఏసీలకూ విస్తరిస్తోంది. కొద్ది రోజులుగా విదేశీ మార్కెట్లలో కంపెనీ బ్రాండ్లకు గుర్తింపు పెంచుకోవడంపై దృష్టి సారించింది. తద్వారా మార్కెట్లలో మరింత విస్తరించే ప్రణాళికలు అమలు చేస్తోంది. కంపెనీ వృద్ధి బాటలో సాగడమేకాకుండా లాభదాయకతను మరింత మెరుగుపరచుకునేందుకు వీలుగా సొంత, ఇతరత్రా పలు విభాగాలను కలిగి ఉంది. క్యాష్‌ఫ్లో రన్‌రేట్ అంచనాల ప్రకారం ప్రతీ మూడు, నాలుగేళ్లలో ఒకసారి బ్యాలన్స్‌షీట్‌పై ఎలాంటి ఒత్తిడిని కలిగించకుండానే ఇతర కంపెనీలను కొనుగోలు చేసే అవకాశముంది. కంపెనీ ఇప్పటికే సొంతం చేసుకున్న లాయిడ్ నిలకడను అందుకోవడం, సొంత పురోభివృద్ధిని సాధించడం ద్వారా ఇలాంటి మరిన్ని అవకాశాలకు దారి ఏర్పడనుంది.

యాంబర్ ఎంటర్‌ప్రైజెస్ | యస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు




ప్రస్తుత ధర: రూ. 2,434 టార్గెట్: రూ. 2,929

ఎందుకంటే: హీటింగ్, వెంటిలేషన్, ఎయిర్ కండిషనింగ్(హెచ్‌వీఏసీ) పరిశ్రమలో కార్యకలాపాలు విస్తరించిన యాంబర్ ఎంటర్‌ప్రైజెస్ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో ఉంది. ప్రధానంగా ఎయిర్ కండిషనింగ్ విభాగంలో పూర్తిస్థాయి సొల్యూషన్లు అందించే దిశలో కార్యకలాపాలను మెరుగుపరచుకుంటోంది. తద్వారా సొంత తయారీకి ప్రాధాన్యమిచ్చే ప్రధాన బ్రాండ్ల నుంచి వాలెట్ వాటాను పెంచుకోవడంపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా ఏసీ పరిశ్రమను మించి వృద్ధి బాటలో సాగగలమని కంపెనీ యాజమాన్యం విశ్వసిస్తోంది. ఇటీవల యాజమాన్యం వెల్లడించిన వివరాల ప్రకారం ఆర్‌ఏసీ విభాగంలో క్లిష్టమైన ఎలక్ట్రానిక్, మెకానికల్ పరికరాలలో ఆధారపడతగిన పరీక్షల(రెలియబిలిటీ టెస్టింగ్)ను పూర్తి చేసుకుంది. ఆర్డర్లను సాధిస్తోంది. అంతేకాకుండా సామర్థ్యాలను అందుకోవడంతోపాటు.. రైల్వేలకు అనుమతులు పొందుతోంది. ఏసీ కోచ్‌లను ప్రవేశపెట్టడంలో ఇటీవల రైల్వేలు అత్యంత ఆసక్తిని చూపుతున్న సంగతి తెలిసిందే. మూడేళ్ల కాలపు టెస్టింగ్‌ను పూర్తిచేసుకోవడం ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో చిన్నస్థాయి ఎగుమతుల ఆర్డర్లను పొందనున్నట్లు అంచనా వేస్తోంది. టెలికం ప్రొడక్టులుసహా వేరబుల్స్, హియరబుల్స్ తదితర కొత్త ప్రొడక్టులను ప్రవేశపెడుతోంది. పెట్టుబడుల దశ పూర్తికావడంతో వినిమయం పెరిగి రిటర్న్ రేషియోలు మెరుగుపడనున్నాయి. ఆర్‌ఏసీ మార్కెట్లో ఔట్‌సోర్స్‌డ్ దిగ్గజంగా కంపెనీ సమీప భవిష్యత్‌లో పరిశ్రమను మించిన పనితీరు చూపే వీలుంది. ఇప్పటివరకూ అధిక పెట్టుబడుల కారణంగా కనిష్టస్థాయిల్లో నమోదైన ఆస్తులు ఇకపై మెరుగైన రిటర్నులు సాధించే అవకాశముంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

6 కోట్ల ఐటీఆర్‌ల దాఖలు



న్యూఢిల్లీ: 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను ఇప్పటివరకూ 6 కోట్ల పైచిలుకు ఆదాయ పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలయ్యాయి. ఒక్క ఆదివారం రోజే సాయంత్రం 6.30 గం. వరకు 27 లక్షల ఐటీఆర్‌లు దాఖలయ్యాయి. గతేడాది జూలై 31 నాటికి వచ్చిన ఐటీఆర్‌లతో పోలిస్తే ఈసారి ఇప్పటికే రిటర్నుల ఫైలింగ్ గణనీయంగా పెరిగింది. వేతన జీవులు, తమ ఖాతాలను ఆడిట్ చేయించుకోవాల్సిన అవసరం లేని వారు ఐటీఆర్‌లను ఫైల్ చేయడానికి జూలై 31 ఆఖరు తేదీ. ఐటీఆర్ ఫైలింగ్‌లో ట్యాక్స్‌పేయర్లకు సహాయం అందించేందుకు తమ హెల్ప్‌డెస్క్ వివిధ మాధ్యమాల ద్వారా నిరంతరాయంగా పనిచేస్తోందని ఆదాయ పన్నుల విభాగం పేర్కొంది.

ఇండెక్స్ ఫండ్ ఎంపిక ఎలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మంచి ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునేందుకు ఎటువంటి అంశాలను పరిశీలించాలి? – శశాంక్

మ్యూచువల్ ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియోని చూడాలి. ఇండెక్స్‌తో పోలిస్తే రాబడుల తీరు ఎలా ఉందన్నది పరిశీలించాలి. వ్యాల్యూ రీసెర్చ్ పోర్టల్‌లో అన్ని పథకాలకు సంబంధించి పనితీరు ప్యారా మీటర్లను పరిశీలించుకోవచ్చు. ఇండెక్స్‌తో పోలిస్తే పథకం పనితీరు ఎలా ఉందన్న సమాచారం కూడా లభిస్తుంది. కొంత ట్రాకింగ్ లోపం ఉండే అవకాశం లేకపోలేదు. అంటే ఇండెక్స్ 2 శాతం పెరిగితే.. ఫండ్ పెట్టుబడుల విలువ అదే కాలంలో 2.01 శాతం, 1.99 శాతంగా చూపించొచ్చు. ముఖ్యంగా ఎక్స్‌పెన్స్ రేషియో కీలకం అవుతుంది. రెండు ఇండెక్స్ పథకాల్లో ఒకటి 10 బేసిస్ పాయింట్లు చార్జ్ చేస్తుంటే, మరో పథకం 25 బేసిస్ పాయింట్లు చార్జ్ తీసుకుంటుంటే.. అప్పుడు 10 బేసిస్ పాయింట్ల పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవడమే సరైనది.

నేను స్వల్పకాలం కోసం పెట్టుబడి పెట్టాలని అనుకుంటున్నాను. ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు? – గోపాల్ రామ్

ఇన్వెస్టర్లలో చాలా రకాలు ఉంటారు. కొందరు కేవలం రాబడుల వృద్ధిని చూస్తుంటారు. కొందరు పెట్టుబడి ద్వారా పన్ను తగ్గించుకోవాలని భావిస్తుంటారు. కొందరు క్రమం తప్పకుండా (రెగ్యులర్) ఆదాయం కోసం ఇన్వెస్ట్ చేస్తుంటారు. కొందరు స్వల్పకాలం కోసం పెట్టుబడులు పెడుతుంటారు. అయితే స్వల్పకాలం కోసం పెట్టుబడులు పెట్టే వారు ప్రధానంగా తమ పెట్టుబడిని కాపాడుకోవడానికి మొదట ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. పెట్టుబడి భద్రంగా ఉన్నప్పుడే రాబడులు సాధ్యపడతాయి. ఈ విషయంలో ఇన్వెస్టర్ల ముందు పలు ఆప్షన్లు ఉన్నాయి. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఇన్వెస్ట్ చేయడం ఒక మార్గం. బ్యాంకు సేవింగ్స్ ఖాతాలో ఉంచడం వల్ల వచ్చే రాబడి (3 శాతం) కంటే ఎఫ్‌డీలో వచ్చే రాబడే ఎక్కువ. ఎఫ్‌డీలు ఎంతో సురక్షితమైనవి. బ్యాంకులు సంక్షోభంలో పడినా, ఒక్కో డిపాజిట్ దారునికి రూ.5 లక్షల వరకు బీమా రక్షణ ఉంటుంది. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ (డీఐసీజీసీ) రూపంలో ఆర్‌బీఐ ద్వారా ఈ బీమా సదుపాయం లభిస్తుంది. కానీ, ఈ తరహా సందర్భాలు చాలా అరుదనే చెప్పుకోవాలి. ఎఫ్‌డీల రూపంలో వచ్చే వడ్డీ ఆదాయం సంబంధిత పెట్టుబడిదారుడి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. కనుక ఎఫ్‌డీపై వచ్చే రాబడి పన్ను వర్తించే ఆదాయం కిందకే వస్తుంది. ఒకవేళ 30 శాతం పన్ను పరిధిలో ఉంటే, అటువంటి వారికి ఎఫ్‌డీ మెరుగైన సాధనం అని చెప్పలేం. ఎందుకంటే వచ్చే 7 శాతం రాబడిలో 30 శాతం పన్ను చెల్లించడానికే వెళుతుంది. ఇక స్వల్పకాల పెట్టుబడుల కోసం మరో మార్గం డెట్ మ్యూచువల్ ఫండ్స్. డెట్ ఫండ్స్ నుంచి పెట్టుబడిని వెనక్కి తీసుకున్నప్పుడే రాబడులపై పన్ను పడుతుంది. డెట్ ఫండ్‌లో పెట్టుబడిని మూడేళ్ల వరకు ఉంచితే వచ్చే లాభంపై పన్ను 20 శాతంగా ఉండేది. ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించుకునే అవకాశం కూడా ఈ ఏడాది మార్చి వరకు అమల్లో ఉంది. కానీ, ఈ ప్రయోజనాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. కనుక డెట్ ఫండ్స్‌లో పెట్టుబడుల కాల వ్యవధి ఎంతన్నదానితో సంబంధం లేకుండా వచ్చే రాబడి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. కనుక పన్ను పరంగా ఎఫ్‌డీలకు సమానంగా డెట్ మ్యూచువల్ ఫండ్స్‌ను కూడా కేంద్రం మార్చేసింది. కనుక ఇన్వెస్టర్లు వీటిల్లో తమకు ఏది సౌకర్యం అనిపిస్తే దానినే ఎంపిక చేసుకోవచ్చు. కొన్ని వారాల నుంచి కొన్ని నెలల కోసం అయితే మంచి లిక్విడ్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఒక ఏడాది అంతకుమించిన కాలానికి అయితే అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్, అంతకుమించిన కాలానికి అయితే షార్ట్ డ్యురేషన్ ఫండ్‌ను పరిశీలించొచ్చు. డెట్ ఫండ్స్ అన్నవి రాబడులకు కానీ, పెట్టుబడికి కానీ హామీ ఇవ్వవు. కానీ, ఎఫ్‌డీల్లో పెట్టుబడి, రాబడికి హామీ ఉంటుంది. అందుకని ఒక వేళ డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేట్టు అయితే అధిక నాణ్యమైన పథకాన్ని ఎంపిక చేసుకోవాలి. తక్కువ నాణ్యమైన పేపర్లలో పెట్టుబడులు పెట్టే డెట్ ఫండ్స్‌లో రాబడులతోపాటు రిస్క్ ఎక్కువ. డిఫాల్ట్ రిస్క్ కూడా ఉంటుంది.

గుట్టు దాచారో.. రట్టు చేస్తారు

అభ్యర్థుల నేరచరిత్ర గుర్తించేందుకు సాంకేతికతను వినియోగించనున్న పోలీస్ నియామక మండలి

సాక్షి, హైదరాబాద్: పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు తుదిదశ అత్యంత కీలకమైంది. ఉద్యోగానికి ఎంపికైన ప్రతి అభ్యర్థికి సంబంధించిన ప్రవర్తన, గతంలో నేరచరిత్ర ఏమైనా ఉందా..? ఏదైనా క్రిమినల్ కేసులలో పాత్ర ఏమైనా ఉందా వంటి విషయాలను తుదిదశలో స్థానిక పోలీస్‌స్టేషన్ల నుంచి స్పెషల్ బ్రాంచి సిబ్బంది ద్వారా పోలీస్ నియామక మండలి అధికారులు గుట్టుగా సేకరిస్తారు. నేరచరిత్ర లేదా ఇదివరకు క్రిమినల్ కేసుల్లో ప్రమేయమున్న అభ్యర్థులు పోలీసు ఉద్యోగం సాధించేందుకు తామెక్కడ అనర్హులమవుతామోననే భయంతో తమ నేరచరిత్రను దాచేందుకు ప్రయత్నించడం తెలిసిందే. ఇక విచారణలో ఆ విషయాలు బయటపడకుండా చేసేందుకు తంటాలుపడటం పరిపాటే. ఇక నుంచి అటువంటి వారి ఆటలు సాగనివ్వకుండా పోలీస్ నియామక మండలి ఆధునిక సాంకేతికతను వినియోగించి వారికి అడ్డుకట్ట వేయనుంది. పోలీస్‌శాఖ రోజువారీ విధుల్లో సాంకేతికత వినియోగం పెరగడంతో ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో నమోదయ్యే కేసుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో సీసీటీఎన్ఎస్ (క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టం)లో పొందుపరుస్తున్నారు. అదేవిధంగా ప్రతి కేసు వివరాలు టీఎస్‌కాప్ పోలీస్‌యాప్‌లోనూ నిక్షిప్తం అవుతున్నాయి. పోలీసు నియామక మండలి సీసీటీఎన్ఎస్, టీఎస్‌కాప్ పోలీస్‌యాప్‌ను వినియోగిస్తే క్షణాల్లోనే సదరు అభ్యర్థికి ఏదైనా నేరచరిత్ర ఉంటే తెలిసిపోనుంది.

స్పౌజ్ బదిలీలు చేపట్టాలి

విద్యా శాఖ మంత్రి సబితారెడ్డికి మహిళా టీచర్ల వేడుకోలు



సాక్షి, హైదరాబాద్:స్పౌజ్ ఉపాధ్యాయుల బదిలీలను తక్షణమే చేపట్టాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి స్పౌజ్ టీచర్స్ ఫోరం విజ్ఞప్తి చేసింది. ఆదివారం క్యాంపు కార్యాలయంలో స్పౌజ్ టీచర్స్ ఫోరం సభ్యులు మంత్రిని కలిశారు. ఎస్‌జీటీ, పీఈటీ, భాషా పండితులతో పాటు మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్, మిస్సింగ్ స్పౌజ్ బదిలీలను చేపట్టాలని కోరారు. ఈ బదిలీలు చేపట్టకపోవడంతో ఎదురవుతున్న సమస్యలను మంత్రికి వివరిస్తూ మహిళా టీచర్లు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఏడాది జనవరిలో 615 స్కూల్ అసిస్టెంట్ స్పౌజ్ బదిలీలకు మాత్రమే ప్రభుత్వం అనుమతించిందని, మిగతా 1,550 మంది టీచర్ల బదిలీలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించింది. దీనిపై మంత్రి స్పందిస్తూ, అతి త్వరలో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఎంపీ అసదుద్దీన్‌కు..

స్పౌజ్ టీచర్ల బదిలీ అంశంపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్ ఎంపీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీని టీచర్ల ఫోరం సభ్యులు కలిశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు.

ఏఐసీటీఈతో ఇన్‌సోల్ ఒప్పందం

విద్యార్థుల నైపుణ్యం పెంపునకు వినూత్న పోర్టల్

సాక్షి, న్యూఢిల్లీ: విద్యార్థుల నైపుణ్యం పెంచుకోవడానికి, వారి అర్హతల సమాచారం నిక్షిప్తం చేసుకోవడానికిగాను వినూత్న పోర్టల్‌కు సంబంధించి హైదరాబాద్‌కు చెందిన ఇన్‌సోల్ సంస్థతో ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) అవగాహన ఒప్పందం చేసుకుంది. రెండురోజుల పాటు ప్రగతిమైదాన్‌లో నిర్వహించిన అఖిల భారత శిక్ష సమాగం–2023లో భాగంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఏఐసీటీఈ చైర్మన్ సీతారాం, ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ బుద్ధా చంద్రశేఖర్ సమక్షంలో అధికారులు, సంస్థ ప్రతినిధులు ఎంవోయూ చేసుకున్నారు. సంస్థ సీఈవో కిరణ్ మాట్లాడుతూ గతేడాది నుంచే ఎస్ఆర్ఏఎన్ అనే పోర్టల్ తీసుకొచ్చామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్యార్థుల ధ్రువపత్రాలు సరిచూసుకోవడానికి, డేటా స్టోర్ చేసుకోవడానికి, విద్యార్థుల పూర్వసమాచారం, నైపుణ్యం తెలుసుకోవడానికి ఈ పోర్టల్ ఉపకరిస్తుందన్నారు. పాన్‌కార్డు మాదిరిగా విద్యార్థికి ఓ గుర్తింపు నంబర్ డేటాబేస్ ఈ పోర్టల్ ద్వారా రూపొందించొచ్చని తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా విద్యార్థులు, ఉద్యోగార్థులు, ఉద్యోగులు రూ.1,200 కే నిర్దిష్టమైన ప్రొఫెషనల్, పలు కోర్సులు, ఫారిన్ లాంగ్వేజ్‌లు, పోటీ పరీక్షల అంశాలు నేర్చుకొని ప్రావీణ్యం పరీక్షించుకోవచ్చని కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణ, ప్రత్యూష, సాహిత్య, వన, చరణ్ పాల్గొన్నారు.

గుడ్‌బై ఇండియా..!

మన దేశ పౌరసత్వాన్ని వదులుకుని విదేశీ పౌరసత్వాలు తీసుకుంటున్న భారతీయులు

లక్షల్లో స్వదేశం విడిచి వెళుతున్న జనం | అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో స్థిర నివాసం

ఏటా పెరిగిపోతున్న ఇలాంటి వారి సంఖ్య | పుష్కర కాలంలో 18 లక్షల మంది వరకు 'తెగదెంపులు'

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

ఆదాయార్జన, మెరుగైన సేవలు, మరిన్ని సౌకర్యాలు, వాతావరణానికి, పరిస్థితులకు అలవాటు పడిపోవడం.. కారణం ఏదైనా కావొచ్చు.. వీటన్నిటినీ సానుకూల అంశాలుగానే భావించడం వల్ల అయ్యిండొచ్చు. ఏటా వేలు, లక్షల సంఖ్యలో భారతీయులు దేశం విడిచి వెళ్లిపోతున్నారు. విదేశాల్లో స్థిరపడిపోతున్నారు. ఆయా దేశాల పౌరులుగా మారిపోతున్నారు. అక్కడి పౌరసత్వం కోసం భారతీయ పౌరసత్వం వదులుకుంటున్నారు. పుట్టి, పెరిగిన దేశంతో ఉన్న 'బంధాన్ని'తెంపేసుకుంటున్నారు. దేశ పౌరుడిగా ఉన్న గుర్తింపునకు శాశ్వతంగా గుడ్ బై చెప్పేస్తున్నారు. ఇలా విదేశాల్లో పౌరసత్వం తీసుకుంటున్న వారిలో విద్యావంతులు, ధనికులు, విశేషాధికారాలను పొందుతున్న వారే ఎక్కువగా ఉండగా, ఇలా విదేశీ పౌరసత్వం తీసుకుంటున్నవారి సంఖ్య ఏటా పెరుగుతుండటం గమనార్హం.

గడిచిన పుష్కర కాలంలో ఏకంగా సుమారు 18 లక్షల మంది మన దేశ పౌరుని హోదాను వదులుకున్నారు. కొన్ని పాశ్చాత్య దేశాల్లో ఉన్న విధంగా భారత్‌లో ఉమ్మడి పౌరసత్వానికి ఆమోదం లేకపోవడంతో భారతదేశ పౌరసత్వాన్ని (సిటిజెన్‌షిప్) కాదనుకుని విదేశాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఒకటీ రెండు కాదు.. ఏకంగా 135 దేశాల్లో అక్కడి సిటిజెన్‌షిప్ తీసుకున్న భారతీయులు ఉన్నారు. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.



మన దేశంలో ఏ సంవత్సరంలో ఎంతమంది పౌరసత్వం వదులుకున్నారు..

2011	1,22,819
2012	1,20,923
2013	1,31,405
2014	1,29,328
2015	1,31,529
2016	1,38,520
2017	1,36,000
2018	1,35,726
2019	1,44,017
2020	85,256
2021	1,65,370
2022	2,25,260
2023	87,000 (జూన్) వరకు

12 ఏళ్లలో 18.5 లక్షల మంది వెళ్లిపోయారు..

ప్రతి ఏడాదీ లక్షకు పైగా భారతీయులు విదేశీ పౌరసత్వాన్ని పొందుతున్నారు. భారత విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. వీరిలో దాదాపు 60 శాతానికి పైగా ప్రజలు ఏడు దేశాల్లోనే పౌరసత్వం తీసుకుంటున్నారు. అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ, ఇటలీ వీటిల్లో ఉన్నాయి. ఇటీవలి కాలంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో పాటు సింగపూర్‌లోనూ పౌరసత్వం తీసుకోవడానికి భారతీయులు మొగ్గు చూపుతున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లకు వెళ్లే వారిలో గోవా, పంజాబ్, గుజరాత్, తమిళనాడు, కేరళకు చెందినవారు ఎక్కువగా ఉంటున్నారు. ఇక్కడి పౌరసత్వం వదులుకునే క్రమంలో ఇచ్చే దరఖాస్తులో పొందుపరిచిన వివరాలను బట్టి ఇది వెల్లడైంది.

విదేశీ పౌరసత్వానికే ఓటు

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లే వారు ఉద్యోగం సంపాదించి ఏళ్ల తరబడి అక్కడే ఉండిపోతున్నారు. వీరితో పాటు వర్క్ వీసాలపై వెళ్లేవారిలో ఎక్కువమంది భారత పౌరసత్వాన్ని వదులుకుని అక్కడి సిటిజెన్లుగా మారేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఇక దేశంలో అధిక ఆదాయం కలిగిన వారు, ఇతరులు కూడా విదేశాల్లో స్థిరపడే ఉద్దేశంతో భారత్ వదిలిపోతున్నారు. భారతదేశంలో అధిక ఆదాయం కలిగిన ఎనిమిది వేల మంది ఈ ఏడాది దేశ పౌరసత్వాన్ని వదులుకుని విదేశీ పౌరసత్వం తీసుకోనున్నట్లు.. 'గ్లోబల్ సిటిజెన్‌షిప్ అండ్ రెసిడెన్స్ అడ్వాన్సెస్'పై అధ్యయనం చేసే లండన్‌లోని 'హెన్లీ అండ్ పార్ట్‌నర్స్'అనే సంస్థ ఇటీవల వెల్లడించింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు దాదాపు 87 వేల మంది భారతదేశ పౌరసత్వాన్ని వదులుకుని విదేశాలకు వెళ్లారు.

ఎందుకు వెళ్తున్నారు..?

విదేశీ పౌరసత్వం తీసుకుంటున్న వారిని ఏయే అంశాలు ఎక్కువగా ఆకర్షిస్తున్నాయనేది పరిశీలిస్తే.. ప్రధానంగా భారత్‌లో కంటే మెరుగైన జీవన ప్రమాణాలు, సంపద, ఎక్కువ అవకాశాలు, తక్కువ కాలుష్యం, పిల్లలకు మంచి భవిష్యత్తు వంటివి కారణాలుగా కన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌లో ఆయారంగాల్లో విజయం సాధించిన వారు సైతం విదేశీ పౌరసత్వాన్ని కోరుకుంటున్నట్లు వెల్లడవుతోంది. వర్క్ వీసాలపై వెళ్లేవారు కూడా భారత్‌కు రావడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అక్కడే పౌరసత్వం కోసం ప్రయత్నిస్తున్నారు. భారత్‌లో పన్నుల విధానం నచ్చని వారు.. తక్కువ ఆదాయ పన్ను వసూలు చేసే దేశాలవైపు మొగ్గు చూపుతున్నారు. ఆయా దేశాల్లో ఎక్కువ నైపుణ్యం ఉన్న వారి కొరత.. భారతీయులకు అక్కడ శాశ్వత పౌరసత్వం కల్పించడానికి ఓ కారణంగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. ఇక అధిక నెట్‌వర్త్ ఉన్న వ్యాపారవేత్తలు ఎక్కువగా దుబాయ్, సింగపూర్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, యూకే, ఫ్రాన్స్, మాల్టా వంటి దేశాలను ఎంచుకుంటున్నట్లు సమాచారం. ఐరోపా దేశాల్లో డాక్టర్లు, నర్సులు, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాలకు చెందిన ఐటీ ప్రొఫెషనల్స్‌తో పాటు వెల్డర్స్, ప్లంబర్స్, ఎలక్ట్రీషియన్స్, కార్పెంటర్లకు డిమాండ్ బాగా ఉంది. వీరు కూడా అక్కడ పనిచేయడానికి వెళ్లి అక్కడి పౌరసత్వం పొందుతున్నారని చెబుతున్నారు.

దేశంలో సంపాదించి వెళ్లిపోయేవారు ప్రమాదం



భారత్ పౌరసత్వాన్ని వదులుకుంటున్న వారందరిలో.. దేశంలోని అన్ని రకాల వనరులు ఉపయోగించుకుని బాగా సంపాదించాక ఆ డబ్బుతో యూఎస్, ఆస్ట్రేలియా, ఐరోపా దేశాల్లో పౌరసత్వం తీసుకుంటున్న వారిని అత్యంత ప్రమాదకారులుగా చూడాల్సి ఉంటుంది. ఉద్యోగం, విద్య, తదితర కారణాలతో విదేశాలకు వెళ్లిన వారు కొన్నేళ్లు పోయాక అక్కడే స్థిరపడడాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ వీరంతా వేరే కేటగిరీ కిందకు వస్తారు. ఇక్కడ సంపాదించిన దానికి ఆదాయపు పన్నులు కట్టకుండా ఎగ్గొట్టి ఇతర దేశాల్లో కంపెనీలు పెట్టడం, ఇతర చోట్ల పెట్టుబడులు పెట్టి స్థిరనివాసం ఏర్పరుచుకోవడం వంటివి చేస్తున్నారు. యూఎస్, యూకే తదితర దేశాలు.. ఇమ్మిగ్రేషన్ పాలసీలో భాగంగా పరిశ్రమలు పెట్టినా, కంపెనీల్లో పెట్టుబడులు పెట్టినా పౌరసత్వం ఇస్తున్నాయి. గుజరాత్, పంజాబ్‌లకు చెందిన కొన్ని ప్రాంతాలవారు యూఎస్, కెనడా వంటి దేశాలకు వలస వెళ్లాలన్న లక్ష్యంతోనే ఉండడం గమనార్హం. యూఎస్‌లో గుజరాతీలు హోటల్ వ్యాపారంపై పట్టు సాధించగా, కెనడాలో పంజాబీలు వ్యవసాయంలో, వ్యాపారాల్లో స్థిరపడ్డారు.

\- ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, ప్రముఖ ఆర్థిక వేత్త, హెచ్‌సీయూ మాజీ డీన్

అమెరికా లేదా సింగపూర్ పౌరులైతే..

అమెరికా, సింగపూర్, జపాన్ దేశాల పౌరులైతే.. ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లడానికి వీసా ఇబ్బందులు పెద్దగా లేకపోవడం కూడా ఆయా దేశాల సిటిజన్లుగా మొగ్గుచూపడానికి ఓ కారణంగా చెబుతున్నారు. మన దేశం నుంచి అమెరికాకు పర్యాటక (టూరిస్ట్) వీసా మీద వెళ్లాలంటే.. ఆ వీసా స్లాట్ కోసమే దాదాపు ఆరు నెలల నుంచి సంవత్సరం పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఉంది.

మళ్లీ భారత పౌరసత్వం కష్టమే..!

భారత పౌరసత్వాన్ని వదులుకోవడం ఒకింత సులభమే అయినా, మళ్లీ భారత పౌరసత్వం పొందాలంటే మాత్రం అంత ఈజీ కాదని నిపుణులు చెబుతున్నారు. స్థిరాస్తుల కొనుగోలు, ఇతర అంశాల విషయంలో కూడా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి ఉంటుందని అంటున్నారు.

2019-2021 మధ్యకాలంలో ఏ దేశంలో ఎంతమంది పౌరసత్వం తీసుకున్నారు

	అమెరికా..	కెనడా	బ్రిటన్	ఆస్ట్రేలియా	జర్మనీ	ఇటలీ
2019	61,683	25,381	14,309	21,340	2,157	3,833
2020	30,828	17,093	6,489	13,518	2,152	2,312
2021	78,284	21,597	14,637	23, 533	2,381	5,986

నేడు రెండో విడత ఇంజనీరింగ్ సీట్ల భర్తీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద రెండో విడత సీట్ల కేటాయింపు సోమవారం చేపట్టనున్నారు. మొత్తం 173 కాలేజీల్లో 82,666 సీట్లు అందుబాటులో ఉన్నాయి. తొలిదశలో 70,665 సీట్లు ఎంసెట్ అర్హులకు కేటాయించగా...ఇంకా 12,001 సీట్లు మిగిలిపోయాయి. తొలివిడత సీట్లు కేటాయించిన వారిలో 18 వేలమంది ఇప్పటివరకూ రిపోర్ట్ చేయలేదు. ఈ సీట్లతోపాటుగా తొలి విడతలో మిగిలిన వాటిని కూడా కలుపుకుని మొత్తం 30 వేల సీట్లను భర్తీ చేయనున్నారు. రెండోవిడతకు మొత్తం 53 వేలమంది విద్యార్థులు 23 లక్షల ఆప్షన్లు ఇచ్చారు. ఇందులో ఎక్కువగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌కే ప్రాధాన్యమిచ్చారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే లంగ్ కేన్సర్ నయం చేయొచ్చు

జాతీయ సదస్సులో వైద్యనిపుణులు



జాతీయ సదస్సులో పాల్గొన్న డాక్టర్లు

సాక్షి, హైదరాబాద్(రాంగోపాల్‌పేట్): "లంగ్ కేన్సర్‌ను ప్రాథమికదశలో గుర్తిస్తే.. ఆధునిక చికిత్సతో నయం చేయవచ్చు. పల్మనాలజీ, అంకాలజీ, రేడియాలజీ మరియు పెథాలజీ విభాగాలకు చెందిన వైద్యులంతా కలిసి పనిచేయాలి" అని వైద్యులు సూచించారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్‌సన్‌షైన్ హాస్పిటల్ పల్మనాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం లంగ్ కేన్సర్ –2023 పేరిట జాతీయ సదస్సు నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 150మంది వైద్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు. జాతీయ సదస్సును కిమ్స్‌సన్‌షైన్ హాస్పిటల్ ఆర్‌సీటీఓ సౌబర్ గుప్తా జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. లంగ్ కేన్సర్‌కు సంబంధించి చాలా వరకు చివరిదశలో అంటే నాలుగో స్టేజ్‌లో డాక్టర్లను సంప్రదించడం వల్ల రికవరీ చాలా కష్టంగా మారుతుందన్నారు. ప్రస్తుతం టార్గెట్ థెరపీ, ఇమ్యునోథెరపీ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, టార్గెట్ థెరపీని రోగికి ట్యాబెట్ రూపంలో కూడా అందజేయవచ్చని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ డాక్టర్లు జె.రఘునాథ్‌రెడ్డి, వి.లక్ష్మణ్‌బాబు, కె.యుగవీర్‌గౌడ్‌లు తెలిపారు. ఆగస్టు 1న లంగ్ కేన్సర్ డే సందర్భంగా సికింద్రాబాద్‌లోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో లంగ్ కేన్సర్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్నట్టు డాక్టర్ లక్ష్మణ్‌బాబు తెలిపారు. ఈ జాతీయ సదస్సులో సీనియర్ పల్మనాలజిస్ట్‌లు ఆర్. విజయ్‌కుమార్, సుభాకర్, దీపక్ తల్వార్, మహబూబ్‌ఖాన్, పరంజ్యోతి, శ్రీకాంత్‌గౌడ్, శిరీష్‌కుమార్, స్వాతిరెడ్డి పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

స్టాఫ్ నర్స్ పరీక్షకు కఠిన నిబంధనలు
- చెప్పులు మాత్రమే వేసుకుని రావాలి
- మొబైల్, బ్లూటూత్ వంటి పరికరాలు నిషేధం.. పరీక్షా కేంద్రంలో బయోమెట్రిక్, ఫొటో
- వేళ్లకు మెహిందీ, టాటూ ఉండొద్దు...
- రెండో తేదీన 40,936 మందికి 40 కేంద్రాల్లో పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: స్టాఫ్ నర్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల రెండో తేదీన నిర్వహిస్తోన్న స్టాఫ్ నర్స్ పోస్టుల పరీక్షకు కఠిన నిబంధనలు విధించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది లేదని మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ సభ్య కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 40,936 మందికి 40 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో 24, ఖమ్మంలో 6, నిజామాబాద్‌లో 2, వరంగల్‌లో 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కంప్యూటర్ ఆధారిత టెస్ట్ కాబట్టి ఆన్‌లైన్ సెంటర్లలో ఈ పరీక్షలు జరుగుతాయి. ఒకే రోజు మూడు సెషన్లలో పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం సెషన్ పరీక్ష 9 గంటలకు ప్రారంభం అవుతుంది. అభ్యర్థులు 7.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. 8.45 గంటలకు గేట్ మూసేస్తారు. రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభం అవుతుంది. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 11 గంటలకే చేరుకోవాలి. 12.15 గంటలకు గేట్ మూసేస్తారు. ఇక మూడో సెషన్ పరీక్ష సాయంత్రం 4 గంటలకు ప్రారంభం అవుతుంది. దీనికి హాజరయ్యే అభ్యర్థులు మధ్యాహ్నం 2.30 గంటలకు కేంద్రానికి చేరుకోవాలి. 3.45 గంటలకు గేట్ మూసేస్తారు. అభ్యర్థుల సమాచారాన్ని బయోమెట్రిక్ పద్ధతిలో సేకరిస్తారు. కాబట్టి ముందస్తుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అభ్యర్థులకు సూచనలు

- అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌ను ఏ–4 సైజు పేపర్‌పై ప్రింటవుట్ తీసుకోవాలి. అభ్యర్థి ఫొటో, సంతకం స్పష్టంగా ఉంటేనే హాల్ టికెట్ చెల్లుబాటు అవుతుంది.
- హాల్ టికెట్, ఫొటో లేకుండా లేదా సంతకం లేకుండా ఉంటే అభ్యర్థి 3 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను తప్పనిసరిగా గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన ఒక హామీతో పాటు తీసుకురావాలి. పరీక్ష హాల్‌లోని ఇన్విజిలేటర్‌కు అందజేయాలి. లేని పక్షంలో అభ్యర్థిని పరీక్షకు అనుమతించరు.
- అభ్యర్థులు పాస్‌పోర్ట్/పాన్ కార్డ్/ఓటర్ ఐడీ/ఆధార్ కార్డ్/ ప్రభుత్వ ఉద్యోగి ఐడీ/ డ్రైవింగ్ లైసెన్స్‌లలో ఏదో ఒక చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డును కూడా తీసుకురావాలి.
- రిజిస్ట్రేషన్ వద్ద అభ్యర్థుల బయోమెట్రిక్ సమాచారాన్ని సేకరిస్తారు. కాబట్టి అభ్యర్థులు తమ చేతులపై మెహందీ, ఇంక్, టాటూలు వంటివి వేయించుకోవద్దు.
- గేట్ మూసివేసే సమయానికి నిమిషం ఆలస్యమైనా పరీక్ష హాలులోకి అనుమతించరు.
- అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రం, సెషన్‌లో మాత్రమే పరీక్ష రాయాలి. పరీక్షా కేంద్రం, సెషన్ మార్పు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.
- అభ్యర్థి పరీక్షా కేంద్రం లోపలకు హాల్ టికెట్, నలుపు/నీలం బాల్ పాయింట్ పెన్, చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డులు మాత్రమే తీసుకెళ్లాలి. పారదర్శకమైన వాటర్ బాటిల్ తీసుకురావచ్చు. పరీక్ష హాలులో రఫ్ షీట్లను ఇన్విజిలేటర్ అందజేస్తారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉంటే పోలీస్ కేసు

- అభ్యర్థులు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే, అనర్హత వేటు వేయడమే కాకుండా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేస్తారు. అభ్యర్థులు కాలిక్యులేటర్లు, సెల్ ఫోన్లు, టాబ్స్, పెన్ డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు, వాచ్, లాగ్ టేబుల్స్, వాలెట్, హ్యాండ్ బ్యాగ్‌లు, రైటింగ్ ప్యాడ్‌లు, నోట్స్, చార్ట్‌లు, లూజ్ షీట్‌లు లేదా మరే ఇతర గాడ్జెట్‌లను తీసుకురావడానికి అనుమతి లేదు. అలాగే ఇతర రికార్డింగ్ సాధనాలను అనుమతించరు.
- అభ్యర్థి చెప్పులు మాత్రమే ధరించి పరీక్షా కేంద్రానికి రావాలి. బూట్లు ధరించకూడదు.
- నిర్ణీత సమయానికి ముందే అభ్యర్థులను పరీక్షా కేంద్రం నుంచి బయటకు పంపడానికి అనుమతించరు.

ఖమ్మంలో ఓ పరీక్ష కేంద్రం మార్పు

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఖమ్మం పట్టణంలో ఒక్క పరీక్షా కేంద్రాన్ని మార్పు చేశారు. ప్రియదర్శిని మహిళా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరీక్ష నిర్వహించే స్థితిలో లేదు. కాబట్టి దానికి బదులుగా స్వర్ణ భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఖమ్మం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లలో పరీక్షలు జరుగుతాయి. హాల్ టికెట్ నంబర్లు అలాగే ఉంటాయి. పరీక్షా కేంద్రం మార్పును సూచించే సవరించిన హాల్ టికెట్లను అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలి.

రేపటి నుంచే గురుకుల పరీక్షలు



అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన టీఆర్ఈఐఆర్‌బీ
- ఆగస్టు 1 నుంచి 23 వరకు షెడ్యూల్
- 17 జిల్లాలు..104 పరీక్ష కేంద్రాలు
- హాజరయ్యే అభ్యర్థులు 6.55 లక్షల మంది
- తొలిసారిగా ఆన్‌లైన్‌లో.. రోజుకు మూడు షిఫ్టులు
- సెంటర్ల కేటాయింపుపై అభ్యర్థుల ఆందోళన

సాక్షి, హైదరాబాద్: గురుకులాల్లో ఉద్యోగాల భర్తీకి సంబంధించిన అర్హత పరీక్షలకు సర్వం సిద్ధమైంది. తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ) ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి 23వ తేదీ వరకు వరుసగా ఈ పరీక్షలు జరుగుతాయి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం చొప్పున రోజుకు మూడు సెషన్లలో నిర్వహిస్తారు. తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహించే ఈ పరీక్షలకు 6.55లక్షల మంది హాజరుకానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాల్లో 104 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని అనుకున్నా...

వాస్తవానికి ఈ పరీక్షలన్నీ ఓఎంఆర్ ఆధారితంగా ఆఫ్‌లైన్ పద్ధతిలో నిర్వహించాలని బోర్డు మొదట్లో నిర్ణయించింది. టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారం, తదనంతర పరిస్థితుల నేపథ్యంలో ఆన్‌లైన్ పరీక్షలకే మొగ్గు చూపింది. లక్షల్లో అభ్యర్థులు ఉండడంతో ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ కత్తిమీద సామే అయినా, వ్యూహాత్మక ప్రణాళికతో వేగంగా పరీక్షల నిర్వహణ షెడ్యూల్ ఖరారు చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

సెంటర్ల మార్పు అసాధ్యం

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత అభ్యర్థుల్లో కొందరు పరీక్ష కేంద్రాల చిరునామా చూసి గురుకుల బోర్డుకు ఫిర్యాదు చేస్తున్నారు. సుదూర కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలు ఖరారు చేయడం, ఒక్కో పరీక్షను ఒక్కోచోట రాయాల్సి రావడం సరికాదంటూ అధికారులు, హెల్ప్‌లైన్ కేంద్రాలకు ఫోన్లు, ఈ–మెయిల్ ద్వారా వినతులు సమర్పిస్తున్నారు. అయితే పరీక్ష కేంద్రాల మార్పు అసాధ్యమని గురుకుల బోర్డు స్పష్టం చేసింది. అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్లకు అనుగుణంగానే సెంటర్లు ఖరారు చేశామని, పరీక్ష కేంద్రాల లభ్యతకు అనుగుణంగా ఎంపిక చేయడంతో కొందరికి మొదటి ఆప్షన్‌లో ఉన్న కేంద్రం కేటాయించగా, మరికొందరికి ఎనిమిదవ ఆప్షన్‌లో కేంద్రం అలాట్ అయ్యిందని, ఇదంతా కంప్యూటర్ ఆధారితంగా జరిగినట్టు గురుకుల బోర్డు కన్వీనర్ మల్లయ్యబట్టు 'సాక్షి'కి వివరించారు.

ఆ మూడు రోజులు వేరే సెంటర్‌లో..

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఖమ్మంలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాల నీట మునిగింది. అయితే ఈ కాలేజీని పరీక్ష కేంద్రంగా గుర్తించి ఏర్పాట్లు చేశారు. కానీ కాలేజీ మెజారిటీ ప్రాంతం నీట మునగడంతో వచ్చే 1, 3, 4వ తేదీల్లో ఈ కేంద్రంలో పరీక్షలు రాయాల్సిన అభ్యర్థులకు నిర్దేశించిన తేదీల్లో ప్రత్యామ్నాయంగా సమీపంలోని ఇతర కేంద్రాల్లో సర్దుబాటు చేశారు. ఈమేరకు అభ్యర్థులకు కొత్తగా హాల్‌టికెట్లు జారీ చేశారు. వాటిని గురుకుల బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు అధికారులు వెల్లడించారు. 5వ తేదీ నుంచి ఆ కేంద్రంలో మిగతా పరీక్షలు యథావిధిగా జరుగుతాయంటున్నారు.

ఆయా జిల్లాల్లో ఇలా

- రాష్ట్రంలో అత్యధికంగా మేడ్చల్ జిల్లాలో 32 పరీక్ష కేంద్రాలున్నాయి. ఆ తర్వాత రంగారెడ్డి జిల్లాలో 16 కేంద్రాలు, కరీంనగర్ జిల్లాలో 10 కేంద్రాలో, హైదరాబాద్ జిల్లాలో 5 కేంద్రాలున్నాయి.
- ఆదిలాబాద్ జిల్లాలో కేవలం ఒకేఒక కేంద్రం ఉంది. ఆ పరీక్ష కేంద్రంలో ఒక సెషన్‌లో కేవలం 90 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్ష రాసే అవకాశముంది. అయితే ఆ జిల్లా నుంచి దాదాపు 6వేల మంది దరఖాస్తు చేసుకోగా, సగం మందికి వారు ఇచ్చిన ఆప్షన్లకు అనుగుణంగా సమీపంలో ఉన్న జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించారు.
- నిజామాబాద్ జిల్లాలో కేవలం రెండు పరీక్ష కేంద్రాలు మాత్రమే ఉన్నాయి. ఒక్కో పరీక్ష కేంద్రంలో ఒక సెషన్‌లో కేవలం 300 మంది చొప్పున 600 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యే వీలు ఉంది. ఆ జిల్లా నుంచి దాదాపు 10వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు కేంద్రాల్లో సర్దుబాటు చేస్తూ మిగిలిన అభ్యర్థులకు వారు ఇచ్చిన ఆప్షన్లకు అనుగుణంగా సమీప జిల్లాల్లో సెంటర్లు కేటాయించారు.
- నల్లగొండ జిల్లాకు రెండు కేంద్రాలు, సూర్యాపేట జిల్లాలో 5 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈ రెండు జిల్లాల నుంచి దాదాపు 15వేల మంది దరఖాస్తు చేశారు. కంప్యూటర్ల లభ్యత ప్రకారం సెంటర్లు కేటాయిస్తూ, మిగతా అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంలో కేటాయింపులు జరిపారు.

PRATHIBHA IAS ACADEMY
DEGREE+IAS 3 YEARS INTEGRATED PROGRAM
Hostel Facility Available. KUKATPALLY, Hyd.
B.B.A | B.Com | B.C.A | B.A | B.Sc
PRATHIBHA DEGREE & P.G.COLLEGES
(Affiliated to O.U) (Co-Ed.&Women) 83098 94678

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.